ఆగస్టు
2024

# 220

సంపుటి : 20 సంచిక : 3 వెల రు. 15/-

## ఈ సంచికలో........

ప్రజాస్వామ్యం, వర్గపోరాటం : లెనిన్ భావనలు
విఫలమైన ఒకేదేశం-ఒకే పరీక్ష విధానం
పరీక్షల కేంద్రీకరణతో ప్రమాదం
హిందూత్వ - సాంస్కృతిక దాడి
సామాజిక మార్పుల వరుసక్రమం
ఇయు ఎన్నికల్లో మితవాదుల పైచేయి
భారత జాతీయ ఉద్యమానికి ఆర్ఎస్ఎస్ ద్రోహం!
భౌతికవాద దృక్పథంతో చరిత్రను వివరించడం ఎలా?
మోడీ 3.0 పాలనలో ఆర్థిక విధానాలెలా ఉంటాయి?
కేంద్రం చేతిలో కీలుబొమ్మలు

# ప్రజాస్వామ్యం, వర్గపోరాటం : లెనిన్ భావనలు

**ప్రభాత్ పట్నాయక్**

అచ్చంగా ప్రజాస్వామ్యం గురించి లెనిన్ ఎక్కడా రాయలేదు. అతడు వివిధ రచనల్లో ప్రజాస్వామ్యం గురించి చేసిన ప్రస్తావనలను బట్టి, వివిధ సందర్భాలలో తీసుకున్న వైఖరిని బట్టి లెనిన్‌కు ప్రజాస్వామ్యం పట్ల ఎటువంటి అభిప్రాయాలు ఉన్నాయో మనం నిర్ధారించాలి. ప్రజాస్వామ్యం గురించి లెనిన్ ఎక్కడా జ్ఞాన మీమాంసకు దిగలేదు. ఆయా సమాజాల్లో పరిపాలన నెరపడానికి ఎటువంటి నిబంధనలను రూపొందించాలి అన్నది కూడా లెనిన్ పెద్దగా పట్టించుకోలేదు. వర్గపోరాటాన్ని ముందుకు తీసుకుపోవడం ఎలా? అన్నది మాత్రమే లెనిన్ దృష్టిలో ప్రధానంగా ఉంది. ఏ వ్యవస్థలోని రాజ్యం పట్ల అయినా, ఆ మాటకొస్తే మరే ఇతర విషయం పట్ల అయినా అనుసరించాల్సి వైఖరిని నిర్ణయించేటప్పుడు ప్రధమ ప్రాధాన్యత వర్గపోరాటాన్ని బలపరడానికే ఇవ్వాలి. విప్లవాన్ని సాధ్యం చేయడం, దానిని ముందుకు తీసుకుపోవడం అన్న దృక్పథం నుంచి మాత్రమే లెనిన్ ప్రతీ విషయాన్నీ పరిశీలించాడు అని లూకాక్స్ అన్నాడు.

ఇక బూర్జువా సమాజంలో శ్రామికవర్గం చేపట్టే విప్లవ కార్యాచరణ ముందుకు పోవడానికి ఇతర ఏ రూపం కన్నా ప్రజాస్వామ్యమే అత్యుత్తమ అవకాశాలను కల్పించగలదు అని లెనిన్ స్పష్టం చేశాడు. జారిస్టు రష్యాలో సెన్సార్‌షిప్ దీర్ఘకాలం అమలు కావడం, జారు చక్రవర్తి పోలీసులనుండి, ఇన్‌ఫార్మర్లనుండి వారి కంటబడకుండా తప్పించుకుని తిరగవలసి రావడం విప్లవోద్యమాన్ని నిర్మించడానికి పెద్ద ప్రతిబంధకంగా మారింది. అందుకే ఫిబ్రవరి 1917లో విప్లవం ద్వారా జారు చక్రవర్తిని కూలదోసిన తర్వాత పెట్రోగ్రాడ్‌కు అన్ని తలుపులూ మూసివేసివున్న ఒక రైలులో ప్రయాణించి వచ్చిన లెనిన్ రైలు దిగగానే హమ్మయ్య అని బలంగా ఊపిరి పీల్చుకున్నాడు. ఆ పెట్రోగ్రాడ్ వీధుల్లో నడుస్తున్నప్పుడు తనను ఎవరైనా జారిస్టు



గూఢచారులు అనుసరిస్తున్నారేమో అని అప్పుడప్పుడు వెనుదిరిగి చూసుకోవలసిన అవసరం ఇక లేనందున లెనిన్ ఎంతగానో ఊరట చెందాడు. ఆ తర్వాత ఆందోళన, ప్రచారం వంటివి స్వేచ్ఛగా, బహిరంగంగా నిర్వహించుకోగలిగిన పరిస్థితులు ఏర్పడ్డాక బోల్షివిక్ పార్టీ శరవేగంగా పెరిగింది. ఫిబ్రవరి విప్లవం నాటికి ఆ పార్టీకి కేవలం 40,000 సభ్యత్వం మాత్రమే ఉండేది. రష్యా యుద్ధంలో పాల్గొనడాన్ని వ్యతిరేకిస్తూ బోల్షివిక్ పార్టీ తీసుకున్న వైఖరి ప్రజలను బాగా ఆకట్టుకుంది. పార్టీ వేగంగా పెరగడానికి ఆ వైఖరే ప్రధాన కారణం. ఐతే, ఈ వైఖరిని చాలా తేలికగా ప్రజాబాహుళ్యంలోకి తీసుకుపోగలిగే స్వేచ్ఛాయుత పరిస్థితులు నెలకొనడం కూడా ఒక కారణం.

బూర్జువా సమాజంలో పాలకవర్గాలు ప్రజాస్వామ్యాన్ని రాను రాను కుంచించుకు పోయేవిధంగా వ్యవహరిస్తాయి. చివరికి అది ఒక డొల్లగా మిగిలిపోతుంది. ఆ ప్రయత్నాలను వమ్ము చేసేలా శ్రామికవర్గం బూర్జువా సమాజంలో ప్రజాస్వామ్యం పూర్తి స్థాయిలో వికసించేటట్లు పోరాడాలి. బూర్జువా సమాజంలో పెట్టుబడిదారులు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేప్రయత్నాలను నిరంతరం చేస్తారనీ, దానికి భిన్నంగా అణగారిన తరగతులు ఆ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, మరింత లోతుగా వేళ్ళూనుకునేందుకు పోరాడాలనీ లెనిన్ చెప్పినది ప్రజాస్వామ్యం పట్ల లెనిన్ అవగాహనకు కేంద్ర స్థానంలో ఉంది.

లెనిన్ తీసుకున్న ఈ వైఖరి కేవలం బూర్జువా సమాజానికి మాత్రమే పరిమితం కాదు. సోషలిస్టు సమాజంలో లెనిన్ వైఖరి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. సోషలిస్టు సమాజంలో కార్మికవర్గం ఆ సమాజ నిర్మాణంలో చురుకుగా పాల్గొనాలంటే అక్కడ ప్రజాస్వామ్యం పూర్తిస్థాయిలో నెలకొనివుండాలి. 1917కు ముందు బోల్షివిక్ పార్టీ ఎజండాలో ప్రజాస్వామిక విప్లవ సాధన అనే అంశం ఉంది. పునాదివర్గాల విముక్తిని సాధించే ఆర్థిక కార్యక్రమం అందులో ఉన్నందువలన మాత్రమే దానిని ప్రజాస్వామిక విప్లవం అని అనలేదు. ఆ పునాదివర్గాలకు పూర్తి సాధికారత రావాలంటే వారికి పూర్తి స్థాయిలో స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం అవసరం. అందుకే దానిని ప్రజాస్వామిక విప్లవం అని అన్నారు. రైతు, కార్మిక వర్గాల విప్లవ ప్రజాస్వామిక నియంతృత్వ ప్రభుత్వాన్ని విప్లవానంతరం ఏర్పరచాలన్న వారి లక్ష్యం సారాంశం ఆ విప్లవ ప్రభుత్వం ఒక బహుళ పార్టీ ప్రజాస్వామ్య ప్రభుత్వంగా ఉండాలన్నదే. విప్లవ వ్యతిరేక శక్తులు మినహా తక్కిన అన్ని తరగతులవారికీ అందులో భాగస్వామ్యం ఉండాలి. ఆయా పార్టీలు వారి వారి వార్తా పత్రికలను ప్రచురించుకోవాలి. నిజానికి అప్పట్లో పరిమితంగా లభించే న్యూస్‌ప్రింట్‌ను అన్ని పార్టీల పత్రికలకూ అందేలా చూడడం బోల్షివిక్ పార్టీ కార్య క్రమంలో ఒక కర్తవ్యంగా ఉంది. ఇటువంటి బహుళ పార్టీ వ్యవస్థ పాలన, విప్లవాన్ని కూలదోయాలని కుట్రలు పన్నేవారి నందరినీ పక్కన పెడుతూ ముందుకు సాగే క్రమం శ్రామికవర్గ నియంతృత్వ దశకు చేరుతుంది.

విప్లవ ప్రభుత్వం ఏకపార్టీ నియంతృత్వంగా ఉండాలని ఎక్కడా చెప్పలేదన్నది ఇక్కడ మౌలికమైన అంశం. కాని ఆచరణలో ఏకపార్టీ నియంతృత్వంగా మారింది. రాజ్యం స్వభావం – అది బూర్జువా సమాజం అయినా, సోషలిస్టు సమాజం అయినా, ప్రజాతంత్ర విప్లవ దశలో ఏకపార్టీ పాలనగా ఉండకూడదన్నదే లెనిన్ అభిప్రాయం కూడా. ఒక వర్గానికి ప్రతినిధిగా ఒక పార్టీయే ఉంటుందని, అందుచేత కార్మికవర్గ నియంతృత్వం

(మిగతా 33వ పేజీలో)

## ఈ సంచికలో...


1. ప్రజాస్వామ్యం, వర్గపోరాటం : లెనిన్ భావనలు
ప్రభాత్ పట్నాయక్........2

2. విఫలమైన ఒకేదేశం-ఒకే పరీక్ష విధానం
ప్రొ॥ ఫర్కాన్ కమర్........4

3. పరీక్షల కేంద్రీకరణతో ప్రమాదం
ప్రొ॥ అపూర్వానంద్........5

4. హిందూత్వ - సాంస్కృతిక దాడి
........11

5. సామాజిక మార్పుల వరుసక్రమం
ఎంవిఎస్ శర్మ........16

6. ఇయు ఎన్నికల్లో మితవాదుల పైచేయి
సుసాన్ రామ్........19

7. భారత జాతీయ ఉద్యమానికి ఆర్ఎస్ఎస్ ద్రోహం!
ఏజీ నూరాని........ 21

8. భౌతికవాద దృక్పథంతో చరిత్రను వివరించడం ఎలా?
........26

9. మోడీ 3.0 పాలనలో ఆర్థిక విధానాలెలా ఉంటాయి?
సిపి చంద్రశేఖర్........ 28

10. కేంద్రం చేతిలో కీలుబొమ్మలు
ఎ కోటిరెడ్డి........ 30



సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at: cpim.org


# ప్రజావ్యతిరేక బడ్జెట్

2047 నాటికి 'వికసిత్ భారత్' నిర్మాణం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందనీ, జులై 23న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశాన్ని అటువైపు తీసుకుపోతుందనీ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బడ్జెట్ అనంతర ప్రసంగంలో ఘనంగా ప్రకటించారు. కానీ బడ్జెట్ ప్రతిపాదనలను జాగ్రత్తగా పరిశీలించేవారెవరికైనా ఇది దేశాన్ని వికసిత్ భారత్‌వైపుకు కాదు, 'అధో భారత్' వైపు తీసుకుపోతుందన్న సంగతి అర్థ మవుతుంది.

గత కొన్ని దశాబ్దాలుగా, ముఖ్యంగా మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశంలోని కార్పొరేట్లు విపరీతమైన లాభాలు మూటగట్టుకొంటున్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలు దీనికి మరింత దోహదం చేస్తున్నాయి. ఈ లాభాలతో కార్పొరేట్లు ఆధునిక యంత్రాలు కొనుగోలుచేసి కొత్త పరిశ్రమలు పెడితే దేశం నిజంగానే ముందుకు పోయేది. కానీ కొన్ని ఏళ్లుగా మోడీ ప్రభుత్వం వారికి ఎన్నిరాయితీలు ఇస్తున్నప్పటికీ వారు పారిశ్రామిక రంగంలో పెట్టుబడులు పెట్టడం లేదు. దానికి కారణం మార్కెట్‌లో గిరాకీ లేకపోవడమేనని ఆర్థిక వేత్తలంతా ముక్తకంఠంతో చెబుతున్న విషయమే. తెలివైన ప్రభుత్వమేదైనా ఆర్థిక రంగంలో గిరాకీ పెంచాలంటే బడ్జెట్‌లో ప్రజల కొనుగోలు శక్తి పెంచే చర్యలు తీసుకోవాలి. దానికిగాను ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలి.

45 ఏళ్లలో ఎన్నడూ ఎరుగని నిరుద్యోగం దేశంలో విలయ తాండవం చేస్తున్న తరుణంలో, ఆహార ద్రవ్యోల్బణం కనీవిని ఎరుగని శిఖరాలకు చేరుకున్న పరిస్థితుల్లో, ఆర్థిక అసమానతలు తీవ్ర స్థాయికి చేరి, ప్రయివేటు పెట్టుబడులు మందగించిన ప్రస్తుత సమయంలో కొత్త కేంద్ర బడ్జెట్ వచ్చింది. ఇలాంటప్పుడు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎక్కువ నిధులు ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు వాడుకోవాలి, అవసరమైన మేరకు ధనికులపై వేసే ప్రత్యక్ష పన్నులు పెంచాలి.. పేదలకు ఇచ్చే సబ్సిడీలు పెంచాలి, వారి ఆదాయాలు పెంచే చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రజలకు ఉపాధి పెరుగుతుంది, మార్కెట్‌లో గిరాకీ ఏర్పడుతుంది, ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తాయి, దేశం ముందుకు పురోగమిస్తుంది.

కానీ బడ్జెట్‌లో సరిగ్గా దీనికి రివర్స్‌లో చర్యలు తీసుకున్నారు. ఉదాహరణకు ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వ రెవిన్యూ ఆదాయం 14.5 శాతం పెరిగింది, ఖర్చులు కేవలం 5.94 శాతం మాత్రమే పెరిగాయి. ఆ విధంగా వచ్చిన అదనపు ఆదాయాన్ని ఆర్థిక కార్యకలాపాల విస్తరణ కోసం ఉపయోగించాల్సింది పోయి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రతినిధులను సంతృప్తి పరడం కోసం ద్రవ్య లోటును తగ్గించుకోడానికి ఉపయో గించదలుచుకుంది. గతంలో 5.8 శాతం ఉన్న ద్రవ్యలోటును 4.9 శాతానికి తగ్గించడానికి పూనుకుంది. మరోవైపు ప్రభుత్వ ఖర్చును తగ్గించుకునేందుకు సబ్సిడీలను రూ. 24,894 కోట్ల మేర తగ్గించింది. విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధికి నిధులు దాదాపు పెంచలేదు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఎన్‌రెగా కార్యక్రమానికి నిధులను గతేడాది కన్నా తగ్గించేసింది.

ఇంకోవైపు నిరుద్యోగాన్ని తగ్గించే స్కీం పేరుతో బడ్జెట్‌లో కార్పొరేట్ల ఖజానాలు నింపే కొత్త పథకం ప్రవేశపెట్టారు. ఈ స్కీం క్రింద ఒక లక్షలోపు ఆదాయం వచ్చే చిన్న పరిశ్రమల్లో ప్రతి కొత్త ఉద్యోగికీ నెలకు రూ. 5000 చొప్పుడు మూడు మాసాలు ప్రభుత్వమే వేతనం చెల్లిస్తుంది. ఒక లక్ష రూపాయల ఆదాయం వరకు ఇచ్చే ఉద్యోగులను తీసుకునే కార్పొరేట్ సంస్థలకు ఒక్కో ఉద్యోగిని తీసుకున్నందుకు రూ. 74 వేలు సబ్సిడీ ఇస్తుంది. రెండేళ్ల పాటు వారికి ఈ లబ్ధి చేకూరుతుంది. ఇది ఖచ్చితంగా కార్పొరేట్ సంస్థలకు సబ్సిడీపేరుతో మేపడమే. అదనంగా వస్తున్న ఆదాయాన్ని వారు ఎక్కడా అదనపు ఉపాధి కల్పించడానికి ఖర్చుచేస్తున్న దాఖలాలు లేవు.

ఈ విధంగా కాకులను కొట్టి రాబందులను మేపే విధానాలతో దేశం ముందుకు పోదు సరికదా మరింత వెనక్కు పోతుంది. వికసిత్ భారత్ అనీ, స్కిల్ డెవలప్‌మెంట్ అనీ, ఉపాధి చిట్కాలనీ ప్రజలకు తియ్యటి మాటలు చెప్పి కార్పొరేట్లకు మాత్రం కోటాను కోట్లు ముట్టజెప్పే మోడీ ప్రభుత్వ ఆర్థిక విదానాలను ఈ బడ్జెట్ ముందుకు తీసుకుపోతుంది, ప్రజలనూ దేశాన్నీ వెనక్కు తీసుకుపోతుంది. అందుకే ఇది ప్రజావ్యతిరేక ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజావ్యతిరేక బడ్జెట్. దీన్ని ముక్త కంఠంతో నిరసించాలి.

ఈ మాసం ముఖ్యాంశం

# విఫలమైన ఒకేదేశం-ఒకే పరీక్ష విధానం

**ప్రొఫెసర్ ఫర్కాన్ కమర్**



రచయిత హిమాచల్ ప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్–ఛాన్సలర్‌గా, అఖిల భారత యూనివర్శిటీల యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు

ఈ సంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ(ఎన్‌టిఏ) వైఫల్యాలు ఆకాశాన్నంటుతున్నాయి. వాటిపై విచారణ జరిపి, భవిష్యత్‌లో అటువంటివి సంభవించ కుండా చూడటానికి అవసరమైన సూచనలు చేయటం కోసం నియమించే ఉన్నత స్థాయి విచారణ కమిటీకి నాయకత్వం వహించే శాస్త్రవేత్త కోసం విద్యా మంత్రిత్వశాఖ అన్వేషించాల్సి వచ్చింది. దేశంలో ఉన్నత విద్యాసంస్థలలో చేరగోరుతున్న విద్యార్థుల ప్రవేశం కోసం అవసరమైన పరీక్షలు జరిపి, వారి అర్హతలను నిర్ణయించటానికి ఎన్‌టిఎకు ఉన్న సామర్థ్యంపై ఈ ఘటనలు సందేహాలను కలిగిస్తున్నాయి. ఇప్పటి వరకు వెల్లడైన లోపాలు సముద్రంలో నీటిబొట్టంత మాత్రమే. ఇంకా తెలియాల్సినవి ఎన్నో ఉన్నాయి.

మెడికల్ కాలేజీలలో ఎంబిబిఎస్, బిడిఎస్, బిఎఎంఎస్, బియుఎంఎస్, బిహెచ్ఎంఎస్ సీట్లు పొందటం కోసం జాతీయ అర్హత మరియు ప్రవేశ పరీక్ష (నేషనల్ ఎలిజిబిలిటి కం ఎంట్రెన్స్ టెస్ట్–నీట్)లో పాల్గొన్న వారిలో అత్యధికులు గరిష్టంగా 720కి 720 మార్కులు పొందటంతో తలెత్తిన చిన్న సందేహంతో ఇది ప్రారంభమైంది. గత సంవత్సరాలలో నీట్ అండర్ గ్రాడ్యుయేట్ పరీక్షలలో ఇద్దరు లేక ముగ్గురు గరిష్ట మార్కులు సాధించేవారు. కాలేజీలలో ప్రవేశం కోసం దేశంలో అత్యంత పోటాపోటీగా జరిగే పరీక్షలలో ఒకటైన నీట్‌లో గరిష్ట మార్కులు సాధించటం చాలా అరుదు. 1.25 లక్షల కన్నా తక్కువగా ఉన్న సీట్లను పొందటం కోసం జరిగే పరీక్షలలో పాల్గొనటం కోసం ఈ సంవత్సరం 24 లక్షల మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

గరిష్టంగా మార్కులు సాధించిన వారిలో కొందరు ఒకే కేంద్రం నుండి పరీక్షలలో పాల్గొన్నారని తెలియటంతో అనుమానం మరింతగా పెరిగింది. వారిలో కొందరు తమ నివాసానికి రెండు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న కేంద్రంలో కోచింగ్ తీసుకోవటానికి వచ్చారు. ఆ కేంద్రంలో పరీక్షల నిర్వహణలో ఆలస్యమైనందుకు కానీ లేక పొరపాటుగా వచ్చిన ప్రశ్నకు జవాబు రాయటంలో సమయాన్ని వృధా చేశారనే పేరుతో 1,563 మంది అభ్యర్థులకు ఎన్‌టిఏ గ్రేస్ మార్కులు ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది. పూర్తి మార్కులు సాధించిన 67 మందిలో 44 మంది గ్రేస్ మార్కులతోనే పూర్తి స్కోరును సాధించారు. తాను చేసిన పనిని సమర్ధించుకోవటం కోసం కామన్ లా అడ్మిషన్ టెస్ట్ కేసులో 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎన్‌టిఏ ఉదహరిస్తున్నది.

### సుప్రీంకోర్టు జోక్యం

టెస్ట్‌లో పాల్గొన్నవారిలో కొందరికి గ్రేస్ మార్కులు ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటీషన్లను విచారించిన సుప్రీంకోర్టు టెస్ట్‌లో పాల్గొన్న వారికి ఇచ్చిన గ్రేస్ మార్కులను రద్దుచేయాలని, విద్యార్థులు తమకు వచ్చిన మార్కులను అంగీకరించటం లేదా తిరిగి టెస్ట్ రాయటం అన్నవి ఎంచుకోవాలని చెప్పింది. గ్రేస్ మార్కులు పొందిన 1563 మందిలో 813 మంది అంటే 52 శాతం మంది మాత్రమే జూన్ 23వ తేదీన మళ్ళీ జరిగిన టెస్ట్‌కు హాజరయారు. జులై 1వ తేదీన రీటెస్ట్ ఫలితాలలో ఒక్కరు మాత్రమే పూర్తి మార్కులను సాధించారు.

ఎన్‌టిఏ విశ్వసనీయత దెబ్బతినటానికి ఇవి చాలవన్నట్లుగా మొదట బీహార్, తర్వాత హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్రల నుండి పేపర్ లీక్ వార్తలు వెల్లువలా వచ్చాయి. ఆశ్చర్యకరంగా ఈ రాష్టాల నుండి అనేకమంది సుదూరంగా ఉన్న గుజరాత్‌లోని కేంద్రాలలో నీట్ యుజి పరీక్షలు రాశారు. ఈ పరీక్ష స్థాయిని దిగజార్చటానికి కొన్ని సంఘటిత సిండికేట్లు, మాఫియాలు పనిచేశాయని స్పష్టమౌతున్నది. అయినప్పటికీ పేపర్ లీక్ స్థానికంగా జరిగిందని, అది కొద్ది కేంద్రాలకు మాత్రమే పరిమితమైందని, తిరిగి పరీక్ష జరిపితే లక్షలాది మంది విద్యార్థులు అనవసరంగా ఇబ్బందులు పడతారని, విద్యా సంవత్సరం ఆలస్యం అవుతుందని ఎన్‌టిఏ, విద్యామంత్రిత్వ శాఖ భావించటం వలన పరీక్షను రద్దు చేయలేదు.

పరీక్ష నిర్వహించటంలో ఏ మాత్రం పొరపాటు జరిగినా సహించబోమని సుప్రీంకోర్టు హెచ్చరించింది. అయినప్పటికీ 2024 నీట్ యుజి మార్కుల ప్రాతిపదికగా వైద్య విద్యాసంస్థలలో ప్రవేశాల కోసం జరిగే కౌన్సిలింగ్‌ను వాయిదా వేయటానికి తిరస్కరించింది. ఈ మధ్యలో నీట్ యుజికి చెందిన కేసులను సిబిఐ తీసుకుని, వివిధ ప్రాంతాలలో కొందరిని అరెస్ట్ చేసింది.

నీట్ యుజి పరీక్షను, ఎన్‌టిఏను రద్దు చేసి, తిరిగి పరీక్ష నిర్వహించాలని కోరుతూ దేశవ్యాపితంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తాయి. ప్రస్తుతం అనేక పిటీషన్లు సుప్రీంకోర్టు ముందు ఉన్నాయి. నీట్ యుజి పరీక్షను రద్దు చేస్తారని, విశ్వసనీయమైన సంస్థ ఆధ్వర్యంలో తిరిగి పరీక్షలు నిర్వహిస్తారని విద్యార్థులు ఆశిస్తున్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాపితంగా కూడా వైద్య సంస్థలలో ప్రవేశం కోసం నీట్ పరీక్షలో సాధించిన మార్కులను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోవటానికి దారితీసిన 2013, 2016లో తాను ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు సమీక్షిస్తుందని కూడా ఆశిస్తున్నారు.

దేశంలోని వైద్యసంస్థలలో ప్రవేశానికి ఎదురౌతున్న సమస్యలను ఒకే ఒక పరీక్ష నీట్ పరిష్కారం చేస్తుందని చెబుతున్నారు. కాని గొప్పగా ప్రచారం చేసుకున్న ఈ "మందు" "జబ్బు" కన్నా అధ్వాన్నంగా ఉన్నది. విధాన నిర్ణేతలు, వైద్యవిద్యను క్రమబద్ధీకరించే వారు, దీనికి బాధ్యత వహించే

> “ దేశంలోని వైద్యసంస్థలలో ప్రవేశానికి ఎదురౌతున్న సమస్యలను ఒకే ఒక పరీక్ష నీట్ పరిష్కారం చేస్తుందని చెబుతున్నారు. కాని గొప్పగా ప్రచారం చేసుకున్న ఈ “మందు” “జబ్బు” కన్నా అధ్వాన్నంగా ఉన్నది. విధాన నిర్ణేతలు, వైద్యవిద్యను క్రమబద్ధీకరించే వారు, దీనికి బాధ్యత వహించే మంత్రిత్వ శాఖలు, న్యాయ వ్యవస్థ ఈ అంశాన్ని నిష్పాక్షికంగా సమీక్షించటానికి ఇదే సరైన సమయం. ”

మంత్రిత్వ శాఖలు, న్యాయ వ్యవస్థ ఈ అంశాన్ని నిష్పాక్షికంగా సమీక్షించటానికి ఇదే సరైన సమయం.

ఎంట్రెన్స్ పరీక్షలు నిర్వహించటంలో ఎన్‌టిఎ అసమర్థత, పాల్పడుతున్న తప్పుడు పద్ధతులు శిఖరస్థాయికి చేరాయి. ఇప్పుడు ఏం జరిగినా ఆశ్చర్యపడాల్సిన పరిస్థితి లేదు.


ఎన్‌టిఎ 2024లోనే అనేక ఎంట్రెన్స్ పరీక్షలను రద్దు చేసింది, లేదా రీ షెడ్యూల్ చేసింది. జాతీయ అర్హత (యుజిసి-ఎన్ఇటి) పరీక్షలు జరిగిన ఒకరోజు తర్వాత యూనివర్సిటి గ్రాంట్స్ కమిషన్ వాటిని రద్దుచేసింది. పరీక్షలకు చాలా ముందుగానే డార్క్ నెట్‌లో పేపర్ లీక్ అయిందని, క్లౌడ్ బేస్డ్ ఇన్‌స్టెంట్ మెసేజింగ్ పోర్టల్స్‌లో విస్తృతంగా పంపకం జరిగిందని సైబర్ సెక్యూరిటి, ఇంటెలిజెన్స్ ఏజన్సీల వద్ద బలమైన సాక్ష్యాలు ఉండటంతో ఈ పరీక్షను రద్దు చేశారు. జాయింట్ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్-ఎన్ఇటి పరీక్షను కూడా ముందు జాగ్రత్త చర్యగా రద్దు చేశారు. నాలుగు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో అడ్మిషన్ కోసం నిర్వహించే నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌ను జూన్ 12వ తేదీన పరీక్ష జరగటానికి కొన్ని గంటల ముందు రద్దు చేశారు. నీట్ పిజి పరీక్షను కూడా ఆ విధంగానే వాయిదా వేశారు.

**నేరస్తురాలు, బాధితురాలు ఎన్‌టిఎ నే**

ప్రారంభం నుండి మళ్ళీ మళ్ళీ అక్రమాలకు పాల్పడటంలో ఎన్‌టిఎ నేరస్తురాలు, బాధితురాలుగనూ ఉన్నది. మార్కులు, మెరిట్ జాబితాను తయారు చేయటంలో జరిగిన తప్పులను గతంలోనే వెల్లడించారు. సాంకేతికపరమైన లోపాలు, వాయిదాలు వేయటం, పరీక్షలను రీ షెడ్యూలు చేయటం తదితరాలు తరచుగా జరుగుతు న్నాయి. ఈ సంవత్సరం ఢిల్లీలోని వివిధ కేంద్రా లలో జరగవలసిన కామన్ యూనివర్సిటి ఎంట్రెన్స్ టెస్ట్ (సియుఇటి)ను చివరి క్షణాలలో వాయిదా వేశారు. ఢిల్లీలో మే 25వ తేదీన పార్లమెంటు ఎన్నికలు జరగనుండటంతో అవసరమైన సిబ్బందిని, మౌలిక సదుపా యాలను సమకూర్చుకోవటం కష్టమౌతుందని ఎన్‌టిఎ హఠాత్తుగా గుర్తించి, ఈ విధంగా వాయిదా వేసింది.

మే 15-29 తేదీల మధ్య హైబ్రిడ్ పద్ధతిలో జరిగిన సియుఇటి పరీక్ష ఆన్సర్ కీ ని ఇప్పటి వరకూ ఎన్‌టిఎ విడుదల చేయలేదు. తమ పరీక్ష ఫలితాలు వెల్లడి కావటం ఆలస్యమైతే విద్యా సంవత్సరం నష్టపోతామని 46 మాత్రమే కాక, సియుఇటిలో చేరిన 250 యూనివర్సిటిలలోని విద్యార్థులూ ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు తీవ్రంగా ఆందోళన చెందే పరిస్థితులు ఏర్పడటం ఇదే మొదటిసారి కాదు. సియుఇటిని ఎన్‌టిఎ తీసుకున్న తర్వాత తమ భవిషత్ ఆశలు ఆవిరి అవుతున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సియుఇటి మొదటి సంవత్సరమే విద్యార్థులు, తల్లిదండ్రులకు పీడకలగా పరిణమించింది. అడ్మిషన్ల కోసం అప్లికేషన్లు పెట్టుకొనే క్రమం పూర్తయిన తర్వాత కూడా పాల్గొనే యూనివర్సిటీల సంఖ్య, కార్యక్రమాలను మారుస్తూ ఉన్నారు. అడ్మిషన్ కార్డులు ఇచ్చిన తర్వాత మాత్రమే కాక, చివరి నిముషంలో కూడా పరీక్షా కేంద్రాలను రద్దు చేయటం, మార్పు చేయటం చేశారు.

పరీక్షలలో పాల్గొనే ప్రతి విద్యార్థి ఇంటర్నెట్, తన వెబ్‌సైట్‌ను 24 గంటలూ చూసే విధంగా ఎన్‌టిఎ విధానాలను రూపొందించింది. ఒక నగరంలో ఒక కేంద్రంలో పరీక్ష రాయాల్సిన విద్యార్థిని అదే నగరంలోని మరో పరీక్ష కేంద్రానికి మార్చినా అభ్యర్థికి ఏమీ ఇబ్బంది ఉండదని కూడా ఎన్‌టిఎ భావిస్తున్నది. సియుఇటిలో భాగస్వా ములైన యూనివర్సిటీలది కూడా ఇబ్బందికరమైన పరిస్థితే. ఫలితాలు ప్రకటిం చిన తర్వాత కూడా నెలల తరబడి వారి సీట్లు పూర్తికాకుండా ఉంటున్నాయి. దీన్నుండి బయట పడటానికి కొన్ని



రచయిత ఢిల్లీ యూనివర్శిటీలో హిందీ విభాగంలో ప్రొఫెసర్. హిందీలో మార్క్సిస్టు సిద్ధాంతం మీద పరిశోధన చేశారు. పత్రికలకు రెగ్యులర్‌గా వ్యాసాలు, రాజకీయ వ్యాఖ్యానాలు రాస్తుంటారు.

# పరీక్షల కేంద్రీకరణతో ప్రమాదం

– ప్రొఫెసర్ అపూర్వానంద్

‘డియు’గా ప్రాముఖ్యం పొందిన ఢిల్లీ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్‌లో నేను ఉంటున్నాను. యువతీ యువకులు తమ తల్లిదండ్రులతో కలిసి దౌలత్ రామ్ కాలేజి, రంజాస్ కాలేజి, శ్రీరాం కాలేజ్ ఆఫ్ కామర్స్, హిందు కాలేజిలలోని డిగ్రీ కోర్సులలో చేరటానికి పిలువు కోసం ఎదురు చూస్తూ గేట్ల బయట గుమికూడటంతో జూన్ నెలలో రోడ్ల మీద తిరగటం కూడా కష్టంగా ఉంటుంది. కొత్త విద్యా సంవత్సరంలో జూన్ 21వ తేదీన జరిగే మొదటి సమావేశానికి ఇది సూచికగా ఉంటుంది.

కాని గత సంవత్సరం, ఈ సంవత్సరం కూడా జూన్ నెలలో రోడ్లన్నీ ఖాళీగా ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో విద్యార్థులను చేర్చుకొనే తేదీలను డియు ప్రకటించలేదు. గత విద్యా సంవత్సరంలో 2023, ఆగస్టు 1వ తేదీన విద్యార్థులను చేర్చుకోవటం ప్రారంభమైంది. దానితో సమావేశం ఆలస్యమైంది. ఆగస్టు నెల మధ్యలో మాత్రమే విద్యా సంవత్సరం ప్రారంభమైంది. పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులలో చేర్చుకోవటానికి కూడా ఈ విధంగానే జరిగింది. జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటి -జెఎన్‌యు లాంటి వాటిలో కూడా

> **ఐదు సంవత్సరాల స్వల్పకాలంలో 17 విభిన్నమైన పరీక్షలు నిర్వహించే బాధ్యతను ఎన్‌టిఎ కు అప్పగించారు. ఎన్‌టిఎ 2023లో నిర్వహించిన వివిధ రకాలైన పరీక్షలు రాయటం కోసం 1.23 కోట్లమంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. చైనాలో గావోకావో 2023లో నిర్వహించిన పరీక్షలలో 1.29 కోట్లమంది పాల్గొన్నారు. దాని తర్వాత ప్రపంచంలో రెండవ అతిపెద్ద పరీక్షల నిర్వ హణా సంస్థగా ఎన్‌టిఎ ఉన్నది.**

యూనివర్శిటీలు, కాలేజీలు మొదట వచ్చిన వారికి మొదట సీట్లు కేటాయించే విధానాన్ని అనుసరించటం వలన వారి విద్యా ప్రమాణా లు పడిపోతున్నాయి. అడ్మిషన్ల క్రమం పూర్తయి విద్యా సంవత్సరం ప్రారంభం కావటానికి అనవసరమైన కాలహరణం జరుగుతున్నది.

నాణ్యమైన ఉన్నత విద్యాసంస్థలలో ప్రవే శానికి విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించటంలో సియుఇటి బాగా ఉపయోగ పడుతుందని, తమకు నచ్చిన యూనివర్సిటీలో, తమకు ఇష్టమైన కోర్సులలో ప్రవేశానికి విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగిస్తుందని ప్రచారం చేస్తున్నారు. కాని గత రెండు సంవత్సరాల నుండి అందుకు విరుద్ధంగా జరుగుతున్నది. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఇపి 2020), దానికి చేస్తున్న వ్యాఖ్యానాలు, అమలు జరుపుతున్న తీరుతో "ఒకేదేశం, ఒకే పరీక్ష" అనే భావం బలపడింది. అది ఈ విపత్తుకు దారితీసింది. ఎంట్రెన్స్ పరీక్షలన్నీ ఒకే సాధారణ సూత్రం ప్రకారం జరగాలని, "యూనివర్సిటీల వైవిధ్య ం, స్వతంత్రతను పరిగణనలోకి తీసుకొని, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఉన్నత విద్యలో ఫెలోషిప్ కోసం చేరేవారికి ఎన్‌టిఎ ఎంట్రన్స్, అడ్మిషన్ పరీక్షలను నిర్వహిస్తుందని" ఎన్ఇపి 2020లో పేర్కొన్నారు. "ఎన్‌టిఎ పరీక్ష ఎక్కువ నాణ్యత, పరిధి, పట్టు విడుపులతో కూడిన పద్ధతుల వలన దేశంలోని ఎక్కువ యూని వర్సిటీలు ఈ ఉమ్మడి ప్రవేశ పరీక్ష(కామన్ ఎంట్రన్స్ టెస్ట్)లను ఉపయోగించుకోవటానికి, తద్వారా విద్యా ర్థులు, యూనివర్సిటీలు, కాలేజీ లు, మొత్తం విద్యా వ్యవస్థపై భారాన్ని తగ్గించ టానికి దోహదం చేస్తాయి. తమ కాలేజిలు, యూని వర్సిటీలలో ప్రవేశానికి ఎన్‌టిఎ పరీక్షను అంగీకరించటమా లేదా అన్నదానిని ఆయా కాలేజీలు, యూనివర్సిటీలకే" వదిలి వేస్తున్నట్లు విధాన పత్రంలో పేర్కొన్నారు. కాని ఎన్‌టిఎ నిర్వహించిన సెంట్రల్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్‌లో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగానే సెంట్రల్ యూనివర్సి టీలు సీట్లు కేటాయించటాన్ని తప్పనిసరి చేస్తూ యుజిసి ఆదేశాలు జారిచేసింది. వరుసగా వైఫల్యాలు, లోపాలు వెల్లడౌతున్నప్పటికీ ఉమ్మడి ప్రవేశ పరీక్షలో పాల్గొనే విధంగా మరిన్ని యూనివర్సిటీలను సన్నద్ధం చేశారు. ఒకదేశం, ఒకే పరీక్ష ఎజెండాను మరింత ముందుకు తీసుకుపోవటానికి దీనిని ఉపయో గించు కున్నారు.

**సిబిఎస్ఇ సమాచారం**

2022లో 28,402 పాఠశాలలు సిబిఎస్ఇకి అనుబంధంగా ఉన్నాయి. బోర్డు పరీక్షల కోసం 35,53,549 మంది విద్యా ర్థులు రిజిస్టర్ చేసుకున్నారు. 7,405 కేంద్రాల లో పరీక్షలు నిర్వహించారు. పరీక్షల డ్యూటీ కోసం 4,05,944 మంది సిబ్బందిని వినియో గించారు. 1,97,419 గదులలో పరీక్షలు జరిగాయి. 1,857 కేంద్రాలలో పేపర్లు దిద్ది, మార్కులు వేశారు.

యూనివర్శిటిల ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఎన్‌టిఎకు మరొక పరీక్షను జత చేయటం మాత్రమే కాక, మరింత ఎక్కువ ప్రభావాన్ని కలిగిస్తుంది. మొదటి సంవత్సరం నుండే 55,000 సబ్జెక్టులను కలిపి ప్రవేశ పరీక్షలను నిర్వహించవలసిన భారాన్ని మోపుతుంది. అప్పటి నుండి ఎన్‌టిఎ తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నది. అన్ని ఎక్కువ పరీక్షలను నిర్వహించటానికి అవసరమైన పరీక్షా కేంద్రా లు, నాణ్యమైన సిబ్బంది ఆ సంస్థ వద్దలేరు.

**సియుఇటి: పనిచేయని ఎన్‌టిఎ**

సియుఇటిని ప్రవేశపెట్టటం వలన ఎన్‌టిఎ పని చేయటం లేదని రుజువైందని చెప్పటం అతిశయోక్తి కాదు. చాలాకాలం నుండి జరగటానికి అవకాశం ఉన్న పరిణా మాలు ఈ సంవత్సరం జరిగాయి. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ 2017లో ఎన్‌టిఎను ఏర్పాటు చేసింది. 1860 సొసై టిల రిజిస్ట్రేషన్ చట్టం కింద 2018, మే 15వ

ఈ విధంగానే ఆలస్యం జరిగింది.

**నిలిచిపోయిన విద్యార్థుల చేరిక**

యూనివర్శిటీలలో విద్యార్థులను చేర్చుకొనే క్రమాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజన్సి (ఎన్‌టిఎ)కి అప్పగించటంతో డిగ్రీ, పిజీ కోర్సులలో విద్యార్థులను చేర్చుకోవటం ఆలస్యమౌతున్నది. ఉమ్మడి జాతీయ పరీక్ష అయిన కామన్ యూనివర్సిటి ఎంట్రెన్స్ టెస్ట్ (సియుఇటి) ద్వారా విద్యార్థులను చేర్చుకోవాలనే ప్రణాళికకు వారు ఆమోదం తెలిపారు. సియుఇటి జవా బుల 'కీ' ని ఎన్‌టిఎ ఇప్పటికీ విడుదల చేయలేదు. జవాబుల 'కీ'ని విడుదల చేసిన తర్వాత, దానిని సవాల్ చేయటానికి కొంత సమయం ఇస్తారు. దాని తర్వాతనే అంతిమ ఫలితాలను ప్రకటిస్తారు. గత సంవత్సరం జులై మధ్యలో సియుఇటి ఫలితాలను ప్రకటించారు. అడ్మిషన్ల క్రమాన్ని ఇది ఆలస్యం చేసింది. సెషన్‌ను కూడా ఇది చెడగొట్టింది. గత సంవత్సరం జరిగినదే ఈ సంవత్సరం కూడా జరుగుతుందని భావిస్తున్నారు.

ప్రైవేటు యూనివర్సిటీలు విద్యార్థులను చేర్చుకోవటం ప్రారంభించాయి. గతం నుండి ఉన్న, బాగా ప్రాచుర్యం పొందిన జెఎన్‌యు, డియు లాంటి వాటి వలె కాకుండా తమ అకడమిక్ క్యాలెండర్‌ను అమలు చేయటంపై వాటికి పూర్తి పట్టు ఉన్నది. విద్యార్థులను చేర్చుకోవటంలో కాలపరీక్షకు నిలిచిన తమ విధానాలను ఎన్‌టిఎ ప్రయోజనం కోసం పక్కన పెట్టటంతో జెఎన్‌యు, డియు లాంటివి నిస్సహాయంగా మిగిలిపోయాయి.

ఈ మధ్యకాలంలో జరిగిన నేషనల్ ఎలిజిబిలిటి కం ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్ఇటి) పరీక్షల్లో భారీ కుంభకోణం బయటపడటంతో ఎన్‌టిఎ సంక్షోభంలో కూరుకుపోయింది. ఇది బయటపడిన తర్వాత యూనివర్సిటి గ్రాంట్స్ కమిషన్-నేషనల్ ఎలిజిబిలిటి టెస్ట్ (యుజిసి-ఎన్ఇటి)లో కూడా అక్రమాలు జరిగినట్లు వెల్లడైంది. ఆ పరీక్ష జరిగిన రోజునే దానిని రద్దు చేశారు. తర్వాత జూన్ 25-27 తేదీలలో జరగవలసిన కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రి యల్ రీసెర్చ్ (సిఐఎస్ఆర్) యుజిసి-ఎన్ఇటి పరీక్షను వాయిదా వేయ మని విద్యా మంత్రిత్వశాఖ ఎన్‌టిఎను కోరింది.

ఎన్‌టిఎ అశక్తత, అవినీతి వందలాది విద్యాసంస్థల నిర్ణీత కార్యక్రమాలను తలకిం దులు చేయటంతో పాటు లక్షలాది మంది విద్యార్థులను అనిశ్చితిలోకి నెట్టింది. ప్రభుత్వం దీనిని కప్పిపెట్టటానికి ప్రయత్నం చేస్తున్నది.

**❝ఎన్‌టిఎ నిర్మాణం, పనిలో ఉన్న లోపాలలో ఇవి కొన్ని మాత్రమే. ఈ పరిస్థితిలో కొన్ని అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకొని సూచనలు చేయటం ద్వారా దీని నిర్మాణం, పనిలో ఉన్న లోపాలను సరిదిద్దటం సాధ్యం కాదు. ఈ సమస్యను సమగ్రంగా అధ్యయనం చేయకపోతే  అక్కడక్కడ జరుగుతున్న కొన్ని లోపాలను గమనించటం,  పరీక్షలు నిర్వహించే సంస్థ ఇక ముందు అమలు చేయవలసిన నిబంధనలను సిఫార్సు చేయటానికి మాత్రమే  హై పవర్ కమిటి పరిమిత మౌతుంది.❞**

తేదీన సొసైటిగా రిజిష్టర్ చేయించారు. కేంద్ర క్యాబినెట్ ఆమోదంతో ఏర్పడిన ఈ సంస్థ అత్యంత ప్రధానమైన, నైపుణ్యం గల, స్వతంత్రమైన, స్వయం సమృద్ధితో కూడినదిగా ఉంటుందని, ఉన్నత విద్యాసంస్థలలో ప్రవేశానికి, ఫెలోషిప్‌ల కోసం ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. "అధ్యయనం ప్రాతిపదికగా అంతర్జాతీయ స్థాయి సామర్థ్యంతో, పారదర్శకంగా, లోపాలు లేకుండా అభ్యర్థుల సామర్థ్యాన్ని అంచనా వేయటానికి, వారికి ప్రవేశం కల్పించటం, సిబ్బందిని రిక్రూట్ చేసుకోవటం" కోసం కట్టుబడి ఉన్నామని ప్రకటించారు.

"పరీక్షలకు సన్నద్ధం చేయటం, నిర్వహించటం, మార్కులు వేయటం" వరకు ప్రతి రంగంలోనూ లభించే ఉన్నతమైన వాటిని వినియోగించుకుంటామని, ఈ విధంగా తమకు ఎదురయ్యే సవాళ్ళను అధిగమిస్తామని ప్రకటించారు. మార్కులివ్వటంలో  అంచనా వేయటం, స్కోరు ఇవ్వటం, మెరిట్ జాబితాను తయారు చేయటం ఉంటాయి.

ఐదు సంవత్సరాల స్వల్పకాలంలో 17 విభిన్నమైన పరీక్షలు నిర్వహించే బాధ్యతను ఎన్‌టిఎ కు అప్పగించారు. ఎన్‌టిఎ 2023లో నిర్వహించిన వివిధ రకాలైన పరీక్షలు రాయటం కోసం 1.23 కోట్లమంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. చైనాలో గావోకావో 2023లో నిర్వహించిన పరీక్షలలో 1.29 కోట్లమంది పాల్గొన్నారు. దాని తర్వాత ప్రపంచంలో రెండవ అతిపెద్ద పరీక్షల నిర్వహణా సంస్థగా ఎన్‌టిఎ ఉన్నది. 2022-23లో విద్యామంత్రిత్వ శాఖ ఇచ్చిన  నివేదిక ప్రకారం ఆ సంవత్సరం ఎన్‌టిఎ నిర్వహించిన 26 విభిన్నమైన పరీక్షలలో 1.31 కోట్లమంది పాల్గొన్నారు. దీనికి అదనంగా 2022లో సియుఇటి పరీక్షలలో 14.90 లక్షల మంది పాల్గొన్నారు. ప్రపంచంలో పరీక్షలు నిర్వహించే వాటిలో ఎన్‌టిఎ అతి పెద్దసంస్థ అని ఈ అంకెలు స్పష్టం చేస్తున్నాయి.

**అభివృద్ధి చెందుతున్న సంస్థ**

తాను చేయగలిగిన దానికన్నా ఎక్కువ బాధ్యతను ఎన్‌టిఎ తీసుకున్నట్లు స్పష్టమౌతున్నది. అది ఇంకా అభివృద్ధి అవుతున్న సంస్థ. దాని నిర్మాణం, సిబ్బందికి సంబంధించి వెబ్‌సైట్‌లో తగిన సమాచారం లేదు.  ఛైర్మన్, డైరెక్టర్ జనరల్, మరొక సభ్యుని పేరు మాత్రమే దానిలో ఉన్నాయి. ఇతర సభ్యుల పేర్లు రాయకుండా, వారి స్థాయిని, వారు పూర్తికాలం సభ్యులో కాదో తెలియ జేయకుండా  వారి బాధ్యతలు, వారు వచ్చిన సంస్థల పేర్లను మాత్రమే పేర్కొన్నారు.  ఎన్‌టిఎ వెబ్‌సైట్‌లో ఆ సంస్థకు సంబంధిం చిన ఇతర అధికారుల పేర్లేవీ ఉండవు. వివిధ పరీక్షలు, కార్యకలాపాలు నిర్వహించే విభాగాల ఇ మెయిల్ అడ్రసులు, వాటి జాబితా మాత్రమే ఉన్నది. అన్ని ఆఫీసులకూ అదే రెండు లాండ్‌లైన్ ఫోన్ నంబర్లే ఉన్నాయి. ఎన్‌టిఎ వార్షిక నివేదికలు, అకౌంట్లను ఆడిట్ చేసిన నివేదికలు దానిలో ఉండవు.

ఎక్కువ మంది సిబ్బంది ఉన్న పెద్దసంస్థ ప్రజల విశ్వాసం పొందటం కోసం తనను గురించి ఎక్కువ వివరాలు తెలియజేయటం ద్వారా పారదర్శకంగా ఉండటానికి ప్రయత్నం చేస్తుంది. ముఖ్యంగా ఉన్నత విద్యాసంస్థలలో ప్రవేశం, ఫెలోషిప్ కోసం  ఎంట్రెన్స్, అర్హత పరీక్షలు మాత్రమే కాక, స్కూల్ విద్యలో అడ్మిషన్, స్కాలర్ షిప్‌లు, కొన్ని సంస్థలు సిబ్బందిని తీసుకోవటం కోసం  పరీక్షలు నిర్వహించటం వంటి సున్నితమైన బాధ్య తలున్న సంస్థ మరింత బాధ్యతా యుతంగా వ్యవహరించాలి. తాను నిర్వహిస్తున్న పరీక్షలు, టెస్ట్‌ల కన్నా కొంచెం ఎక్కువ మంది సీనియర్ ఉద్యోగులు మాత్రమే ఎన్‌టిఎ వద్ద ఉన్నట్లు స్పష్టమౌతున్నది. కీలకమైన, రహస్యంగా ఉంచాల్సిన, వ్యూహాత్మకమైన కార్యక్రమాలకు కూడా  కన్సల్టెంట్‌లు, సిబ్బందిని అవుట్ సోర్సింగ్‌కు తీసుకోవటం, సేవలను అందించే మధ్యవర్తులపై ఎక్కువగా ఆధారపడుతున్నది.

ఇప్పుడు విద్యార్థులు, ప్రజలు ఎన్‌టిఎ విశ్వసనీయతను పరిశీలిస్తున్నారు. విద్యా వ్యవస్థ మొత్తంపైన ఎన్‌టిఎ పెత్తనాన్ని రుద్దటానికి కేంద్రం ఎందుకు ప్రయత్నం చేస్తున్నదని ప్రశ్నిస్తున్నారు.

**కేంద్రీకరణ కోసం వెంపర్లాట**

బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎన్‌టిఎను సృష్టించింది. కాని దాని వెనుక ఉన్న భావం చాలా పాతది. ప్రతి దానినీ కేంద్రీకృతం చేయాలనీ, సబ్జెక్టులు, పాఠ్యాంశాలు, పాఠశాలలు, కాలేజీలలో ప్రవేశాల విధానం వరకు ప్రతి అంశాన్ని ఏకరూపంగా చేయాలనే ఆలోచనల ఫలితం ఇది. చదువుల్లో వైవిధ్యం గందరగోళాన్ని, అసమానతలను పెంచుతుందన్న తప్పుడు అభిప్రాయాలతో ఇలా చేస్తున్నారు. ప్రతిదానినీ ఒకే రూపంలోకి మార్చటానికి, ఒకే విధంగా ఉండేలా చేయటానికి ప్రయత్నం జరుగుతున్నది. ఈ విధమైన ఆలోచనలతోనే ఒకేదేశం, ఒకే ఎన్నికను గురించి కూడా ప్రచారం చేస్తున్నారు.

వివిధ పరీక్షలను నిర్వహించే బాధ్యతలను అప్పగించిన ఎన్‌టిఎ చరిత్ర ఏమిటి? అనేక దశాబ్దాల నుండి సరైనదిగా రుజువైన అడ్మిషన్ల విధానాన్ని పక్కన పెట్టి, యూనివర్సిటీ అధికారులు విద్యార్థులను చేర్చుకోవటానికి ఎన్‌టిఎతో ఒప్పందం చేసుకొంటున్నపుడు జెఎన్‌యు అధ్యాపకులు ఈ విధానాన్ని వ్యతిరేకించారు. తమ యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తిని కాపాడుకోవటం కోసం కోర్టుకు వెళ్ళారు. కాని కోర్టు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదు.

ఎన్‌టిఎ కేవలం ఒక సొసైటి మాత్రమే అని దేశం ఇప్పుడు గుర్తించింది. పార్లమెంటు చేసిన చట్టం ద్వారా దీనిని ఏర్పాటు చేయలేదు. సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం 1860 ద్వారా ఎన్‌టిఎను రిజిష్టర్ చేశారు. అది కేవలం కార్యక్రమాలను నిర్వహించే సంస్థ మాత్రమే. నిర్ణయాలు చేసే సంస్థకాదు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే ప్రవర్తనా నియమావళి ఈ సంస్థకు వర్తించదు. "బోర్డు నిర్వహించే పరీక్షలలో విద్యార్థులు సాధించిన మార్కులకు నామమాత్రమైన ప్రాధాన్యత మాత్రమే ఇవ్వటంతో ఇది పాఠశాల విద్యను కూడా ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది" అని విద్యావేత్తలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వాదన వెనుక ఉన్న ఆలోచనలను విద్యావేత్త, భాషా అధ్యయనవేత్త ఆయేషా కిద్వాయ్ వ్యతిరేకించారు.  విద్యామంత్రిత్వశాఖ

> **❝ ప్రపంచంలోని పరీక్షలు నిర్వహించే సంస్థలు ప్రతిభ ఆధారిత పరీక్షలపైనే ఆధారపడు తున్నాయి. సబ్జెక్టు ప్రాతిపదికగా అంచనా వేయటాన్ని గరిష్టంగా ఐదు సబ్జెక్టులకే పరిమి తం చేస్తున్నాయి. మరోవైపున ఎన్‌టిఎ సబ్జెక్టు ప్రాతిపదికగా అంచనా వేసే విధానాన్ని కొనసాగిస్తున్నది. ❞**

ఒక సంస్థలో పూర్తికాలం పనిచేసే అను భవం కలిగిన సిబ్బంది తగినంత మంది లేకపోవటం దాని కార్యనిర్వాహకులపై తీవ్ర మైన భారం మోపుతుంది. స్వప్రయోజన పరులకు తేలికగా లొంగిపోయేలా చేస్తుంది. వివిధ రకాలుగా ఎదురయే ఆటుపోట్లకు తట్టుకొనే శక్తి ఉండదు. అంతిమంగా అది తన మౌలిక లక్ష్యాలనే మరిచిపోయే స్థితికి చేరుతుంది. స్కాలర్లకు ప్రతిభ ఆధారంగా నిర్వ హించే అమెరికన్ ఆప్టిట్యూడ్ టెస్ట్, అమెరికన్ కాలేజి టెస్టింగ్, గ్యాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామి నేషన్, గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్, టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ యాజ్ ఎ ఫారిన్ లాంగ్వేజ్, ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టమ్ తరహాలో ఎన్‌టిఎను రూపొం దించా లని అనుకున్నారు.

సంవత్సరంలో ఒకసారి కాకుండా అనేక సార్లు ఆల్ దు కంప్యూటర్ బేస్ట్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. మరికొన్నింటిలో కూడా ఈ విధానాన్ని తీసుకురావటానికి ప్రయత్ని స్తున్నారు. ఆ విధంగా చేయటం ద్వారా అవ సరమైన డిజిటల్, భౌతికమైన మౌలిక సదు పాయాలను, ఇతర పరికరాలను తగ్గించ టానికి ప్రయత్నిస్తున్నారు.

ఎన్‌టిఎ తిరోగమన మార్గంలో ప్రయాణి స్తున్నది. అది సిబిటితో ప్రారంభించింది. కాని తర్వాత కొన్ని అతి పెద్ద పరీక్షలలో పెన్ను, పేపర్‌ను వినియోగించే విధానానికి మారింది. ఎన్‌టిఎ నిర్వహించిన సిబిటి లు కూడా పాత పద్ధతిలో ఉన్నవి. పరీక్షలు రాయటం కోసం దరఖాస్తు చేసుకున్న వారంతా ఒకసారి లేక రెండు సార్లు నిర్ణీత సమయంలో, నిర్ణీత కేంద్రానికి హాజరు కావాలి. ఇది అవసరమైన పరికరాలలో తీవ్రమైన కొరతకు దారితీసి, అనేకసార్లు తన విధానాల నుండి పక్కకు మళ్ళటానికి, రాజీ పడటానికి దారితీసింది.

**సబ్జెక్టు ప్రాతిపదికగా అంచనా లేక ప్రతిభ ఆధారిత పరీక్షలా?**

ప్రపంచంలోని పరీక్షలు నిర్వహించే సంస్థ లు ప్రతిభ ఆధారిత పరీక్షలపైనే ఆధారపడు తున్నాయి. సబ్జెక్టు ప్రాతిపదికగా అంచనా వేయటాన్ని గరిష్టంగా ఐదు సబ్జెక్టులకే పరిమి తం చేస్తున్నాయి. మరోవైపున ఎన్‌టిఎ సబ్జెక్టు ప్రాతిపదికగా అంచనా వేసే విధానాన్ని కొనసాగిస్తున్నది. ముఖ్యంగా గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశం కోసం సియుఇటి నిర్వహించే పరీక్షలలో కొన్ని సందర్భాలలో సబ్జెక్టుల కలయిక వేల సంఖ్యకు చేరుతున్నది. ఈ అంశాలన్నింటినీ పరిశీలించి నపుడు ఎన్‌టిఎ రోజువారీ కార్యకలాపాల నిర్వహణకు మాత్రమే పరిమితమౌతున్నదని, ప్రధానమైన అంశాలపై కేంద్రీకరణ ఉండటం లేదని స్పష్టమౌతున్నది. ఈ సంస్థ ప్రారంభ మైన ఆరు సంవత్సరాల తర్వాత కూడా ప్రణా ళిక రూపొందించుకున్న అంశాలు ఇంకా వాగ్దానాలు గానో హామీలుగానో ఉన్నాయి మినహా అమలుకు నోచుకోలేదు.

పరీక్షలు నిర్వహించే, ప్రతిష్ఠ కలిగిన ఏ సంస్థకైనా హైక్వాలిటి ప్రశ్నలు, ఐటం బ్యాంకు తప్పనిసరిగా ఉండాలి. కాని వాటిని ఈ సంస్థ ఇంకా అభివృద్ధి చేసుకోలేదు. ప్రామాణికమైన, కష్టతరమైన వివిధ అంశాలపై పెద్దస్థాయి క్వశ్చన్ బ్యాంకులను అభివృద్ధి చేసుకున్న తర్వాతనే ప్రతిభ కలిగిన సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. పరీక్షలు, అంచనా వేసే క్రమంలో నాణ్యతను గురించి నమ్మకం సంస్థ విశ్వసనీయత, సమగ్రతలకు గీటురాయిగా ఉంటుంది. తన కార్య కలాపా లను క్రమ పద్ధతిలో అంచనా వేసుకొంటే పరీక్షలు నిర్వహిస్తున్న సంస్థకు దీనిని సాధించ టం సాధ్యమౌతుంది. ఎన్‌టిఎ ఇప్పటి వరకు అటువంటి వివరాలను బహిర్గతం చేయలేదు.

ఎన్‌టిఎ నిర్మాణం, పనిలో ఉన్న లోపాల లో ఇవి కొన్ని మాత్రమే. ఈ పరిస్థితిలో కొన్ని అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకొని సూచనలు చేయటం ద్వారా దీని నిర్మాణం,

అజమాయిషి కింది స్వతంత్ర ప్రతిపత్తి కల సిబిఎస్ఇ వలె ఎన్‌టిఎను కూడా స్వతంత్ర ప్రతిపత్తి కల సంస్థగా ఎందుకు ఏర్పాటు చేయ లేదని ఆమె ప్రశ్నించారు. "ఆ సంస్థ ఆర్థిక విషయాలను పరిశీలించకుండా, వివరాలను ప్రజలు తెలుకోకుండా చేయటానికి, ఆ సంస్థ జవాబుదారీగా ఉండకుండా తప్పించుకో టానికి ఈ మార్గాన్ని ఎంచుకున్నారా? అది ప్రభుత్వ సంస్థ అయితే ఈ అంశాలను కంప్ట్రో లర్ అండ్ ఆడిటర్ జనరల్ (సిఎజి) పరిశీలి స్తారు" అని ఆమె అన్నారు.

చట్టబద్ధమైన సంస్థగా ఉన్న, దీర్ఘకాలం నుండి భారీస్థాయి పరీక్షలను నిర్వహిస్తున్న సిబిఎస్ఇ సామర్థ్యాన్ని పెంచటం కోసం ప్రయత్నం చేయకపోవటంపై ఆమె లాగా అనేక మంది ఇతరులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నిబంధనలను ఉల్లంఘించటం, తప్పుడు 'కీ' లు విడుదల చేయటం, ఆలస్యం తదితరాలతో పాటు పేపర్ లీక్‌లు, పరీక్ష పేపర్లు తయారు చేయటానికి నిపుణులను ఎంచుకో వడం, పరీక్షలను నిర్వహించటానికి అవసర మైన విధి విధానాలు, వసూలు చేసే ఫీజులు మొదలైన వాటిపై ఎన్‌టిఎకు మార్గదర్శకాలు జారీ చేయటం అవసరమని ప్రభుత్వం ఎందు కు భావించటం లేదని కూడా వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

నీట్ వైఫల్యం తర్వాత సీనియర్ లెక్చరర్ల ఫోన్ నంబర్లు తీసుకొని, వారితో మాట్లాడి, పొరపాటు ఎందుకు జరిగిందో తెలుసుకోవచ్చు నని విద్యావేత్త ప్రొఫెసర్ కృష్ణకుమార్ ఎన్‌టిఎ వెబ్‌సైట్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "పర్మినెంటు ఉద్యోగం సమర్థతను నాశనం చేస్తుంది అనే భావంతో ఉంటున్న ఆధునిక కాలంలోని సంస్థలలో ఇదొకటి అని గమనించాను. పర్మినెంటు అనేది విశ్వసనీయతను దెబ్బతీస్తుందనేది కూడా వారి ఆలోచనలోని మరొక అంశం" అని చెప్పాడు.

**అవాస్తవిక లక్ష్యాలు**

ఎన్‌టిఎ ప్రతి అంశాన్నీ అవుట్ సోర్సింగ్‌కు తీసుకుంటుంది. ఎన్‌టిఎ లక్ష్యాలు ఉత్తేజం కలిగించేలా ఉన్నప్పటికీ వాటిని సాధించటానికి అది భయపడుతున్నది. తన కోసం సమయం కేటాయించమని ఇతర సంస్థలను, వ్యక్తులను అది కోరుతున్నది. (పరిశోధనపై ఆధారపడిన, నిజమైన, విశ్వసనీయమైన, సమర్థవంతమైన, పారదర్శకమైన, పక్షపాత రహితంగా అంతర్జా తీయ స్థాయి అసెస్‌మెంట్‌తో, సమానత్వంతో కూడిన నాణ్యమైన విద్యను అందించటం

పనిలో ఉన్న లోపాలను సరిదిద్దటం సాధ్యం కాదు. ఈ సమస్యను సమగ్రంగా అధ్యయనం చేయకపోతే అక్కడక్కడ జరుగుతున్న కొన్ని లోపాలను గమనించటం, పరీక్షలు నిర్వహించే సంస్థ ఇకముందు అమలు చేయవలసిన నిబంధనలను సిఫార్సు చేయటానికి మాత్రమే హై పవర్ కమిటి పరిమిత మౌతుంది.

అవసరమైన పరికరాలను పొందటంలో ఇబ్బందులు, పరీక్షలలో జరిగే అక్రమాలను ముందుగానే అంచనా వేసి, వాటిని నిరోధించటానికి అవసరమైన చర్యలు తీసుకోవటం ఆచరణకు సంబంధించిన సమస్యలు. నిబంధనల అమలు క్రమంలో ఈ సమస్యలు వస్తున్నాయని భావించినంత కాలం ఆచరణలో జరుగుతున్న లోపాలను సరిచేయటంపైనే శ్రద్ధ ఉంటుంది. అదనంగా కొన్ని నిబంధనలను సూచించటం, ఉన్నత స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమన్వయం చేసుకోవాలని, పరీక్ష పేపర్లను ముద్రించటం, పంపకం చేయటం, నిర్వహణలోనూ, మొత్తంగా పరీక్షల నిర్వహణకు కొన్ని సూచనలు చేయటానికి హై పవర్ కమిటి పరిమితమౌ తుందని భావిస్తున్నారు. ఈ విధమైన సూచనలు ప్రస్తుతం ఉన్న పద్ధతిలోనే సమస్యలను పరిష్కరించటానికి పరిమితమౌతాయి. అవి కొన్ని లోపాలను సరిదిద్దటానికి ఉపయోగపడవచ్చు. కాని సమస్యను సమగ్రంగా పరిష్కరించలేవు. అక్రమాలను, తప్పుడు పద్ధతులను నిరోధించటం, నిఘాను పెంచటం ద్వారా పరీక్షల విశ్వసనీయతను కాపాడటం అనేవి సమస్యలో ఒక భాగం మాత్రమే. సమస్యలు ఇంతకన్నా చాలా లోతైనవి. వాటిని పరిష్కరించాలంటే వ్యవస్థాగతంగా సంస్కరణలు తీసుకురావాలి.

> **“ ఉన్నత విద్యాసంస్థలలో విద్యార్థులను చేర్చుకోవటానికి, వారికి సీట్లను కేటాయించటానికి అర్హత, ప్రవేశ పరీక్షలపైనే ఆధారపడటం విద్యావ్యవస్థలో అనేక అక్రమ పద్ధతులకు పాల్పడటానికి దారితీసింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలైనా, రాష్ట్రస్థాయి సంస్థలైనా, ఉన్నత విద్యాసంస్థలైనా నిర్వహించే ప్రవేశ పరీక్షలు పాఠశాల బోర్డుల ప్రాధాన్యతను, ప్రాముఖ్యతను దిగజారుస్తున్నాయి. ”**

ఉన్నత విద్యాసంస్థలలో విద్యార్థులను చేర్చుకోవటానికి, వారికి సీట్లను కేటాయించటానికి అర్హత, ప్రవేశ పరీక్షలపైనే ఆధారపడటం విద్యావ్యవస్థలో అనేక అక్రమ పద్ధతులకు పాల్పడటానికి దారితీసింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలైనా, రాష్ట్రస్థాయి సంస్థలైనా, ఉన్నత విద్యాసంస్థలైనా నిర్వహించే ప్రవేశ పరీక్షలు పాఠశాల బోర్డుల ప్రాధాన్యతను, ప్రాముఖ్యతను దిగజారుస్తున్నాయి. పిల్లలు నేర్చుకోవటం, వారి జీవితంలో పాఠశాల విద్య యొక్క కీలకపాత్రను విస్మరిస్తున్నాయి. ప్రవేశ పరీక్షలలో సాధించే మార్కులపైనే అధికంగా ఆధారపడటంతో కోచింగ్ సెంటర్లు, కేంద్రాలు తామరతంపరగా పుట్టుకు రావటానికి దానితీసింది. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు సమగ్రంగా కాక, త్వరగా జవాబులు రాయటంపై కేంద్రీకరించేలా ఇవి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాయి.

కోచింగ్ సంస్థలు విద్యా వ్యవస్థను అనేక విధాలుగా భ్రష్టు పట్టించాయి. అవి విద్యార్థులకు పాఠశాలలపై శ్రద్ధ లేకుండా చేశాయి. విద్య నేర్పని పాఠశాలల ఏర్పాటుకు దారితీశాయి. ఆ పాఠశాలలు విద్యార్థులను చేర్చుకుంటాయి. హాజరు వేస్తాయి. బోర్డు నిర్వహించే పరీక్షలలో తమ పాఠశాల విద్యార్థులుగా పాల్గొనటానికి అవకాశం కల్పిస్తాయి. కాని వారు విద్య మాత్రం నేర్పరు. కోచింగ్ సెంటర్లు నిర్వహించే క్లాసులకు హాజరవటం కోసం విద్యార్థులను స్వేచ్ఛగా వదిలివేస్తారు. అధికారిక విద్యావ్యవస్థకు బయట ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో కోచింగ్ సెంటర్లు, సంస్థలను నిర్వహించే వారు, ఎడ్‌టెక్ తదితరాలు లాభాల కోసమే పని చేస్తున్నాయి. విద్యార్థుల నుండి పెద్దమొత్తాలు ఫీజులుగా వసూలు చేస్తూ వారిపై అత్యధికంగా ఆర్థిక భారం మోపుతున్నాయి. ఈ విధంగా భారీస్థాయిలో పోటి ఉన్న, ఎక్కువ ప్రయోజనం కలిగించే ఉన్నత విద్యావ్యవస్థను కొందరికే పరిమితం చేస్తున్నారు.

### లోపాలతో నిండిన వ్యవస్థ

ఉన్నత విద్యాసంస్థలలో విద్యార్థులను చేర్చుకోవటానికి కేవలం ప్రతిభ, ప్రవేశ పరీక్షలలో సాధించే మార్కులను ప్రాతిపదికగా చేసుకోవటం అనే భావనే లోపభూయిష్టమైనది.

లక్ష్యాలుగా ఈ సంస్థ చెప్పుకుంది). ఎన్‌టిఎ కొత్తగా ప్రారంభమైన చిన్న సంస్థ. ఈ సంస్థలో మేధావులు ఏవరూ లేరు. అనేక విభిన్నమైన కోర్సులకు, వివిధ అంశాలలో శిక్షణ పొందగోరు వారికి ఈ సంస్థ పరీక్షలు నిర్వహిస్తున్నది. మూడు ప్రధానమైన యుజి కోర్సులకు అది ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నది. ఇంజనీరింగ్‌కు జెఇఇ మెయిన్స్, వైద్య కళాశాలలలో ప్రవేశానికి నీట్–యుజి, అనేక ఇతర యుజి కోర్సులకు సియుఇటి – యుజి పరీక్షలను నిర్వహిస్తున్నది. ప్రతి సంవత్సరం ఈ పరీక్షలకు 50 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరవుతున్నారు. వీటితో పాటు పిజి కోర్సులలో చేరే వారి కోసం యుజిసి–ఎన్‌ఇటి, సియుఇటి–పిజి, సిఎస్ఐఆర్ యుజిసి–ఎన్‌ఇటి పరీక్షలను కూడా నిర్వహిస్తున్నది.

రీసెర్చి ఫెలోషిప్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియామకం, కాలేజీలు, యూనివర్సిటీలలో పిహెచ్‌డిలో చేరగోరు జూనియర్లలో అర్హులను ఎంపిక చేయటం కోసం యుజిసి–ఎన్‌ఇటి పరీక్షను నిర్వహిస్తుంది. కెమికల్ సైన్సెస్, ఎర్త్, అట్మోసియరిక్, ఓషన్, ప్లానెటరి సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మేథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ పిజి కోర్సులలో చేరటానికి సిఎస్ఐఆర్ యుజిసి–ఎన్‌ఇటి పరీక్షలు నిర్వహిస్తారు. ది కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్, హొటల్ మేనేజ్‌మెంట్ జాయింట్ ఎంట్రెన్స్ టెస్ట్, గ్రాడ్యుయేట్ ఫార్మసి ఆప్టిట్యూడ్ టెస్ట్, జెఎన్‌యు, డియు ఎంట్రెన్స్ టెస్ట్, ది ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్, ది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చి తదితరాలు ఎన్‌టిఎ నిర్వహించే పరీక్షలలో ఉన్నాయి.

ఇంత వైవిధ్యంతో కూడిన, భారీసంఖ్యలో పరీక్షలను నిర్వహించే ఎన్‌టిఎకు 25 మంది కూడా పర్మినెంట్ ఉద్యోగులు లేరు. పరిశోధనలు నిర్వహించే సామర్థ్యం లేదు. వివిధ రంగాలలో నైపుణ్యం ఉన్నవారు లేరు. పరీక్షల నిర్వహణలో నిపుణులూ లేరు. ఇన్ని ఎక్కువ పరీక్షలు నిర్వహించేలా తనపై మోపిన భారాన్ని భరించే స్థితిలో ఆ సంస్థలేదు. అందుకు వివిధ రంగాలలో అనుభవం, నైపుణ్యం కలిగిన వారితో కలిసి నిరంతరం సన్నద్ధంగా ఉండాలి. సుదీర్ఘమైన అనుభవం, విశ్వసనీయమైన రికార్డు కలిగిన అనేక సంస్థలు నిర్వహించాల్సిన పరీక్షల కోసం అత్యంత బలహీనమైన నిర్మాణం కలిగిన సంస్థపై ఆధారపడటానికి ప్రభుత్వం తొందరపడటంపై అనేకమంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యుజి నుండి పిజి వరకు ప్రవేశ పరీక్షలన్నింటినీ ఎన్‌టిఎకు అప్పగించేలా అన్ని యూనివర్సిటిలపై తీవ్రంగా వత్తిడి చేస్తున్న

అవకతవకలకు పాల్పడే వ్యక్తులు, సంస్థలు ఈ వ్యవస్థలోని లోపాలను తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకుంటారు. ఎంట్రెన్స్ పరీక్షలను నిర్వహించే రాష్ట్రాలు, తమ పరిధికి పరిమితమై ప్రవేశ పరీక్షలు నిర్వహించే యూనివర్సిటీలు తమ స్థాయిలో కేంద్రీకరణ చేస్తాయి. దానితో జాతీయస్థాయి పరీక్షలో ఎదురయే లోపాలు, సమస్యలను అవి కూడా ఎదుర్కొంటాయి.

వ్యవస్థను అపహాస్యం చేస్తూ పేపర్ లీక్ చేయటానికి బాధ్యులైన వారిని గుర్తించటం, వారికి కఠినమైన శిక్షలు విధించటం తాత్కాలికంగా మాత్రమే ఉపశమనం కలిగిస్తుంది. కొన్ని మౌలికమైన సంస్కరణలతో మూల విధానాలకు తిరిగిపోవటమే దీర్ఘకాలికంగా సరైన పరిష్కారం అవుతుంది. గత సంవత్సరాలలో పాఠశాల పరీక్షలలో సాధించిన మార్కుల శాతం, గ్రేడ్‌ల ఆధారంగా విద్యార్థులను ఉన్నత విద్యాసంస్థలలో చేర్చుకోవాలి.

భారతదేశంలో 48 స్కూలు బోర్డులు, వెయ్యికి పైగా యూనివర్సిటీలు ఉన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకొని, విద్య, పరీక్షలు, అంచనా వేయటం, మార్కులు ఇవ్వటంలో ఇంటర్‌బోర్డులో ఉన్న వ్యత్యాసాలను కనీస స్థాయికి తగ్గించే మార్గాలను అన్వేషించాలి. మార్కులను సాధారణీకరించటానికి అవసరమైన లెక్కలు తేలికగానే దొరుకుతాయి. కాని అఖిల భారతస్థాయిలో వాటిని పరిశీలించటం, పోల్చిచూడటం కాలహరణం, కఠినశ్రమకు దారితీస్తాయి. వారు గత సంవత్సరాలలో సాధించిన ఫలితాలు, ప్రతిభ ఆధారంగా నిర్వహించిన పరీక్షలో వచ్చిన మార్కులు, రెండింటినీ ప్రాతిపదికగా తీసుకొని, విద్యార్థులకు ఉన్నత విద్యాసంస్థలలో ప్రవేశం కల్పించాలనే అభిప్రాయానికి మనం వస్తున్నాం. ప్రతిభ ఆధారంగా జరిగే పరీక్షను నూతన కేంద్రస్థాయి సంస్థ నిర్వహించాలి.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల విద్యాశాఖా మంత్రులతో కూడిన సెంట్రల్ ఎడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రతిభ ఆధారంగా జరిగిన పరీక్షలో సాధించిన మార్కులు, గత సంవత్సరాలలో సాధించిన మార్కులు, గ్రేడ్‌లకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతను నిర్ణయిస్తుంది. ప్రతిభ ఆధారంగా నిర్వహించిన పరీక్షలో సాధించిన మార్కులు ఇంటర్‌బోర్డు, వివిధ యూనివర్సిటీలు ఇస్తున్న మార్కుల మధ్య వ్యత్యాసాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

ఉన్నత విద్యాసంస్థలలో ప్రవేశానికి ఇటువంటి విధానాన్ని అనుసరించటం వలన తిరిగి పాఠశాల విద్యపై కేంద్రీకరణను పెంచటంతో పాటు, బోర్డు పరీక్షల ప్రాధాన్యత కూడా ముందుకు వస్తుంది. ఒకే ఉమ్మడి పరీక్ష వలన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇది చాలా వరకు తగ్గిస్తుంది. విద్యాసంస్థలలో చేర్చుకోవటానికి నిజమైన వికేంద్రీకృతమైన వ్యవస్థగా ఇది సులభంగా ముందుకొస్తుంది. తప్పుడు భావన అయిన ఒకేదేశం, ఒకే పరీక్ష విధానం నుండి దేశాన్ని కాపాడుతుంది. భారతదేశం వంటి విస్తారమైన, భిన్నత్వం కలిగిన దేశంలో విద్యాసంస్థలలో ప్రవేశానికి ఈ విధమైన కేంద్రీకృత వ్యవస్థ పనికిరాదు.

ఏదైనా ఒక విధానం పని చేస్తుందా అని ఆలోచించే ముందు భారతదేశం రాష్ట్రాల సమాఖ్య అన్న విషయం గుర్తుంచుకోవాలి. రాజ్యాంగంలో విద్యను ఉమ్మడి జాబితాలో ఉంచారు. అందువలన విద్యకు సంబంధించిన అన్ని విషయాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారాన్ని, బాధ్యతలను పంచుకోవాలి. ఉన్నత విద్యలో ప్రమాణాలను నిలబెట్టటం, సమన్వయం చేయటాన్ని కేంద్రం జాబితాలో పెట్టారు. అయినప్పటికీ విద్యనందించటంలో రాష్ట్రాల పాత్రను బలహీనం చేయటానికి దానిని ఉపయోగించరాదు.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

---

ప్రస్తుత యుజిసి ఛైర్మన్ పనితీరును అనేక మంది పరిశీలకులు వ్యతిరేకిస్తున్నారు.

**జెఎన్‌యు ప్రతిఘటన**

ఎన్‌టిఎ నిర్వహించే సియుఇటి పరీక్షలలో జెఎన్‌యును భాగస్వామిగా చేయాలని వత్తిడి చేస్తున్నందుకు అధ్యాపకులు తమ వైస్ ఛాన్సలర్–ఇప్పుడు ఎన్‌టిఎ ఛైర్మన్–ను ప్రతిఘటించారు. ఎన్‌టిఎ ఒక ప్రైవేటు సంస్థ అని వారు స్పష్టం చేశారు. దానితో ఏవైనా లావాదేవీలు జరపబోయే ముందు దాని ఆస్తులు, అప్పులను పరిశీలించాలని, తమ యూనివర్సిటీ–ఎన్‌టిఎ మధ్య జరిగిన ఒప్పంద పత్రాన్ని బయట పెట్టాలని, ఏ షరతులపై ఆ ఒప్పందం జరిగిందో వివరించాలని జెఎన్‌యు టీచర్స్ యూనియన్ (జెఎన్‌యుటిఎ) డిమాండ్ చేసింది. ఈ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నందుకు జెఎన్‌యు నుండి ఎన్‌టిఎ ఎంత మొత్తం వసూలు చేస్తున్నది, తన స్వంత నిధులతో పాటు తాను నిర్వహిస్తున్న పరీక్షలను ఎన్‌టిఎకు ఎందుకు అవుట్ సోర్సింగ్‌కు ఇస్తున్నారో వెల్లడించాలని వారు పట్టుపట్టారు.

సియుఇటి పరీక్షల ద్వారానే విద్యార్థులను చేర్చుకోవాలని యుజిసి ఛైర్మన్ తీవ్రంగా ఒత్తిడి చేయటాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. సియుఇటి లేక యుజిసి–ఎన్ఇటి పైనే కాక, యూనివర్సిటీలలో విద్యార్థులను చేర్చుకోవటం కోసం ఎన్‌టిఎ పరీక్షలలో పాల్గొనాలన్న అంశంపై యుజిసిలో ఎటువంటి చర్చ జరగలేదని తెలిసి షాక్‌కు గురైనట్లు జెఎన్‌యుటిఎ మాజి అధ్యక్షురాలు కిద్వాయ్ చెప్పారు.

డియులో విద్యార్థులను చేర్చుకొనే క్రమంలో ఎన్‌టిఎ జోక్యం దానిని అనవసరమైన చిక్కులలోకి నెట్టింది. సియుఇటిలో చేరాలనుకుంటున్న విద్యార్థులకు కోచింగ్ సెంటర్లతో పాటు అడ్మిషన్ గైడ్లు కూడా వచ్చారు. డియు లాంటి యూనివర్సిటీలలో చేరటానికి అడ్మిషన్ ఫారం పూర్తి చేయటానికే వారు 1,500–2,000 రూపాయలు తీసుకొంటున్నారు. గ్రామీణప్రాంతం నుండి వచ్చిన విద్యార్థులకు ఇదంతా అర్థం కావటం లేదు. ఈ క్రమం అత్యంత భారంగా పరిణమించటంతో వారు అడ్మిషన్ గైడ్లపైనే ఆధారపడుతున్నారు.

**అవిశ్వాస బీజాలు నాటుతున్న ఎన్‌టిఎ**

కేంద్రీకృత పరీక్షా విధానాన్ని అన్ని యూనివర్సిటీలపై రుద్దటం ద్వారా కేంద్ర ప్రభుత్వం దేశ సమాఖ్య విధానాన్ని బలహీనపరుస్తున్నది. బోర్డు నిర్వహించే పరీక్షలలో విద్యార్థులకు వచ్చిన మార్కులకు ప్రాధాన్యత లేకపోవటంతో పాఠశాల విద్యపై సియుఇటి ప్రతికూల ప్రభావం వేస్తుందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. ఏదైతే జరుగుతుందని రెండు సంవత్సరాల క్రితం ఊహించామో అది ఇప్పుడు వాస్తవంగా మారింది. సియుఇటి పరీక్షలలో విజయం సాధించేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వటం కోసం దేశవ్యాపితంగా వేలాది కోచింగ్ సెంటర్లు పుట్టుకొచ్చాయి.

ఇటువంటి పరిస్థితులలో అన్ని ప్రవేశ పరీక్షలూ ఎన్‌టిఎ నిర్వహించేలా చేయాలని ప్రభుత్వం ప్రయత్నం చేయటం ఆశ్చర్యం కలిగిస్తున్నది. పరీక్షలపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీయటం ద్వారా విద్యావ్యవస్థను బలహీనం చేయాలని ప్రభుత్వం చూస్తున్నదా? తీవ్రమైన కొరతలతో కునారిల్లుతున్న వ్యవస్థలో పరీక్షలు మాత్రమే దాని విలువను నిలబెట్టేవిగా ఉన్నాయని రాజకీయ అధ్యయన వేత్త ప్రతాప్ భానుమెహతా చెప్పారు. పరీక్షలపై విశ్వాసం పోతే ప్రతిదీ కూలిపోతుంది. దానినే ఎన్‌టిఎ చేస్తున్నది. వ్యవస్థలో శాశ్వత అపనమ్మకాన్ని నాటుతున్నది. కొత్తదానిని, మరింత నమ్మకమైన దానిని పాతదాని స్థానంలో పెట్టకుండా, ఉన్నదానిని నాశనం చేయటం ఏ లక్ష్యాన్ని సాధించటానికి? ❋

# హిందూత్వ - సాంస్కృతిక దాడి

**సాంస్కృతిక రంగంలో పార్టీ అవగాహన కోసం ఇటీవల విజయవాడలో జరిగిన సదస్సులో సమర్పించబడిన పత్రాల్లో కొన్నిటిని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం**

హిందూత్వ అనేది హిందూ మతానికి సంబంధించిన చర్చ కాదు. అది ఒక రాజకీయ సిద్ధాంతం. ఈ విషయాన్ని హిందూత్వను ప్రతిపాదించిన సావర్కర్ స్వయంగా పేర్కొన్నాడు. ఇది పైకి హైందవ సంస్కృతిని ప్రతిబింబించే రూపంగా కనిపిస్తుంది. కాని వాస్తవంగా దానికి భిన్నంగా రాజకీయాలకోసం మత విశ్వాసాలను ఉపయోగించుకుంటుంది. హిందూత్వ అనేది మన రాజ్యాంగ మౌలిక పునాదులుగా ఉన్న ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం, సామాజిక న్యాయం, ఫెడరలిజం, స్వావలంబన వంటి సూత్రాలకు పూర్తి వ్యతిరేకం.

మొదట్లో హిందూ మహాసభగా ఉంటూ, తర్వాత రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌గా ఏర్పడి గత 100 సంవత్సరాలుగా మన జాతీయోద్యమ స్ఫూర్తికి, దేశ సమైక్యతకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాదులకు అనుకూలంగా వ్యవహరిస్తూ వస్తోంది. స్వతంత్రం అనంతరం కూడా అదే వైఖరితో వ్యవహరిస్తూ, మన రాజ్యాంగ స్ఫూర్తికి కూడా వ్యతిరేకంగా పని చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం లోనూ, రాష్ట్ర ప్రభుత్వాలలోనూ అవకాశం దొరికినప్పుడల్లా వివిధ రూపాలతో (భారతీయ జనసంఘం, జనతా పార్టీ, భారతీయ జనతా పార్టీ) చొరబడుతూ, వివిధ వ్యవస్థలలోకి, అధికార యంత్రాంగంలోకి చొరబడుతోంది. ప్రజల దైనందిన జీవిత సమస్యల పట్ల పట్టించుకోకుండా, సామాజిక, సాంస్కృతిక జీవితాల్లోకి చొరబడుతూ తన ప్రభావాన్ని విస్తరించుకుంటోంది.

**1. ఆధిపత్యంలో హిందూత్వ భావజాలం** : దేశంలో నేడు బిజెపి–ఆరెస్సెస్ కూటమి ఒక బలమైన శక్తిగా ఉంది. దాని హిందూత్వ భావజాలం దేశ వ్యాప్తంగా ప్రజల ఆలోచనలపై ఆధిపత్యాన్ని కలిగివుంది. నయా–ఉదారవాద దోపిడీ వైపు నుండి ప్రజల దృష్టిని మళ్ళించడానికి, జాతి, కులం, మతం, భాష వంటి భావోద్వేగంతో, విశ్వాసాలతో ముడిపడిన అంశాలను ఉపయోగించుకుని ప్రజలలో ఒక భాగానికి రెండో భాగం మీద ద్వేషభావం రగుల్కొల్పి పరస్పరం శత్రువులుగా తలపడే విధంగా చేయడానికి హిందూత్వ–ఆరెస్సెస్ కూటమి అధికారంలోకి వచ్చింది. కార్పొరేట్ మీడియా, కార్పొరేట్ సినిమా రంగం మొత్తం ఈ కూటమికి అండగా ఉంది. ఈ కూటమి అధికారం చేపట్టాక ప్రభుత్వ యంత్రాంగం యావత్తూ దాని పెత్తనానికి లోబడి నడుస్తోంది.

**2. వామపక్షేతర పార్టీల వైఖరులు :** బిజెపియేతర జాతీయ, ప్రాంతీయ పార్టీలలో అత్యధికం, కాంగ్రెస్‌తో సహా, హిందూత్వ భావజాలం మీద పోరాడేందుకు, దానికి ప్రత్యామ్నాయంగా లౌకిక, శాస్త్రీయ భావజాలాన్ని బలపరిచేందుకు సిద్ధంగా లేవు. అయోధ్య వివాదం మొదలు అయ్యప్ప దేవాలయంలో స్త్రీల ప్రవేశం వరకు తలెత్తిన వివాదాల విషయంలో అవి హిందూత్వ వైఖరిని ప్రశ్నించలేదు. వీరి అవకాశవాద వైఖరి హిందూత్వ కూటమి భావజాలం బలపడేందుకు మరింత ఊతం ఇస్తోంది.

**3. వామపక్ష, లౌకిక ప్రజాస్వామ్య శక్తుల కర్తవ్యం :**

ఈ పరిస్థితుల్లో హిందూత్వ – ఆరెస్సెస్ ఫాసిస్టు శక్తులను నిలవరించి లౌకిక, ప్రజాస్వామ్య భావజాలాన్ని బలంగా ప్రచారం చేసి కష్ట జీవులమధ్య ఐక్యతను, ఈ దేశపు బహుళత్వ స్వభావాన్ని కాపాడవలసిన కర్తవ్యం వామపక్ష, లౌకిక శక్తులపైనే ప్రధానంగా ఉంది.

ఈ కృషిలో అనేకమంది మేధావులు, సామాజిక వేత్తలు, శాస్త్రవేత్తలు, రచయిత(త్రు)లు, కళాకారులు హిందూత్వ ఫాసిస్టు కూటమికి ఎదురు నిలిచి ధైర్యంగా పోరాడుతున్నారు. దేశవ్యాప్తంగా వారిపై భౌతిక దాడులు సాగుతున్నాయి. కల్బుర్గీ, పన్సారే, దభోల్కర్, గౌరీలంకేశ్ వంటివారిని ఆ దాడులు బలి తీసుకున్నాయి. అనేకమందిని తప్పుడు కేసుల్లో ఇరికించి నిర్బంధించి ప్రత్యామ్నాయ భావజాల వ్యాప్తి జరగకుండా ఈ ఫాసిస్టు శక్తులు నిరోధిస్తున్నాయి. వారికి ప్రధాన స్రవంతి మీడియా ఇందులో అండదండలిస్తోంది. ఈ దాడులను, అణచివేతను వ్యతిరేకించేవారినందరినీ మనమే ఒకదగ్గరకు సమీకరించాలి.

**4. ఆరెస్సెస్ – హిందూత్వ చరిత్ర :**

1925లో నాగపూర్‌లో కె.బి.హెగ్డేవార్ దీనిని స్థాపించారు. అంతకు ముందే వి.డి.సావర్కర్ ప్రతిపాదించిన హిందూత్వ సిద్ధాంతాన్ని ఆరెస్సెస్ ఆచరించడానికి పూనుకుంది. హిందూత్వ సాంస్కృతిక జాతీయవాదాన్ని ప్రజల్లోకి చొప్పించడానికి గత 100 సంవత్సరాలుగా వివిధరకాలుగా ప్రయత్నిస్తూనే వున్నారు. ప్రస్తుతం అందులో గణనీయంగా జయప్రదం అయ్యారు.

**5. హిందూ సాంస్కృతిక జాతీయ వాదం** : మన దేశపు బహుళత్వాన్ని, లౌకిక ప్రజాస్వామ్య సాంప్రదాయాలను అణగదొక్కి ఆ స్థానంలో సాంస్కృతిక జాతీయవాదాన్ని ముందుకు తేవడం హిందూత్వ కూటమి లక్ష్యం.

**'ఒకే దేశం–ఒకే మతం–ఒకే జాతి–ఒకే భాష–ఒకే సంస్కృతి'** అన్న నినాదం సాంస్కృతిక జాతీయవాదాన్ని ప్రకటిస్తుంది. దీని సారాంశం:

(అ) భారతీయ సంస్కృతి, భారతీయ జీవన విధానం – దీనిని కేవలం ఒక మతంతోటి ముడిపెట్టడం. రాజకీయ, భౌతిక వాస్తవికతలను విస్మరించడం.

సావర్కర్ **"పుణ్యభూమి– పితృభూమి"** అన్న సూత్రీకరణలను ప్రతిపాదించాడు. ఒక మతానికి చెందినవారంతా ఒకే జాతి అనే తప్పుడు సూత్రాన్ని ప్రాతిపదికగా చేసుకోవడం, ఒక దేశంలో ఒక మతానికి చెందినవారు మాత్రమే ఉండాలని ప్రకటించడం దీని సారాంశం. ఆ సూత్రం ప్రకారం ముస్లింలు

> **❝ సాంస్కృతిక జాతీయవాదపు మూలాలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజానీకం పోరాడుతున్న క్రమంలోనే తలెత్తాయి. స్వాతంత్ర్యం, స్వావలంబన, ప్రజాస్వామ్యం, వంటి అంశాలు ఒకపక్క రాజకీయంగా ప్రాచుర్యం పొందుతున్నకాలంలోనే, ప్రజలను రెచ్చగొట్టే విధంగా వారి మత విశ్వాసాలను ఉపయోగించుకోవడం జరిగింది. బంకిం చంద్ర చటర్జీ రచించిన ఆనందమఠం నవల, ఆర్య సమాజం నుండి "మళ్ళీ వేదకాలానికి" అని దయానంద సరస్వతి ఇచ్చిన నినాదం వంటివి ఇందుకు ఉదాహరణలు. ❞**

ఈ దేశంలో సమాన హక్కులతో ఉండడానికి వీలు లేదు. ఒకవేళ ఉండదలిస్తే వారు ఏ హక్కులూ, ఎటువంటి రక్షణా లేకుండా రెండో తరగతి పౌరులుగానే జీవించాలి.

(ఆ)**"రాజకీయాలను హైందవీకరించాలి, హిందువులను సైనికీకరించాలి"** అన్నది సాంస్కృతిక జాతీయవాదంలో ప్రధాన అంశం. లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనం చేసి మనువాద శక్తుల ఆధిపత్యంలో ఒక ఫాసిస్టు పాలనను కొనసాగించాలన్నది దీని సారాంశం.

తమ వాదనను సమర్థించుకోడానికి, ప్రజలకు ఎక్కించడానికి వీళ్ళు బహుముఖంగా పని చేస్తున్నారు.

**6. హిందుత్వ మూలాలు :**

సాంస్కృతిక జాతీయవాదపు మూలాలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజానీకం పోరాడుతున్న క్రమంలోనే తలెత్తాయి. స్వాతంత్ర్యం, స్వావలంబన, ప్రజాస్వామ్యం, వంటి అంశాలు ఒకపక్క రాజకీయంగా ప్రాచుర్యం పొందుతున్నకాలంలోనే, ప్రజలను రెచ్చగొట్టే విధంగా వారి మత విశ్వాసాలను ఉపయోగించుకోవడం జరిగింది. బంకిం చంద్ర చటర్జీ రచించిన ఆనందమఠం నవల, ఆర్య సమాజం నుండి "మళ్ళీ వేదకాలానికి" అని దయానంద సరస్వతి ఇచ్చిన నినాదం వంటివి ఇందుకు ఉదాహరణలు. మళ్ళీ హిందూమత మూలాల్లోకి పోతేనే బ్రిటిష్ పాలకులను ఓడించగలుగుతాం అన్న వాదన ఇది. ముస్లింలలో దీని వలన వచ్చిన ప్రతికూల ప్రతిస్పందన ముస్లిం లీగ్ వంటి సంస్థల ఏర్పాటుకు దారి తీసింది. అంతిమంగా ఇది బ్రిటిష్ పాలకులు అనుసరించిన ''విభజించి పాలించు'' వ్యూహానికి తోడ్పడింది. ఆ తర్వాత కాలంలో జాతీయోద్యమంలో, కాంగ్రెస్ పార్టీలో సైతం అంతర్భాగంగా కొనసాగుతూనే తమ భావజాలాన్ని అన్ని సందర్భాలలోనూ ముందుకు తీసుకుపోడానికి ప్రయత్నిస్తూవచ్చారు.

**7. అంతర్జాతీయ నేపథ్యం :**

నయా-ఫాసిస్టు శక్తులు కేవలం మన దేశంలోనే కాదు, ప్రపంచంలో పలు దేశాలలో మళ్ళీ విజృంభిస్తున్నాయి. సామ్రాజ్యవాద దేశాలైన ఇటలీ, ఫ్రాన్స్, ఇంగ్లండ్, నెదర్లాండ్స్, జర్మనీ, అమెరికా వంటి దేశాలలోను, టర్కీ, ఫిలిప్పీన్స్ వంటి దేశాలలోను బలపడుతున్నాయి. నయా-ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా పెట్టుబడిదారీ వ్యవస్థ మొత్తంగా తీవ్రమైన సంక్షోభంలోకి కూరుకుపోతోంది. దానికి పెట్టుబడిదారీ చట్రంలోపలే పరిష్కారం చూడాలన్న ప్రయత్నాలు ఫలించడం లేదు. నానాటికీ తీవ్రమౌతున్న ఈ సంక్షోభం, దాని ఫలితంగా తలెత్తే ప్రతిఘటనలు తట్టుకుని కార్పొరేట్లు తమ దోపిడీని కొనసాగించాలంటే వారికి నయా-ఫాసిస్టు శక్తులే అవసరమయ్యాయి. చిన్న దేశం అయిన ఇజ్రాయిల్‌లో నయా-ఫాసిస్టు శక్తులు ఏ స్థాయికి చేరాయో దానికి ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద ప్రభుత్వాలు ఏ విధంగా కొమ్ము కాస్తున్నాయో మనం చూస్తున్నాం.

ఈ ప్రపంచవ్యాప్త పరిణామాల్లో భాగంగా మన దేశంలో హిందుత్వ-కార్పొరేట్ కూటమి ఆధిపత్యాన్ని పరిశీలించాలి.

**8. హిందుత్వ విస్తరణకు వ్యూహం :**

**(అ) ఒకే దేశం-ఒకే మతం-ఒకే జాతి - ఒకే సంస్కృతి** అన్న నినాదం ముందుకు తెచ్చి ఆ ప్రాతిపదికన మైనారిటీ మతాలకు చెందినవారినందరినీ ''ఇతరులు'' గా చిత్రించడం, దేశ ప్రజల మధ్య ఒక అడ్డుగోడ నిర్మించడం.

హిందువులందరూ ఆర్యజాతికి చెందినవారనే వాదన, ఒకప్పుడు భారత ఉపఖండం అంతా హిందూ రాజ్యంగా ఉండేదనే అఖండభారత్ వంటి అవాస్తవాలను వాస్తవ చరిత్రగా ప్రచారం చేయడం, ఆర్యులతోబాటు, ఆ ముందు, వెనుక ఈ ఉపఖండంలోకి వలసలు వచ్చిన తక్కినవారందరూ అనార్యులని, దురాక్రమణదారులని ప్రచారం చేయడం

**(ఆ) సనాతన ధర్మం:** మన ప్రాచీన సంస్కృతి మొత్తంగా చాలా ఘనమైనదని, అత్యంత పురాతనమైనదని, తక్కిన దేశాల సంస్కృతుల కన్నా చాలా గొప్పదని చెప్పి వైదిక బ్రాహ్మణాధిపత్య సంస్కృతి వికృత రూపాన్ని కప్పిపుచ్చడం, దాన్నే అందరిమీదా రుద్దడం. వివక్షత, దోపిడీతో కూడిన కులవ్యవస్థను సమర్థించి దానినే ఆదర్శంగా చూపడం. పురుషాధిక్యతను సమర్థిస్తూ మనువాదమే అనుసరణీయమని ప్రచారం చేయడం. బ్రాహ్మణ వర్గాల ఆధ్వర్యంలో రూపు దిద్దుకున్న పురాణాల కాల్పనికతనే చాలా గొప్పగా చిత్రించి అదే మన ఆదర్శంగా ప్రచారం చేయడం (ఉదా: రామరాజ్యం). సనాతన ధర్మాన్ని సమర్థించుకోడానికి వేదాల్లోనే సమస్త విజ్ఞానమూ ఉందన్న మూర్ఖత్వాన్ని శాస్త్రవేత్తల ముసుగులో ఉండే కొందరు అవకాశవాదులతో ప్రచారం చేయించడం, అసలైన శాస్త్ర విజ్ఞానాన్ని వెనక్కి నెట్టి, శాస్త్రీయ, హేతువాద దృక్పథాన్ని తిరస్కరించి బేషరతుగా మనువాదానికి, మూఢవిశ్వాసాలకు తలవొగ్గేలా వత్తిడి చేయడం, సనాతన ధర్మం అనే భావనను ప్రశ్నించేవారంతా దేశద్రోహులని ప్రచారం చేయడం...ఇదే సనాతన ధర్మం పేరుతో హిందుత్వ ముందుకు తెస్తున్నది.

(ఇ) మన దేశ సంస్కృతికి ఉన్న భిన్న, వైవిధ్య స్వభావాన్ని తిరస్కరించి కేవలం బ్రాహ్మణవాద సంస్కృతినే, **మనువాద సంస్కృతినే హిందూ సంస్కృతిగా చెప్పడం,** దానినే దేశ ప్రజలందరిమీదా రుద్దడం, దేశ బహుళత్వాన్ని దెబ్బ తీయడం.

(ఈ) ఈ ప్రయత్నానికి ఆటంకంగా ఉన్నందున మన రాజ్యాంగంలోని లౌకిక తత్వం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, స్వావలంబన, ఫెడరలిజం వంటి **మౌలిక విలువల మీద దాడి ఎక్కుపెట్టడం.**

**9. చరిత్ర వక్రీకరణ :**

స్వాతంత్ర్యోద్యమానికి వెన్నుపోటు పొడిచిన చరిత్ర హిందుత్వ-ఆరెస్సెస్ శక్తులది. బ్రిటిష్ పాలకులకు, ప్రజా పీడకులుగా ఉన్న సంస్థానాధిపతులకు అండగా నిలిచిన చరిత్ర వారిది. మహాత్ముడిని హత్య చేసి దేశాన్ని మతఘర్షణల రక్తపుటేరుల్లో ముంచెత్తిన చరిత్ర వారిది. అందుచేత ఆ

వాస్తవాలను తొక్కిపెట్టడానికి, తమ హిందూత్వ ప్రచారాన్ని సమర్ధించుకోడానికి వీలుగా వాస్తవ చరిత్రను పెద్ద ఎత్తున మార్చివేస్తున్నారు.

వాస్తవ చరిత్రను వక్రీకరించి కల్పిత గాథలనే వాస్తవ చరిత్రగా చిన్న వయస్సులనుండీ మెదళ్ళలో ఎక్కించడం, సింధునాగరికతను సరస్వతీ నాగరికతగా పేరు మార్చి, అది వైదిక నాగరికతేనని అవాస్తవాలను ప్రచారం చేయడం, మధ్య యుగాలలో వికసించిన విజ్ఞానాన్ని, సంస్కృతిని గుర్తించడానికి నిరాకరించడం, పురుషోత్తముడు, రాణా ప్రతాప్, శివాజీ తదితరులు తమ రాజ్యాల, అధికారాలకోసం సాగించిన యుద్ధాలను హిందూ ధర్మ రక్షణ కోసం చేసినట్టు చిత్రించడం, వారికి తామే వారసులమని చెప్పుకోవడం,

వెయ్యి సంవత్సరాల క్రితం వరకూ మన దేశం చాలా గొప్పగా స్వర్ణయుగంలో నడిచిందని, గత వెయ్యి సంవత్సరాలూ చీకటి యుగం అని, దానికి కారణం విదేశీ పాలకులు– ముఖ్యంగా ముస్లిం పాలకులేనని, ఇప్పుడు మళ్ళీ స్వర్ణయుగంలోకి గత పదేళ్ళుగా అడుగు పెట్టామని చరిత్రను వక్రమార్గంలో పట్టించడం, బ్రిటిష్ వలసపాలకులు దేశాన్ని కొల్లగొట్టిన సంగతి కప్పిపుచ్చి ఈ దేశంలోనే అంతర్భాగంగా ఉంటూ, సమ్మిశ్రిత సంస్కృతిలో కలగలిసిపోయిన ముస్లింల వల్లే వెనుకబడిపోయామని చెప్పడం, ఆ కాలంలో ఇతర కారణాల రీత్యా జరిగిన యుద్ధాలన్నీ మత యుద్ధాలేనంటూ చెప్పడం, జాతీయోద్యమ చరిత్రను పూర్తిగా మార్చివేసి ఆ ఉద్యమానికి తాము చేసిన ద్రోహాన్ని కప్పిపుచ్చుకోవడమే కాకుండా, బ్రిటిష్ వారికి లొంగిపోయిన సావర్కర్‌ను, గాంధీని హత్య చేసిన గాడ్సేను దేశభక్తులుగా చిత్రించడం, గాంధీ, అంబేద్కర్, వివేకానందుడు, గురజాడ తదితర మహా వ్యక్తుల గురించి గొప్పగా పొగడ్తలు కురిపిస్తూనే ఆ మహా వ్యక్తుల ఆశయాలకు, విధానాలకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించడం, మళ్ళీ వారి వారసత్వాన్ని కొనసాగించేది తామేనని ప్రకటించుకోవడం వంటివి చేస్తున్నారు. ముఖ్యంగా చరిత్రను ఇప్పుడు పాఠ్యాంశంగా నేర్చుకునే కొత్త తరాలను ఈ వ్యూహంతో పూర్తిగా దారి తప్పిస్తున్నారు.

**10. హిందూత్వ ప్రచార వ్యూహం :**

**(అ) మత చిహ్నాలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం :** అద్వానీ రథయాత్ర, మోడీ గుజరాత్ గౌరవ యాత్ర, రామజన్మభూమి ప్రచార కార్యక్రమాలు, శిలాన్యాస్, రామపాదుకాయాత్ర, రామజ్యోతి, హనుమద్‌జ్యోతి యాత్రలు వగైరా.

> **❝ గతంలో అగ్రవర్ణాలవారికే ప్రధానంగా పరిమితం అయిన మత క్రతువులు, కర్మకాండలు, దీక్షలు, వ్రతాలు, ఉపవాసాలు వగైరాలు ఇప్పుడు తక్కిన సామాజిక తరగతులలోకీ విస్తరింపజేస్తు న్నారు. ప్రధానంగా ఇళ్ళల్లో జరుపుకునే దీపారాధన, రక్షాబంధన్, తదితర కార్యక్రమాలను పెద్ద పెద్ద సమీకరణలతో కూడిన ఈవెంట్స్ గా నిర్వహిస్తున్నారు. ఈ నిర్వహణలో దేవాలయాలను, యాత్రా స్థలాలను వాడుకుంటున్నారు. దేవాలయ కమిటీలను, వాటివద్ద నున్న నిధులను సైతం వాడుకుంటున్నారు. ❞**

**(ఆ) మత సందర్భాలను, ప్రార్థనాస్థలాలను ఉపయోగించడం:** గతంలో అగ్రవర్ణాలవారికే ప్రధానంగా పరిమితం అయిన మత క్రతువులు, కర్మకాండలు, దీక్షలు, వ్రతాలు, ఉపవాసాలు వగైరాలు ఇప్పుడు తక్కిన సామాజిక తరగతులలోకీ విస్తరింపజేస్తు న్నారు. ప్రధానంగా ఇళ్ళల్లో జరుపుకునే దీపారాధన, రక్షాబంధన్, తదితర కార్యక్రమా లను పెద్ద పెద్ద సమీకరణలతో కూడిన ఈవెంట్స్‌గా నిర్వహిస్తున్నారు. ఈ నిర్వహణలో దేవాలయాలను, యాత్రాస్థలా లను వాడుకుంటున్నారు. దేవాలయ కమిటీలను, వాటివద్దనున్న నిధులను సైతం వాడుకుంటున్నారు. తద్వారా ప్రజానీకం మీద సాంస్కృతిక ఆధిపత్యాన్ని నెరపడం తేలిక అవుతుంది..

మతసంబంధిత కార్యకలాపాలలో కొన్నింటికి జాతీయ హోదా కల్పిస్తున్నారు. వాటిలో ప్రధానితో సహా, అధికారులతో సహా అందరూ పాలు పంచుకుంటున్నారు. ఉదా: రక్షా బంధన్, గణేశ్ ఉత్సవాలు, శివరాత్రి, రామ నవమి వగైరా. గిరిజన, దళిత తరగతుల ప్రజలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు.

**(ఇ) దళిత, గిరిజన తరగతులపై దాడి :** వేల సంవత్సరాలపాటు హిందూ అగ్రవర్ణ ఆధిపత్య సమాజానికి దూరంగా ఉన్న ఆ తరగతుల ప్రజలు తాముగా రూపొందించుకున్న సాంప్రదాయాలపైన, విశ్వాసాలపైన, సంస్కృతిపైన, ఆహారపుటలవాట్లపైన బహుముఖదాడి చేస్తున్నారు. పండుగల సందర్భంగా, వివాహం, పుట్టుక, చావు తదితర సందర్భాలలో బ్రాహ్మణ మత సంస్కృతీ సాంప్రదాయాలను వారిమీద రుద్దుతున్నారు. ఆ తరగతుల్లో సైతం దొంతరలను సృష్టిస్తున్నారు. బహుదేవతల, బహు ఆరాధనా పద్ధతులతో ఉండే భారతీయ సమాజాన్ని ఒక మూసలోకి తీసుకురావడానికి, ఆదివాసుల ప్రత్యేకతలను నాశనం చేయడానికి ఇది దారి తీస్తుంది. కుటుంబ వ్యవస్థను సైతం విడిచిపెట్టకుండా దానిలోకి చొరబడి తమ భావజాలాన్ని జొప్పిస్తున్నారు.

**(ఈ) సామాజిక మాధ్యమాల నియంత్రణ :** అంబానీ, అదానీల చేతుల్లోకి జాతీయ, ప్రాంతీయ టివి చానెళ్ళు చేరిపోయాయి. హిందూత్వ భావజాలాన్ని ప్రచారం చేసే కార్యక్రమాలు భక్తి, ఆరాధన వంటి పేర్లతో ప్రసారం అవుతున్నాయి. టివి సీరియళ్ళలో సైతం అగ్రకుల, పురుషాధిక్య సాంప్రదాయాలు, మూఢ విశ్వాసాలు ప్రసారం ఔతున్నాయి.

రామాయణం, మహాభారతం సీరియళ్ళుగా దూరదర్శన్‌లో ప్రసారం చేశారు. రకరకాల రామాయణ గాథల స్థానంలో ఒకే ఒక గాథను తీసుకువచ్చారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం అన్న డిమాండును ఎక్కువ మంది ప్రజలు ఆమోదించడానికి ఇది ఉపయోగపడింది. మత ప్రచార చానెళ్ళతోబాటు అన్ని చానెళ్ళూ మత విశ్వాసాల ప్రచారానికి వేదికలయ్యాయి.

**(ఉ) సింబాలిజం:** సినిమాల్లో హిందూ మత చిహ్నాలను విరివిగా వాడుతున్నారు. హీరోలను తిలకాలతో, విభూదితో, చేతికి రక్షలతో, చూపడం పెరిగింది. కొట్లాటలను చూపించే సమయాల్లో కాషాయ ధ్వజాలతో త్రిశూలాలతో చిత్రీకరిస్తున్నారు. ఫైటింగ్‌ల బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌గా హిందూమత మంత్రాలను, చాలీసాలను పఠిస్తున్నారు. భారతమాత చిహ్నాన్ని చూపిస్తున్నారు. దేవాలయాలలో చాలా శక్తులు నిక్షిప్తం అయివున్నట్టు, జ్యోతిష్యం చాలా గొప్ప శాస్త్రం అయినట్లు చూపిస్తున్నారు. మరికొన్ని సినిమాల్లో పాకిస్తాన్ నుండి, చైనా నుండి మన దేశాన్ని అస్థిరత్వం పాలు చేసే కుట్రలు సాగుతున్నట్టు

> **❝ సామాజిక, సాంస్కృతిక సంస్థల పేరుతో వేలాది సంస్థలను నెలకొల్పారు. వాటన్నింటికీ ఉమ్మడి నెట్‌వర్క్ ఉంటుంది. కాని పైకి మాత్రం ఒకదానితో ఇంకొకటి సంబంధం లేనట్టే వ్యవహరిస్తాయి. ఆరెస్సెస్, భజరంగ దళ్, విశ్వహిందూ పరిషత్, వనవాసి కళ్యాణ్, భారతీయ విద్యా భవన్, గోరక్షణ సమితి, రామజన్మభూమి న్యాస్ వగైరా. ❞**

కథనాలు ఉంటాయి. చాలా సినిమాల్లో సైన్యం పట్ల వీర భక్తిని ప్రదర్శిస్తారు.

**11 హిందూత్వ వ్యాప్తికి నిర్మాణ రూపాలు:**

(అ) సామాజిక, సాంస్కృతిక సంస్థల పేరుతో వేలాది సంస్థలను నెలకొల్పారు. వాటన్నింటికీ ఉమ్మడి నెట్‌వర్క్ ఉంటుంది. కాని పైకి మాత్రం ఒకదానితో ఇంకొకటి సంబంధం లేనట్టే వ్యవహరిస్తాయి.

ఆరెస్సెస్, భజరంగదళ్, విశ్వ హిందూ పరిషత్, వనవాసి కళ్యాణ్, భారతీయ విద్యా భవన్, గోరక్షణ సమితి, రామజన్మభూమి న్యాస్ వగైరా.

(ఆ) ఉనికిలో ఉన్న అనేక సంస్థలలోకి, వ్యవస్థలలోకి చాటుగా చొరబడ్డారు. వాటిలో అధికార, అనధికార సంస్థలు ఉన్నాయి. విద్యా వ్యవస్థను నియంత్రించే సంస్థలు ఉన్నాయి. గ్రంధాలయ సంస్థలు, సేవా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయి.

(ఇ) ప్రభుత్వ అధికార వ్యవస్థను మొత్తం ఉపయోగిస్తున్నారు.

(ఈ) పదుల వేల సంఖ్యలో స్కూళ్ళు నెలకొల్పి వాటి ద్వారా తమ భావజాలాన్ని చిన్నప్పటినుంచే ఎక్కిస్తున్నారు, దానితోబాటు ఆ పిల్లల తల్లిదండ్రులను కూడా ప్రభావితం చేయదానికి ప్రయత్నిస్తున్నారు.

(ఎ) **నూతన విద్యావిధానం 2023** పేరుతో విద్యను మొత్తంగా కాషాయీకరణ. కార్పొరేటీకరణ చేస్తున్నారు. యుజిసిని ఆక్రమించారు. సైనిక్ స్కూల్స్ ఏర్పాటు నిర్వహణలో ప్రైవేటు సంస్థలకు అవకాశం కల్పించే పేరుతో ఆరెస్సెస్‌కు చెందినవారిని చొప్పించి విద్యార్థులలో హిందూత్వ భావజాలాన్ని ఎక్కిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా లౌకిక స్ఫూర్తితో రాజ్యాంగబద్ధంగా వ్యవహరించవలసిన సైన్యాన్ని హైందవీకరించే కుట్ర ఇది.

ఆయా రంగాల్లో నిష్ణాతులైన మేధావులని సైతం సక్కకు నెట్టి తమ సంఘపరివార్‌కు చెందిన వారినే యూనివర్సిటీలకు, ఉన్నత సాంకేతిక విద్యా సంస్థలకు ప్రధాన పదవుల్లో నియమిస్తున్నారు. పరిశోధనా ప్రాజెక్టులుగా తమ హిందూత్వ ఎజండాలనే చేర్చి పట్టాలు ప్రదానం చేస్తున్నారు. వందల సంఖ్యలో ప్రైవేటు యూనివర్సిటీలను అనుమతిస్తున్నారు. పైనుంచి కిందివరకూ సంస్కృతాన్ని రుద్దుతున్నారు. బోధనా సిలబస్ నుండి డార్విన్ పరిణామవాదం, మెండెలీన్ పట్టిక వంటి శాస్త్రీయ అంశాలను తొలగించారు.

**(ఏ) గీతా ప్రెస్ :** గోరఖ్‌పూర్‌లో ఉన్న గీతా ప్రెస్ ద్వారా 12 కోట్లకు పైగా భగవద్గీతలను, 7 కోట్లకు పైగా హనుమాన్ చాలీసాలను అచ్చువేసి పంచారు. ఇంకా కొనసాగిస్తున్నారు. ఇతర పురాణాలు కూడా అదే విధంగా పంచుతున్నారు. ఇప్పుడు ఇళ్ళలో ఎవరైనా చనిపోతే వారి పేరుతో భగవద్గీతలను పంచడం ఒక సాంప్రదాయంగా తయారైంది. అటువంటి సందర్భాలలో ఆ ప్రెస్ నుంచి రాయితీలమీద పుస్తకాలు ఇస్తున్నారు.

**12. హిందూత్వ శక్తులకు తోడ్పడే ఇతర వ్యవస్థలు:**

**(అ) గ్రామస్థాయి వ్యవస్థలు:** పురాణ కాలక్షేపాలు, ప్రవచనాలు, గీతా పఠనాలు, మూఢవిశ్వాసాలు వీటిని ఉపయోగించుకుంటున్నారు. గ్రామాల్లో సాధారణంగా జరుగుతూవుండే మత కార్యక్రమాలను రామజన్మభూమి ఉద్యమం సందర్భంగా చాలా ఎక్కువగా ఉపయోగించుకున్నారు.. చాలా రాష్ట్రాల్లో గ్రామస్థాయి వరకూ నిర్మాణాన్ని చేయగలిగారు.

హిందూత్వ అనేది హిందూ మతాన్ని కాపాడడానికి వచ్చింది అన్న పొరపాటు అభిప్రాయాన్ని కలిగించడానికి, ప్రజల సహకారం పొందడానికి ఈ వ్యవస్థలను ఉపయోగించుకుంటున్నారు.

(ఆ) **కుల కట్టుబాట్లు, కుల పెద్దల ఆధిపత్యం :** వీటిని బలంగా సమర్ధించడం ద్వారా ఆయా కులాల పెద్దల మద్దతును సమీకరించుకుంటున్నారు. అభివృద్ధినిరోధక శక్తులకు ఊతం అందిస్తున్నారు.

**13. హిందూత్వ భావజాలాన్ని ప్రజలలోకి వ్యాప్తి చేసే దశలు:**

(అ) **మొదటి దశ:** మనమంతా హిందువులం, మనకందరికీ ఉమ్మడి ప్రయోజనాలు ఉంటాయి. అవి ఆధ్యాత్మికత, విశ్వాసాలు, సాంప్రదాయాలతో ముడిపడి వుంటాయి. వాటిపట్ల మనం గర్వపడాలి, వాటిని కాపాడుకోడానికి మనమంతా ఒకటి కావాలి. (హిందూ అస్తిత్వం)

(ఆ) **రెండవ దశ :** మన హిందువుల ప్రయోజనాలు వేరు, ఇతర మతస్తుల ప్రయోజనాలు వేరు. (భిన్న మతాల మధ్య అడ్డుగోడలు నిర్మించడం)

(ఇ) మన ప్రయోజనాలు దెబ్బ తినిపోడానికి, మనం వెనుకబడిపోడానికి బైటనుండి వచ్చిన ఇతర మతస్తులే కారణం. వారే మన శత్రువులు.

(ఇ) **మూడో దశ - వదంతుల వ్యాప్తి** :ఎంపిక చేసిన ప్రాంతాలలో మతఘర్షణలు రేకెత్తించడం కోసం సోషల్ మీడియాను, లోకల్ మీడియాను వాడుకుని అబద్ధాలను పుకార్లను పెద్దఎత్తున ప్రచారం చేసి అక్కడి ప్రజల్లో భిన్న మతస్తుల మధ్య అపనమ్మకాన్ని కలిగిస్తారు. హిందువులమీద దాడులు జరిగిపోతున్నట్టు భ్రమింపజేస్తారు. ఆ నేపథ్యంలో ఏదో సాకుతో ఘర్షణ సృష్టించగానే అది కార్చిచ్చులా వ్యాపిస్తుంది. గోగూండాల దాడులన్నీ ఇటువంటి వదంతులను ఉపయోగించుకునే జరిగాయి. మైనారిటీ మతస్తులమీద దాడులు జరిగిన ప్రతీ సందర్భంలోనూ ఈ ఎత్తుగడలు అమలు జరిగాయి. వాటికి ప్రభుత్వ యంత్రాంగం ప్రదర్శించే అనుకూల లేదా నిర్లిప్త ధోరణులు కూడా దోహదం చేస్తున్నాయి.

మన రాష్ట్రంలో కూడా ఇటువంటి ప్రయత్నాలు జరిగాయి. తిరుపతిలో అన్యమత ప్రచారం గురించి, అంతర్వేదిలో, రామతీర్థంలో దాడులు జరిగాయని పుకార్లు పుట్టించారు. వాటిని టిడిపి, జనసేన కూడా అందుకున్నాయి.

**14. హిందూత్వ - శ్రామిక వర్గాల పట్ల వైఖరి :**

కార్పొరేట్ శక్తులతో హిందూత్వ జతకట్టి ఒక కూటమిగా వ్యవహరిస్తోంది.

అంతర్జాతీయంగా బహుళజాతి సంస్థలకు, సామ్రాజ్యవాదులకు, నయా-ఫాసిస్టు శక్తులకు హిందూత్వ అనుకూలంగా ఉంటుంది. ఇజ్రాయిల్‌తో చెలిమి, గాజా మారణహోమానికి సమర్ధన, అమెరికా ముందుకు తెచ్చిన "ఇస్లామిక్ ఉగ్రవాదం నిర్మూలన" నినాదాన్ని హిందూత్వ తలకెత్తుకుంది. ఈ కార్పొరేట్ల సేవలో మునిగి సమాజంలో విషపు మొక్కలుగా ఉన్న అన్ని రకాల ప్రతీఘాత శక్తులను, తిరోగామి భావాలను, అనాచారాలను తలకెత్తుకున్నాయి. వాటిని గొప్ప విలువలుగా చిత్రిస్తున్నాయి.

కార్మిక సంస్కృతి అంటే వీరికి చిన్నచూపు. ప్రపంచమంతా శ్రమజీవులు జరుపుకునే పండుగ మేడే. దానిని హిందూత్వ గుర్తించదు. దానికి పోటీగా విశ్వకర్మ జయంతి అని ఒక పండుగను ముందుకు తెస్తున్నారు. కార్మికవర్గంతో ఏమాత్రమూ సామ్యం లేని సందర్భం ఇది. ఈ క్రమంలో కార్పొరేట్లు కోరుతున్న విధంగా పనిగంటల నిడివిని 8 గంటలకు మించి పొడిగించేందుకు ప్రాతిపదికను ఏర్పరుస్తున్నారు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి వారానికి 70 గంటల పని ఉండాలని చేసిన ప్రకటనను ఈ నేపథ్యంలో చూడాలి.

**15. అస్తిత్వ భావాలు-హిందూత్వ కపటవైఖరి:**

పురుషాధిక్యతకు, అగ్రవర్ణ దోపిడీ, అణచివేతలకు ప్రతిస్పందనగా మన సమాజంలో అస్తిత్వ భావాలు వచ్చాయి. అదే పురుషాధిక్యతను, అగ్రవర్ణ ఆధిపత్యాన్ని హిందూత్వ శక్తులు బలపరుస్తాయి. కాని అస్తిత్వ ఉద్యమాల యెడల కపటవైఖరిని ప్రదర్శిస్తుంది.

> **❝ కార్మిక సంస్కృతి అంటే వీరికి చిన్నచూపు. ప్రపంచమంతా శ్రమజీవులు జరుపుకునే పండుగ మేడే. దానిని హిందూత్వ గుర్తించదు. దానికి పోటీగా విశ్వకర్మ జయంతి అని ఒక పండుగను ముందుకు తెస్తున్నారు. కార్మిక వర్గంతో ఏమాత్రమూ సామ్యం లేని సందర్భం ఇది. ఈ క్రమంలో కార్పొరేట్లు కోరుతున్న విధంగా పనిగంటల నిడివిని 8 గంటలకు మించి పొడిగించేందుకు ప్రాతిపదికను ఏర్పరుస్తున్నారు. ❞**

(అ) **మహిళలు :** ప్రాచీన సమాజాల్లో మహిళలకు చాలా ఉన్నత స్థానం ఉండినట్టు, ముస్లిం ఆధిపత్యం వచ్చాకనే మహిళల స్థానం దిగజారిపోయినట్టు ప్రచారం చేస్తారు హిందూత్వ వాదులు. ఇందుకు గార్గి, మైత్రేయి వంటి ఋషులను, లక్ష్మీబాయి, రుద్రమదేవి, మాంచాల వంటి పేర్లను వాడుకుంటారు. కాని ఆచరణలో మనువాదాన్ని, సనాతనధర్మాన్ని ముందుకు తెస్తున్నారు. అత్యాచార, మానభంగ నేరస్తులను వెనకేసుకువస్తారు. శబరిమలలో మహిళల ఆలయ ప్రవేశానికి ఉన్న ఆంక్షల విషయంలో వీరి కుళ్ళు సంస్కృతి బైటపడింది.

(ఆ) **దళితులు :** అంబేద్కర్‌కు పూజలు చేస్తారు. ఆయన ఆశయాలను తామే కొనసాగించగలం అని ప్రకటిస్తారు. కాని ఆచరణలో సామాజిక న్యాయానికి దళితులను దూరం చేసే విధానాలనే అమలు చేస్తారు. దళితులపై దాడులు చేసేవారి కొమ్ము కాస్తారు. మనువాదాన్ని బలపరుస్తారు. దళితులలో ఉండే వివిధ ఉపకులాల మధ్య ఉండే తేడాలను ఉపయోగించుకుని వారిలో కొందరు కుల నాయకులను చేరదీసి మభ్యపెడతారు. మతం మారితే రిజర్వేషన్ ఉండకూడదని ప్రచారం చేస్తారు. కొన్ని వెనుకబడిన కులాల నాయకులను రెచ్చగొట్టి వారి కులాలను దళితుల జాబితాలో చేర్చాలనే ఆందోళనలను రేపుతారు. ఈ గందరగోళంలో దళితుల ఆర్థిక, సామాజిక సమస్యలన్నీ వెనక్కిపోతాయి.

(ఇ) **గిరిజనులు:** గిరిజన తెగల మధ్య తేడాలను రెచ్చగొడతారు. ఒకతెగకు మరొక తెగ శత్రువులు అన్న భావాన్ని కల్పిస్తారు. మూలవాసుల సిద్ధాంతాన్ని అడ్డం పెట్టుకుని గిరిజనులంతా మూలవాసులేనని, దానర్థం గిరిజనులందరూ హిందువులేనని ప్రచారం చేస్తారు. హిందూ క్రతువులను, ఆరాధనా పద్ధతులను, గిరిజనులమీద రుద్ది, గిరిజనులు తమ సాంప్రదాయ సంస్కృతికి దూరమయేట్టు చేస్తారు. క్రైస్తవ మతానికి మారినవారు తక్కినవారికి శత్రువులు అన్నట్లు ప్రచారం చేస్తారు.

**ముగింపు**

హిందూత్వ-కార్పొరేట్ కూటమి సాధించిన ఆధిపత్యాన్ని సాంస్కృతిక రంగంలో ప్రతిఘటించడం ద్వారా మాత్రమే మనం ప్రత్యామ్నాయంగా ప్రజాస్వామిక, అభ్యుదయ సంస్కృతిని నిర్మించుకోగలుగుతాం. ❊

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

చరిత్ర

# సామాజిక మార్పుల వరుసక్రమం



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకుడు

ఎంవిఎస్ శర్మ

(భారతదేశ చరిత్ర వ్యాసాలు ప్రతీ నెలా ప్రచురిస్తున్నాం. ప్రాచీనయుగం దాటి ఇక మధ్యయుగాల చరిత్రలోకి అడుగు పెట్టబోయేముందు ఇంతవరకూ వివరించిన చరిత్రలో సామాజికమార్పు వరుస క్రమాన్ని ఒక్కసారి మననం చేసుకుందాం)

ప్రాచీన భారత సమాజానికి మొత్తంగా ఫలానా కాలం అంతా ఆదిమ సమాజం అని, ఫలానా కాలం బానిస సమాజం అని...ఇలా ఒక లేబుల్ అంటిం చడం సాధ్యం కాదు. దానికన్నా ఆ సమాజం పరిణామం స్థూలంగా ఏవిధంగా ముందుకు సాగిందో రేఖామాత్రం గానైనా నిర్ధారించుకోవ దం అవసరం.

ఆహారాన్ని పోగుచేసుకుని, ఏరుకుని అక్కడికక్కడే దానిని తినే పాతరాతియుగం మొదటిదశ. ఆ తర్వాత కొత్త రాతి యుగంలో, కంచు-రాగి యుగంలో ఆహారం ఉత్పత్తి చేసుకోగలిగిన దశలోకి అడుగుపెట్టాం. ఈ క్రమంలోనే వ్యవసాయిక సమాజాలు హరప్పా పట్టణ నాగరికత అభివృద్ధికి దారి తీశాయి. సింధు-హరప్పా నాగరికత విచ్ఛిన్నం అయిన తర్వాత దాదాపు ఒక వేయి సంవత్సరాలపాటు చెల్లా చెదురుగా ఎక్కడికక్కడ స్థానిక తెగలుగా సమాజం కొనసాగింది. ఆ తర్వాత గుర్రాలను వినియోగించేవారు, పశుపాలకులుగా ఉన్నవారు వివిధ తెగలుగా కొన్ని వందల సంవత్సరాల కాలంలో ఈ ఉపఖండంలోకి ప్రవేశించారు. రుగ్వేదం ఆ దశలో జరిగిన సామాజికమార్పును సూచిస్తుంది. పశుపాలన ప్రధానంగా ఉండిన తొలి వేదకాలం గడిచి మలివేదకాలం నాటికి వచ్చేసరికి వ్యవసాయం ప్రధాన వ్యాపకంగా మారింది. ఐతే ఆ వ్యవసాయం నుండి పాలకులకు లభించిన మిగులు నామమాత్రంగానే ఉండేది. ఆ సమాజంలో వర్గ విభేదాలు అంత తీవ్రంగా లేవు. వేదకాలం అనంతరం ఇనుము వాడకం పెరిగిన తర్వాత వ్యవసాయంలో మిగులు గణనీయంగా ఏర్పడింది. దానిలో పెద్ద భాగాన్ని పాలకవర్గాలు చేజిక్కించుకోవడం సాధ్యం అయింది. అప్పటినుంచీ వర్గ విభజన భారత సమాజంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ విభజన కుల వ్యవస్థ రూపంలో స్థిరపడింది. బుద్ధుడి కాలం నుండి (క్రీ.పూ. 6వ శతాబ్దం) గుప్తుల కాలం దాకా (క్రీ.శ.6వ శతాబ్దం) ఈ వ్యవసాయిక సమాజం నిలకడగా నడిచింది. క్రీ.శ.3వ శతాబ్దం తర్వాత రాజు భూములను అధికారులకి, బ్రాహ్మణులకి దానాల రూపంలో కేటాయించడం పెరిగింది. ఫలితంగా రాజుకు, రైతులకు నడుమ భూస్వామ్యవర్గం ఒకటి ఏర్పడింది. ఈ మార్పుపట్ల రైతులలో వ్యతిరేకత తలెత్తి సామాజిక మార్పులకు దారి తీసింది. అది కుల వ్యవస్థలో అనేక మార్పులకు కారణం అయింది. తాత్విక, సాంస్కృతిక, శాస్త్ర విజ్ఞాన రంగాలలో ఆ మార్పుల ప్రభావం వ్యక్తం అయింది.

### మతం

తమ మనుగడ కోసం ప్రకృతితో నిరంతరం తలపడే మానవులు ఆ క్రమంలో కొంత పరిజ్ఞానాన్ని, సాంకేతిక నైపుణ్యాన్ని సాధించినా, వారి శక్తికి, అవగాహనకు అందని అంశాలు అనేకం ఉన్నాయి. ఇక్కడే దైవం భావన తలెత్తింది. అది మత వ్యవస్థకు దారి తీసింది. బ్రాహ్మణమతం తొలినాటినుండీ ఆధిపత్యమతంగా ఉంది. ఆదివాసీ తెగల ప్రజలను వ్యవసాయిక సమాజంలో భాగస్వాములుగా మార్చడానికి, ఆ క్రమంలో కుల వ్యవస్థను విస్తరించడానికి బ్రాహ్మణమతం ఒక ముఖ్యసాధనంగా ఉపయోగపడింది. క్రీ.పూ.6వ శతాబ్దం నాటికి బౌద్ధం, జైనం వచ్చాయి. క్రీ.శ.1వ శతాబ్దం నాటికే క్రైస్తవ మతం కూడా ఇక్కడ ప్రవేశించినా, పెద్దగా ప్రభావం కలిగించలేదు. దాదాపు 800 సంవత్సరాలపాటు బౌద్ధం ఇక్కడ బలంగా విస్తరించింది. ఆ తర్వాత క్రమంగా తూర్పు దేశాలకు, మధ్య ఆసియా దేశాలకు విస్తరించింది. భాషావికాసానికి, కళల వికాసానికి, విజ్ఞానాభివృద్ధికి బౌద్ధం, జైనం దోహదం చేశాయి. అనంతర కాలంలో క్రమంగా ఈ దేశంలో బౌద్ధం బలహీన పడింది. దానితో పోల్చితే జైనం ఎక్కువకాలం కొనసాగింది. నేటికీ రాజస్తాన్, గుజరాత్, కర్నాటక ప్రాంతాల్లో జైనమత అనుయాయులు ఉన్నారు.

### వర్ణవ్యవస్థ

ఈ దేశంలో సామాజిక వర్గాలు రూపొందడంలో మతం ఒక ప్రత్యేకమైన పాత్ర పోషించింది. తక్కిన దేశాలలో ఆయా సామాజిక తరగతుల విధులను నిర్ణయించినది, నియంత్రించినది రాజ్యమే. కాని ఇక్కడ ఏర్పడిన కులవ్యవస్థకు రాజ్యం మద్దత్తు తోబాటు మతపరంగా కూడా అండ ఉంది. ఆయా కులాల సామాజిక బాధ్యతలను దేవుడే నిర్ణయించాడని మతం సమర్ధించింది. పైగా ఈ కులవ్యవస్థ పుట్టుకతోటే నిర్ధారించబడడం జరిగింది. దానినీ మతం కర్మసిద్ధాంతం పేరుతో సమర్ధించింది. కులం వారీగా జరిగిన పనివిభజన తొలిదశలో సమాజం అభివృద్ధి చెందడానికి కొంత దోహదపడినా, ఆతర్వాత అది దోపిడీకి మార్గంగా మారింది. ఉత్పత్తి చేసే కులాల వారిని నిరాయుధుల్ని చేసి రాజ్యం వారిమీద పెత్తనాన్ని తేలికగా చెలాయించింది. దానికి తోడు ఒక కులానికి మరొక కులానికి

> భారతీయులు విశాలమైన, సంక్లిష్టమైన రాజ్యాన్ని నిర్వహించగల సమర్థులు అని కౌటిల్యుడి అర్ధశాస్త్రం బట్టి నిర్ధారించగలం. అత్యంత విశాల సామ్రాజ్యాన్ని స్థాపించిన అశోకుడు శాంతి. సామరస్యం అవలంబించాడు. అశోకుడు, తదనంతర రాజులు దాదాపుగా అందరూ మత సహనాన్ని ఆచరించారు. ఇతరమతస్తుల పద్ధతులను గౌరవించడం ప్రధానం అని గట్టిగా చెప్పారు.

మధ్య తేడాలను కల్పించి వారినడుమ వైరాన్ని, స్పర్ధలను కల్పించి అనైక్యతకు కారణం అయింది.

అయినప్పటికీ ధర్మం పేరుతో కుల కట్టుబాట్లను ఎంత గాఢంగా ఆయా కులాల ప్రజలమనస్సుల్లోకి ఎక్కించారంటే ఆ కట్టుబాట్లను అతి పవిత్రంగా, అతిక్రమించ డానికి వీలులేనివిగా పరిగణించడం, అతిక్రమించినవారిని ఆ కులానికి చెందినవారే శిక్షించడం జరుగుతోంది. అణచివేతకు, దోపిడీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయాలనే ఆలోచన కన్నా తమ దుస్థితికి తమ పూర్వజన్మ పాపం కారణం అని అనుకునేలా మతం చేసింది. అందుచేత తక్కిన దేశాలలో మాదిరిగా కాకుండా తక్కువ బలప్రయోగంతోటే ఇక్కడ శ్రమజీవులను అదుపు చేయడం సాధ్యపడింది.

**తాత్విక వ్యవస్థలు**

సాధారణంగా భారతదేశంలో తత్వశాస్త్రం అంటే భావవాదమే అన్న అభిప్రాయం బలంగా ఉంది. ఈ ప్రపంచం మిధ్య అని, పరమాత్మే సత్యం అని , జీవాత్మ పరమాత్మను చేరుకోవ డమే మోక్షం అని, మోక్షసాధనే మనిషికి ఉ ండవలసిన అత్యున్నత లక్ష్యం అని చెప్పే ఆధ్మాత్మికవాదం మన దేశంలో ప్రాచీనకాలం లో బాగా పెంపొందింది. ఉపనిషత్తులలో ఈ విషయాలను చాలా లోతుగా మన ప్రాచీన తత్వవేత్తలు చర్చించారు. ఐతే మన దేశంలో ప్రాచీన కాలంలో రూపొందిన ఆరు దర్శనాలు -సాంఖ్యం, మీమాంస, యోగం, న్యాయం, వైశేషికం, వేదాంతం ప్రధానమైనవి. వీటికి తోడు లోకాయత దర్శనం కూడా ఉంది. వీటిలో లోకాయతం లేదా చార్వాకం అనే దర్శనం పూర్తిగా భౌతికవాద దర్శనం. తక్కిన ఆరింట్లో వేదాంతం పూర్తిగా భావవాద దర్శనం. సాంఖ్య దర్శనాన్ని ప్రతిపాదించిన కపిలుడు (క్రీ.పూ.580) దైవం ఉనికిని పూర్తిగా తిరస్కరించాడు. పూర్వమీమాంస కూడా దైవం ఉనికిని ప్రశ్నించింది. ఇక యోగం, న్యాయం, వైశేషికం కూడా మొదట భౌతికవాద ప్రాతిపదికనే రూపొందాయి. కాని క్రమంగా వాటి అనుయాయులు ఆ దర్శనాలలో భావవాద భావాల్ని జొప్పించి దారి మళ్ళించారు. ఇక బౌద్ధం, జైనం కూడా దైవం ఉనికిని తిరస్కరించినవే. కానీ కాలక్రమంలో బుద్ధుడిని, వర్ధమానమహావీరుడిని కూడా దైవాలుగా మార్చి ఆరాధించడం మొదలైంది. మొత్తం మీద మన దేశం అనాదిగా ఆధ్యాత్మికదేశం అని జరిగే ప్రచారం వాస్తవం కాదనీ, బలమైన భౌతికవాద వారసత్వం మనకుందని మన ప్రాచీన తాత్విక వ్యవస్థలు స్పష్టం చేస్తున్నాయి.

**వృత్తులు, సాంకేతిక నైపుణ్యం**

భౌతిక వస్తూత్పత్తిలో మనదేశంలో పెద్దగా పురోగతి లేదు అని భావించడం సరికాదు. వివిధరంగాలలో ఇక్కడ ప్రజలు ప్రాచీన కాలంలో గణనీయమైన పురోగతి సాధించారు. చేనేత రంగంలో మన నైపుణ్యం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండేది. మన మజ్లిన్ వస్త్రాలు ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అయేవి. అంతేగాక రంగుల తయారీలో మనది అగ్రస్థానం. బట్టలకు రంగులు వేయడమే గాక నిర్మాణాలకు కూడా రంగులు ఉపయోగించేవారు. ఆ కాలం నాటి అజంతా చిత్రాల రంగులు నేటికీ మాసిపోకుండా ఉన్నాయంటే అది మన కళాకారుల కౌశలానికి నిదర్శనం. ఇక ఉక్కు తయారీ పరిజ్ఞానాన్ని తొలుత ఉపయోగించినది మనదేశంలోనే. మనదేశంలో తయారుచేసే ఉ క్కు ఖడ్గాలకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉండేది.

**రాజ్యవ్యవస్థలు**

భారతీయులు విశాలమైన, సంక్లిష్టమైన రాజ్యాన్ని నిర్వహించగల సమర్థులు అని కౌటిల్యుడి అర్ధశాస్త్రం బట్టి నిర్ధారించగలం. అత్యంత విశాల సామ్రాజ్యాన్ని స్థాపించిన అశోకుడు శాంతి. సామరస్యం అవలంబించాడు. అశోకుడు, తదనంతర రాజులు దాదాపుగా అందరూ మత సహనాన్ని ఆచరించారు. ఇతరమతస్తుల పద్ధతులను గౌరవించడం ప్రధానం అని గట్టిగా చెప్పారు. గ్రీసు దేశం తర్వాత ఏదో ఒక మోతాదులో ప్రజాస్వామ్యం (అది తెగల నాయకుల నడుమ మాత్రమే పాటినంచినప్పటికీ) అమలు చేయడానికి ప్రయత్నం జరిగింది మన దేశంలోనే.

**శాస్త్ర విజ్ఞానం, గణితం**

ప్రాచీన భారతదేశం శాస్త్రవిజ్ఞానాభివృద్ధికి చాలా దోహదం చేసింది. ప్రాచీన కాలంలో మతం, శాస్త్ర విజ్ఞానం కలగలిసిపోయాయి. ఖగోళశాస్త్రం మన దేశంలో చాలా పురోగతి సాధించింది. గ్రహాల కదలికలను శ్రద్ధగా పరిశీలించి ఋతువుల క్రమాన్ని, వాతావరణ మార్పులను ముందుగా అంచనా కట్టడం తెలుసుకున్నారు. ఐతే గ్రహాలను దేవతలుగా పరిగణించారు. ఇక భాషకు వ్యాకరణాన్ని రూపొందించడంలో కూడా మంచి పురోగతి సాధించాం. వేదమంత్రాలను ఏ దోషమూ లేకుండా వల్లించాలన్న లక్ష్యం దానివెనుక ప్రధానంగా పని చేసింది. క్రీ.పూ.3వ శతాబ్దం నాటికి గణితం, ఖగోళశాస్త్రం,వైద్యం దేనికదే అభివృద్ధి చెందడం మొదలైంది. గణితంలో గుర్తులను ఉపయోగించడం (ప్లస్, మైనస్ వగైరా) దశాంశ పద్ధతి, సున్నా.. ఈ మూడింటినీ మొట్టమొదట ప్రవేశపెట్టినది మనదేశంలోనే. మనదేశంలో తొలుత ఉ పయోగించిన అంకెలను, గుర్తులను అరేబియా ప్రాంతంలో తర్వాత స్వీకరించారు. పశ్చిమదేశాలవారు వాటిని అరబిక్ అంకెలు అంటారు గనుక అదే ప్రచారం జరిగింది. కాని వాటికి ఆద్యులంమనమే. అవి అశోకుడి శాసనాలలో సైతం మనకు కనిపిస్తాయి.

ఇక దశాంశ పద్ధతి (డెసిమల్ సిస్టం) గురించి బాగా తెలిసినవాడు ఆర్యభటు (క్రీ.శ476-500). బౌద్ధ మత ప్రచారకు లనుండి దీనిని చైనీయులు తెలుసుకున్నారు. మననుండి అరబ్బులు నేర్చుకున్నాక వారినుండి పశ్చిమదేశాలవారుతెలుసుకున్నారు. ఇక క్రీ.పూ. 2వ శతాబ్దంలోనే 'సున్నా' ను మన దేశంలో ఉపయోగించడం ప్రారంభించారు. అరేబియాలో దీనిని క్రీ.శ.873 తర్వాతనే ఉ పయోగించడం మొదలైంది. ఆల్జీబ్రా ఆవిష్కరణలో భారతీయులతోబాటు గ్రీకుల పాత్ర ఉన్నప్పటికీ దానిని పశ్చిమ దేశాలవారు గ్రీకులనుండి నేర్చుకోలేదు. మననుండి అరబ్బులు, ఆ తర్వాత వారినుండి యూరప్ దేశాలవారు నేర్చుకున్నారు.

**❝ హరప్పాలో ఇటుకలతో నిర్మించిన కట్టడాలను పరిశీలిస్తే వాయవ్య భారతంలో ప్రజలు ఆ కాలానికే కొలతల గురించి, జామెట్రీ గురించి మంచి పరిజ్ఞానాన్ని కలిగివున్నట్టు అర్థం ఔతోంది. వారినుండి వైదిక సమాజపు ప్రజలు తెలుసుకున్నారు. దీనికి సంబంధించిన సుళ్వ సూత్రాలు క్రీపూ.5వ శతాబ్దంలో రూపొందాయి. క్రీ.పూ.2వ శతాబ్దంలో యజ్ఞవాటికల నిర్మాణానికి సంబంధించి ఆచరణాత్మకంగా వివరించిన ఆపస్తంబ సూత్రాలు రూపొందాయి. ❞**

హరప్పాలో ఇటుకలతో నిర్మించిన కట్టడాలను పరిశీలిస్తే వాయవ్య భారతంలో ప్రజలు ఆ కాలానికే కొలతల గురించి, జామెట్రీ గురించి మంచి పరిజ్ఞానాన్ని కలిగివున్నట్టు అర్థం ఔతోంది. వారినుండి వైదిక సమాజపు ప్రజలు తెలుసుకున్నారు. దీనికి సంబంధించిన సుళ్వ సూత్రాలు క్రీ.పూ.5వ శతాబ్దంలో రూపొందాయి. క్రీ.పూ.2వ శతాబ్దంలో యజ్ఞవాటికల నిర్మాణానికి సంబంధించి ఆచరణాత్మకంగా వివరించిన ఆపస్తంబ సూత్రాలు రూపొందాయి. లఘు కోణం, గురు కోణం, లంబ కోణం వంటి భావనలను ఆ సూత్రాలు స్పష్టంగా వివరించాయి. ముక్కోణాకార స్థల వైశాల్యాన్ని లెక్కించే నిబంధనలను ఆర్యభట్టు రూపొందించాడు. ఇది త్రికోణమితి (ట్రిగనామెట్రీ) ఆవిష్కరణకు దారి తీసింది.

క్రీ.శ. 5వ శతాబ్దానికి చెందినవాడు ఆర్యభట్టు. వరాహమిహిరుడు క్రీ.శ.6వ శతాబ్దానికి చెందినవాడు. వీరిద్దరూ ఖగోళశాస్త్రంలో ప్రముఖులు. గ్రీకు విధానాన్ని అనుసరించి గ్రహాల స్థితిగతుల్ని లెక్కించే విధానాన్ని ఆర్యభట్టు రూపొందించాడు. చంద్ర గ్రహణం, సూర్యగ్రహణం ఎందుకు ఏర్పడతాయో..ఆ కారణాలు కనుగొన్నాడు. అతడు భూమి చుట్టుకొలతను లెక్కించాడు. అది నేటికీ సరైన లెక్కగానే ఆమోదించబడుతోంది. సూర్యుడు సాపేక్షంగా స్థిరంగా ఉన్నాడని, భూమి దాని చుట్టూ తిరుగుతోందని నిరూపించాడు. అతడు రాసిన గ్రంథం ఆర్యభటీయం. వరాహమిహిరుడు బృహత్సంహిత అనే గ్రంథాన్ని రాశాడు. ఖగోళశాస్త్రాన్ని మరింత సుసంపన్నం చేశాడు.

### వైద్యం

ప్రాచీన భారతీయ వైద్యులు మానవ శరీర నిర్మాణాన్ని అధ్యయనం చేయడానికి మృతదేహాలను కోసి పరిశీలించారు. అనాటమీ ఆ విధంగా అభివృద్ధి అయింది. తొలి నాటి వైద్య పద్ధతులు మనకు అథర్వ వేదంలో కనిపిస్తాయి. ఐతే వాటిలో ఎక్కువగా మంత్ర తంత్ర పద్ధతులనే వైద్య విధానంగా చూపించినవి ఎక్కువ. అప్పటికి శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చాలా తక్కువ స్థాయిలో ఉండేది. క్రీ.శ.2వ శతాబ్దంలో చరకుడు, శుశృతుడు అనే ప్రముఖ ఆయుర్వేద వైద్యులు వైద్యాన్ని బాగా పెంపొందించారు. శుశృత సంహితలో కంటి శుక్లాలను ఆపరేషన్ ద్వారా తొలగించే విధానాన్ని వివరంగా తెలిపాడు. ఇతర జబ్బులకు, సమస్యలకు కూడా ఆపరేషన్‌లు చేసే విధానాలను వివరించాడు. ఆపరేషన్లలో ఉపయోగించే 121 రకాల పరికరాలను గురించి వివరంగా తెలిపాడు. రోగులు ఆహార నియమాలను పాటించడం, పరిశుభ్రత పాటించడం ఎంత ప్రధానమో తెలిపాడు. చరకసంహిత పలురకాల రోగాల లక్షణాలను వివరంగా తెలిపింది. వందల రకాల మూలికలను, ఓషధులను వివరించి వాటిని వైద్యానికి ఉపయోగించే విధానాలను కూడా తెలిపింది. ప్రాచీన భారతదేశంలోని వన సంపద వైవిధ్యాన్ని, అప్పటి రసాయన శాస్త్ర పరిజ్ఞానాన్ని కూడా ఈ గ్రంథం అందిస్తుంది.

### భూగోళ శాస్త్రం

భారత ఉపఖండానికి వెలుపల ఉన్న భూభాగాల గురించిన పరిజ్ఞానం మన ప్రాచీనులకు అంతగా తెలియదు. కాని ఉపఖండంలో ఉన్న నదులు, పర్వతాలు, వనాలు, తీర్థయాత్రా స్థలాలు మన పురాణాల్లో చాలా వివరంగా వర్ణించబడ్డాయి. తొలి రోజుల్లో సముద్రయానం గురించిన పరిజ్ఞానం, నౌకా నిర్మాణ జ్ఞానం కలిగివున్నా, అనంతర కాలంలో అధికారంలో ఉన్న ప్రభువుల్లో ప్రధానమైనవారంతా తీరప్రాంతాల్లో కాక, మధ్య భారతంలో ఉన్నవారే అయినందువలన దీనిని పెద్దగా పట్టించుకోలేదు.

### కళలు, సాహిత్యం

మన ప్రాచీన శిల్పులు చాలా అందమైన కళాకృతులను రూపొందించారు. అశోకుడి రాతి స్తంభాలు వాటి నగిషీకి పేరు పొందాయి. అదెలా సాధించగలిగారో ఇప్పటికీ అంతు పట్టడం లేదు. అశోకుడి స్తంభం మీద ఉన్న మూడు సింహాల ప్రతిమ నేడు మన జాతీయ చిహ్నంగా ఉంది. అజంతా చిత్రాలు క్రీ.శ, రెండవ శతాబ్దం నుండి 7వ శతాబ్దం మధ్య కాలానికి చెందినవి. ఆసియా చిత్రకళ ఇక్కడే మొదలైందని చెప్పవచ్చు. ఇక్కడినుండి ఆ కళ చైనాకు విస్తరించింది. ఆ స్థాయిని యూరప్ దేశాలు అందుకోడానికి మరొక వెయ్యి సంవత్సరాలు పట్టింది. మధ్య ఆసియా, గ్రీస్ దేశాల లోని కళా రీతులను మన రీతులతో మేళవించి రూపొందించిన గాంధార కళ ప్రసిద్ధిచెందినది. దక్షిణ భారతదేశంలో నిర్మించిన దేవాలయాలు ఆగ్నేయ ఆసియా అంతటా నమూనాలుగా పరిగణించబడ్డాయి.

నలంద విశ్వవిద్యాలయంలో విద్య అభ్యసించడానికి టిబెట్, చైనాల నుండి సహితం విద్యార్థులు వచ్చేవారు. అందులో ప్రవేశానికి కఠిన పరీక్షలు ఉండేవి. ప్రధానంగా బౌద్ధ పండితుల శిక్షణ కోసం ఆ విశ్వవిద్యా లయం ఏర్పడింది.

నాలుగువేల సంవత్సరాల క్రితం ఇక్కడ జీవించినవారి ఆలోచనలను, వారి జీవనవిధానాన్ని, తాత్వికతను తెలుసుకోడానికి రుగ్వేదం ఒక ముఖ్యమైన ఆధారం. అప్పటి ఆర్యుల సంస్కృతిని అది తెలుపుతుంది. అక్కడినుంచి గుప్తుల కాలం వచ్చేసరికి సాహిత్యం పెంపొంది ప్రపంచ ప్రఖ్యాతి పొందిన కాళిదాసు నాటకం అభిజ్ఞాన శాకుంతలం వరకూ పురోగమించింది.

### ముగింపు

మన ప్రాచీన వారసత్వం, విజ్ఞానం, సంస్కృతి నిస్సందేహంగా గొప్పవి. ఐతే అది చరిత్రకారులకు లభిస్తున్న ఆధారాలను బట్టి నిర్ధారించిన మేరకే తెలుస్తోంది. ఇందులో అత్యధికభాగం విజేతల, పాలకుల చరిత్రగా ఉంటుంది. పాలితులది ఆధారాలు దొరకని, రాయబడని చరిత్ర. గుప్తుల స్వర్ణయుగం పాలకుల, అగ్రకులాల స్వర్ణయుగమే కాని రైతుల, చేతివృత్తిదారుల, దళితుల, ఆదివాసుల, మహిళల స్వర్ణయుగం ఎంతమాత్రమూ కాదన్న సంగతి మనం గుర్తుంచుకోవాలి.

**(మధ్యయుగాల చరిత్ర వచ్చే సంచిక నుండి)**

అంతర్జాతీయ పరిణామాలు

# ఇయు ఎన్నికల్లో మితవాదుల పైచేయి



రచయిత ఫ్రాన్స్‌లో నివసిస్తున్న భారత సంతతి జర్నలిస్టు. గతంలో ఈమె అనేక సంవత్సరాల పాటు తమిళనాడులో నివసించినప్పుడు టీచర్‌గా, జర్నలిస్టుగా పనిచేశారు.

**సుసాన్ రామ్**

యూరోపియన్ యూనియన్‌లో మితవాద కూటమి అంతా కలిసి ఉంటే , అది యురోపియన్ పార్లమెంటులో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించే అవకాశం ఉన్నది – సుసాన్ రామ్

జూన్ నెలలో జరిగిన యూరోపియన్ యూనియన్ ఎన్నికల ఫలితాలు, ఎన్నికల ముందు చెప్పిన జోస్యాలను నిజం చేసి, మితవాద పార్టీల బలాన్ని బాగా పెంచాయి.

ఫలితాలు తటస్థంగా ఉన్నాయని యూరోపియన్ కమిషనర్, ఉర్సుల వాన్ డే లియెన్ చెప్పినప్పటికీ జులై మాసంలో ఫ్రాన్స్ లోని స్టెస్నీ బౌలో జరిగే కొత్త పార్లమెంట్ సమావేశం దృఢంగా మితవాదం వైపు మొగ్గు చూపే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ కూటమిలో "మధ్యే వాద" మితవాదులైన యూరోపియన్ పీపుల్స్ గ్రూప్ క్రిస్టియన్ డెమొక్రాట్లు తమ ఆధిక్యతని చాటుకున్నారు. వారికీ 190 సీట్లు వచ్చాయి. అయితే, అసలు కథ ఎన్నికలలో అత్యధిక పురోగతి సాధించిన తీవ్ర అతివాదులు, తీవ్ర మితవాదుల విజయంలో ఉంది.

అందులోకూడా యూరోపియన్ కన్జర్వేటివ్స్ అండ్ రెఫార్మిస్ట్స్ (ఇ సి ఆర్ ) నయా–ఫాసిస్ట్ కూటమి అయిన ఐడెంటిటీ అండ్ డెమోక్రసీ (ఐ డి)కి యూరోపియన్ పార్లమెంటులో ఉన్న 720 సీట్లలో 134 సీట్లు వచ్చాయి. ఇది సోషల్ డెమాక్రాటిక్ బ్లాక్, ఎస్ అండ్ డి (ది ప్రోగ్రెసివ్ అలియాన్స్ అఫ్ సోషలిస్ట్స్ అండ్ డెమొక్రాట్స్) కి వచ్చిన 136 సీట్ల కంటే కేవలం రెండే రెండు సీట్లు తక్కువ. నిజానికి 15 సీట్లు కైవసం చేసుకున్న జర్మనీకి చెందిన నయా–ఫాసిస్ట్ ప్రత్యామ్నాయం, ఫుల్ జిలాండ్ నాయకుడు మాక్సిమిలియాన్ క్రాహ్ ఎన్నికలకు ముందు నాజీలకు అనుకూలంగా వ్యాఖ్యానాలు చేయడం వలన ఆ పార్టీని 'ఐడి' నుంచి బహిష్కరించి ఉండకపోతే, యూరోపియన్ మితవాదం ఆధిక్యత మరింత స్పష్టంగా తెలిసేది. హంగేరికి చెందిన విక్టర్ ఒర్బాన్‌కు చెందిన ఫ్రిడ్జ్ పార్టీకి వచ్చిన 11 సీట్లు (గత ఎన్నికలలో కన్నా ఓట్లు, సీట్లు తగ్గినప్పటికీ 11 మందిని యూరప్ శాసన సభకి పంపగలిగింది) ఈ కూటమికి జత అయ్యాయి.

నిర్మొహమాటంగా మాట్లాడుకోవాలంటే, మితవాదులంతా కూటమి కడితే అది యూరోపియన్ యూనియన్‌లో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించే అవకాశాలు పుష్కలంగా ఉన్నది. ఎన్నికలలో ప్రధానంగా నష్టపోయినవి ఉదారవాద రెన్యూ యూరప్ పార్టీ, ఇప్పటి ఫ్రాన్స్ అధ్యక్షుడి పార్టీ అయిన రెనాసా పార్టీ (ఈ కూటమిలో కీలక పాత్ర పోషిస్తున్నది) ఫ్రీ ఎంటర్ ప్రైజ్ ఫ్రెండ్లీ గ్రూప్, గ్రీన్స్, ప్రాంతీయ పార్టీల కూటమి అయిన ది గ్రీన్స్ / ఇఎఫ్ఏ కూటమి. రెన్యూ యూరప్ 22 సీట్లు కోల్పోయి 80 సీట్లకి పరిమితమయింది. గ్రీన్స్ 19 సీట్లు కోల్పోయి 52 సీట్లకి కుదించబడింది.

యూరోపియన్ పార్లమెంటులో పెట్టుబడిదారీ వ్యతిరేక శక్తుల కూటమి కొద్దిగా తన బలాన్ని పెంచుకోగలిగింది. కేవలం రెండు సీట్లు మాత్రమే పెరిగాయి.

ఈ శీర్షికకి ఆ పేరుపెట్టడంలో ఏమాత్రం సందేహ పడాల్సిన పనిలేదు. ఫ్రాన్స్‌లో నయా–ఫాసిస్టు శక్తులు బాగా బలం పుంజుకున్నాయి. ఒక దశాబ్ద కాలం పాటు పథకం ప్రకారం, తాను ప్రజలలో కోల్పోయిన పరువును తిరిగి పొందేందుకు ఇవి కృషి చేశాయి. ఇప్పుడు మెరైన్ లి పెన్ నాయకత్వంలోని నయా–ఫాసిస్టు రీసెంబ్లీమెంట్ నేషనల్ (ఆర్ఎన్) గా పిలవబడుతున్న కూటమి ఫ్రాన్స్‌ని రాజకీయ సంక్షోభం లోకి నెట్టేసింది. 31.4% ఓట్లు సంపాదించుకుని ఎన్నికలను తల్లకిందులు చేసింది. రెవెల్లెర్ యూరోప్ అత్యంత దయనీయంగా కేవలం 13.8 % ఓట్లు సంపాదించుకో కలిగింది. మాక్రోన్ ఫ్రెంచ్ పార్లమెంటును రద్దు చేసి జూన్‌లో ఎన్నికలకు వెళ్ళాడు. తీరా ఎన్నికలలో వామపక్షాల కూటమి – న్యూ పాపులర్ ఫ్రంట్ కి 182 సీట్లు, మాక్రోన్ నాయకత్వంలోని ఎన్సెంబ్లె అల్లాయన్స్‌కి 163 సీట్లు మితవాద నేషనల్ రాలీకి 143 సీట్లు వచ్చి అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది.

జర్మనీ లో కూడా మితవాదులు శక్తివంతంగా పుంజుకున్నాయి. నయా–నాజీ ఏఎఫ్‌డి 16 % ఓట్లు పొందగలిగింది. ఇతర మితవాదులైన గ్రీన్స్, ఫ్రీ డెమొక్రటిక్ పార్టీ, (వొలాఫ్ సచొల్స్‌కి చెందిన "ట్రాఫిక్ లైట్స్" (రెడ్, ఎల్లో, గ్రీన్)ని కలుపుకుని, యూరోపియన్ యూనియన్‌పై ఒత్తిడిని పెంచి, అన్నీ కలిసి జాత్యహంకారానికి మద్దత్తు ఇవ్వగలరు. అలాగే వలసలకు వ్యతిరేకంగా నిబంధనలు రూపొందించగలరు. జాతీయ తీవ్రవాద శక్తుల బలాన్ని పెంచగలరు.

ఒకవైపు ఫ్రాంకో–జర్మన్ భాగస్వామ్యంలో సమస్యలు పెరుగుతుండగా, ఇన్నాళ్లూ యూరప్ ఐక్యతలో కీలక పాత్ర పోషించిన, యూరప్ రాజకీయాలను అత్యంత ప్రభావితం చేసిన, ఒకరకంగా కుదిపేసిన శక్తులు ఇపుడు దక్షిణానికి ఒరిగి పోయాయి. ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ, ఆమె–నయా ఫాసిస్టు 'బ్రదర్స్' పార్టీ యూరోపియన్ ఎన్నికలలో ఆధిక్యతని సంపాదించి, విజయకేతనం ఎగరేసింది. ఎన్నికల విజయాలను సాకుగా తీసుకుని మెలోనీ, ఆమె

**"2022లో అధికారంలోకి వచ్చిన నాటినుండి మెలోనీ ప్రధాన యూరోపియన్ రాజకీయాలను చతురతతో తనవైపు తిప్పకుంటున్నది. యూరోపియన్ యూనియన్ అధికారులను, పార్టీ నాయకులను, మేధావులను, జర్నలిస్టులను ఆకట్టుకుంటు న్నది. గతకాలంలో మితవాదులు రాజీ పడరనుకున్న అనేక విష యాలలో - జాత్యహంకారం, వలసలు, స్వలింగ సంపర్కులు, గర్భస్రావాలు మొదలైన విషయాల్లో మెలోనీ వెనక్కి తగ్గారు."**

ఒక టి.వి డిబేట్‌లో రీసెంబ్లీమెంట్ నేషనల్ పార్టీ అధ్యక్షుడిని.... ఇ యూ నుండి వైదొలగడం కోసం రెఫరెండం నిర్వహించాలన్న మీ పార్టీ వైఖరిని ఎందుకు మార్చుకున్నారు అని ప్రశ్నించగా "మీకు గెలుస్తామని నమ్మకం కలిగిన తరువాత సంప్రదింపుల నుండి వైదొలగరు" అని సమాధానమిచ్చారు. యూరప్ ఖండమంతా అనేక రకాల మితవాద శక్తులు ఇప్పుడు




ఇయు ఎన్నికల్లో పైచేయి సాధించిన మితవాద నేతలు

నయా–ఫాసిస్టు 'బ్రదర్స్' పార్టీ తన కూటమి భాగస్వామీ, ప్రధాన మితవాద పక్షం అయిన మెట్టొ సాల్విని నాయకత్వంలోని 'లెగా' పార్టీపైనా, నార్తెన్ లీగ్‌పైనా దాడికి దిగారు. వారి పాచిక పారింది. దమ్మున్న ప్రధాన ప్రత్యర్థులు లేకపోవడంతో వారి విజయానికి ఎటువంటి ఆటంకం లేకుండా పోయింది. 'బ్రదర్స్' పార్టీకి దేశంలో పోల్ అయిన మొత్తం ఓట్లలో 28.76% దక్కాయి. లేగా పార్టీకి కేవలం 9% ఓట్లు పడ్డాయి.

2022లో అధికారం లోకి వచ్చిన నాటినుండి మెలోనీ ప్రధాన యూరోపియన్ రాజకీయాలను చతురతతో తనవైపు తిప్పుకుంటున్నది. యూరోపియన్ యూనియన్ అధికారులను, పార్టీ నాయకులను, మేధావులను, జర్నలిస్టులను ఆకట్టుకుంటు న్నది. గతకాలంలో మితవాదులు రాజీ పడరనుకున్న అనేక విషయాలలో – జాత్యహంకారం, వలసలు, స్వలింగ సంపర్కులు, గర్భస్రావాలు మొదలైన విషయాల్లో మెలోనీ వెనక్కి తగ్గారు. ఇవన్నీ ఆమె గెలుపుకు ప్రధానంగా దోహదపడ్డాయి. ఆ విధంగా గత కాలపు నిర్ణయాలతో తెగదెంపులు చేసుకుని ముందుకు సాగడంతో ఆమె కేవలం ఒక రాజకీయ నాయకురాలు గానే కాదు, సమర్ధవంతమైన ఇటలీ నాయకురాలిగా ప్రజల మన్ననలు పొందారు. యూరప్ రాజకీయాలలో మంచి కీలక పాత్ర పోషించగల సమర్థురాలని పించుకున్నారు.

యూరప్ మితవాద పార్టీలు మార్పులను అంగీకరించడానికి సిద్ధపడడంతో, లేదా సాంప్రదాయకంగా ఉండే యూరోపియన్ సందేహాస్పద దృక్పథం నుండి బయట పడడంతో వ్యూహాత్మక మార్పు వచ్చింది. ఫ్రెంచ్ ఎన్నికల ముందు జరిగిన కలుస్తున్నాయి. యూరోపియన్ సంస్థలతో కలిసేందుకు చర్చలు నడుపుతున్నాయి.

యురోపియన్ యూనియన్‌లోని ప్రధాన సంస్థలు ఈ మార్పును పరిగణనలోకి తీసుకున్నట్టు ఇప్పటికే సంకేతాలు వెలువడ్డాయి. వలసలకు వ్యతిరేకి అయిన ఉర్సుల ఒన్ డేలేయెం ఎన్నికలలో తన పదవి నిలుపుకోడానికి మితవాదులతో రాజీ పడడానికి సిద్ధపడ్డారు.

"ముగ్గురు మహిళలు– మెలోని, లీపెన్, వొం డే లేయేన్ లు– రాబోయే రోజుల్లో యూరప్ రాజకీయాలను శాసిస్తారు" అని ది ఏకోనామిస్ట్ పత్రిక వ్యాఖ్యానించింది. అది ఎలా ఉన్నప్పటికీ, యూరప్ ప్రస్తుతం పయనిస్తున్న దారి మాత్రం ఆందోళన కలిగించేదిగానే ఉంది.

**(అనువాదం: కె. ఉషారాణి)**

**ఈ మాసం ప్రత్యేకం**

# భారత జాతీయ ఉద్యమానికి ఆర్ఎస్ఎస్ ద్రోహం!



రచయిత సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది, రాజకీయ వ్యాఖ్యాత

**ఎజి నూరాని**

గాంధీ నే ఆజ్ జంగ్ కా ఐలాన్ కర్ దియా,
బాటిల్ సే హక్ కో దస్త్ -ఓ -గరెబాన్ కర్ దియా
హిందూస్తాన్ మే ఏక్ నై రూహ్ ఫూంక్ కర్
ఆజాదీ -ఏ- హయాత్ కా సమన్ కర్ దియా
పర్వర్దిగార్ నే కే వో హై ఆద్మీ షిన్నాస్,
గాంధీ కో భీ యే మర్తబా పహచాన్ కర్‌దియా

గాంధీజీ యుద్ధ ప్రకటన చేశారు
సత్యానికి అసత్యానికి మధ్య జరిగే
ఘోరమైన యుద్ధమది...
భారతీయ హృదయాల్లో కొత్త స్ఫూర్తిని
నింపడం కోసం...
సంపూర్ణ స్వాతంత్ర్యమే లక్ష్యంగా
సిద్ధం చేసిన మార్గమది...
మనుష్యుల చర్యలకు న్యాయనిర్ణేతయైన
భగవంతుడు...
గొప్పదైన తన సంపూర్ణ జ్ఞానంతో
మన మందకు నాయకుడిగా
మహాత్ముడిని సరిగ్గా ఎంచుకున్నాడు....

మౌలానా జాఫర్ ఆలీ ఖాన్ రాసిన ఉత్తేజకరమైన కవిత ఇది. ఇంతేకాదు 'వో దిన్ ఆనే కో హై ఆజాద్ జబ్ హిందూస్థాన్ హోగా-ముబర్కబాద్ ఇస్కో దే రహా సారా జహాన్ హోగా...' (భారతదేశం స్వాతంత్ర్యం పొందే రోజు ఆసన్నమైంది -ఈ విజయోత్సవ వేళ ప్రపంచం మొత్తం ఆమెకు స్వాగతం పలుకుతోంది..' అంటూ స్వాతంత్ర సమర విజయాన్ని ఆయన ఖచ్చితంగా ఊహించాడు. (కె.సి కందా, పేట్రియాటిక్ ఉర్దూ కవితల మాస్టర్ పీస్, స్టెర్లింగ్ పబ్లిషర్స్)

భిన్న సంస్కృతుల సమాహారంగా విరాజిల్లే అసలైన భారతీయ జాతీయవాదానికి ఈ కవిత అద్దం పడుతోంది. ఈ తరహా రచనలను తమ సభ్యులు లేదా సానుభూతిపరులు రాసినట్టు ఒక్క ఉదాహరణనైనా ఆర్ఎస్ఎస్, హిందూమహాసభ, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ వంటి సంఘపరివార్ సంస్థలు చూపగలవా?

భారతదేశ స్వాతంత్ర్య పోరాటం కుల, మతాలకు అతీతంగా అందరి భాగస్వామ్యంతో అత్యంత స్ఫూర్తిదాయకంగా సాగింది. హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు, పార్శీలు ఇలా దేశంలోని అన్ని మతాల ప్రజలు ఈ పోరాటంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ తరగతులకు ప్రత్యేక హక్కులు, మత పునరుజ్జీవనం వంటి స్వరాలు వినిపించే వారు సైతం భారతదేశం కోసం గళం విప్పారు. కానీ సంఘ్‌పరివార్ మాత్రం దీనికి మినహాయింపు.

1925 సెప్టెంబర్‌లో విజయదశమి రోజున ఆర్ఎస్ఎస్ ఏర్పాటైంది. కాంగ్రెస్ పార్టీ మాజీ సభ్యుడు కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ ఆ సంస్థను ఏర్పాటు చేశారు. అప్పటి నుండి ఆ సంస్థ వివిధ రూపాల్లో, రకరకాల పేర్లతో ప్రయాణం సాగించింది. ఆ ప్రయాణం సాగిన, సాగుతున్న తీరు మనందరికీ తెలుసు. అయితే ఆర్ఎస్ఎస్‌ను ఎందుకు స్థాపించారు? అన్న కీలక ప్రశ్నకు మాత్రం ఇంతవరకు సమాధానం లభించలేదు. నిజానికి ఈ ప్రశ్నకు ఇచ్చే సమాధానమే ఆర్ఎస్ఎస్ గురించి సంపూర్ణంగా వివరిస్తుంది. ఆర్ఎస్ఎస్ ఏర్పాటైన 1925వ సంవత్సరంలో దేశంలో గాంధీ నాయకత్వాన స్వాతంత్ర ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న విషయాన్ని గుర్తుంచుకోండి. శాసనోల్లంఘన ఉద్యమం దేశాన్ని ఒక ఊపు ఊపుతున్న కాలమది. ఆ సమయంలోనే కాంగ్రెస్‌పార్టీలోని ఉదారవాదులు గాంధీజీ రూపొందించిన ఈ శాసనోల్లంగనను వ్యతిరేకించేవారు. ఏ ఆందోళన చేసినా చట్ట బద్దంగానే ఉండాలని వారు వాదించేవారు. మరోవైపు భగత్‌సింగ్ వంటి దేశభక్తులు ఈ రెండు పద్దతులను తిరస్కరించి, రక్తాన్ని చిందించడానికైనా సిద్ధపడ్డారు.

**ఆర్ఎస్ఎస్ ఎందుకు?**

గాంధీతోనో, ఉదారవాదులతోనో, లేదా తీవ్ర వాదులతోనో విభేదించిన కారణంగా ఆర్ఎస్ఎస్‌ను స్థాపించలేదు. స్వాతంత్ర్య ఉద్యమాన్ని మరింత ఉత్సాహంగానూ, మరింత ఉధృతంగానూ నిర్వహించడం దీని లక్ష్యం కాదు. బ్రిటిష్ పాలన అంతమవుతున్న నేపథ్యంలో హిందూ రాజ్యాన్ని ఏర్పాటు చేయడం, దాని ఆవశ్యకత గురించి ప్రచారం చేయడం ఆర్ఎస్ఎస్ లక్ష్యం. ఆ లక్ష్య సాధన కోసం బ్రిటిష్ వారితో కలసి పనిచేయడం, వారితో ఘర్షణలు లేకుండా చూసుకోవడం అన్న వ్యూహాన్ని సంఘ్ ఎంచుకుంది. ఈ కారణంగానే ఆర్ఎస్ఎస్ స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకోలేదు. ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభలు స్వాతంత్ర్య పోరాటాన్ని వ్యతిరేకించాయి. ఈ రెండు సంస్థలు ప్రారంభంలోనే భారత జాతీయవాదాన్ని వ్యతిరేకించాయి. భారత జాతీయవాద భావజాలాన్ని, లౌకిక, ప్రజాస్వామ్య ఆదర్శాలను, వీటికి సంబంధించిన స్ఫూర్తినిచ్చే గాధలను ఆ సంస్థలు తిరస్కరించడమే కాకుండా, అవహేళన కూడా చేశాయి. జాతీయ ఉద్యమ పతాకాన్ని కూడా అవి తిరస్కరించాయి.

భారత జాతీయవాదం నుండి దూరం కావడమన్నది ఆర్ఎస్ఎస్ సిద్ధాంతంలోనూ, అమలుచేసే వ్యూహాల్లోనూ అంతర్లీనంగా ఉ

> “ ‘పైకి చెప్పకపోయినప్పటికీ తన ఏర్పాటుకు గల కారణాల పట్ల ఆర్ఎస్ఎస్ చాలా స్పష్టతతో ఉంది. వీటిలో ఒకటి హెగ్డేవార్ అభిప్రాయం. “ముస్లింలు వ్యవస్థీకృతంగా బలంగా ఉన్నారు. హిందువులు విడదీయబడి, బలహీనంగా ఉన్నారు. అందువల్ల ఏకీకృత మిలిటెంట్ శక్తిగా హిందువులను సంఘటితం చేయాలి” అన్నది ఆయన అభిప్రాయం. ఈ నిర్ధారణను హగ్డేవార్ 1920వ దశకంలో చేశారు. ”

ంది. ఒక వైపు భారత జాతీయవాదానికి తనను తాను దూరం చేసుకుంటూనే మరోవైపు హిందూ జాతీయవాదాన్ని తెరపైకి తీసుకువచ్చి గట్టిగా సమర్థించింది. అంతటితో ఆగకుండా ముస్లింలు, క్రిస్టియన్లను లక్ష్యంగా చేసుకుని వారిపై విద్వేషాన్ని ప్రచారం చేసింది. ఇప్పటికీ, ఈ మతోన్మాద వ్యూహాన్నే కొనసాగిస్తోంది. ఆర్ఎస్ఎస్‌ను బ్రిటిష్ వారు ఎప్పుడూ నిషేధించకపోవడాన్ని కూడా గమనంలో ఉంచుకోవాలి. స్వాతంత్రం వచ్చిన తరువాత భారత ప్రభుత్వమే మూడు సార్లు ఆ సంస్థను నిషేధించింది. ఆర్ఎస్ఎస్ లేదా దాని రాజకీయ సంస్థలైన ఒకప్పటి జనసంఘ్, ప్రస్తుత బిజెపిలు ఆధునీకరణ చెంది, నిజమైన భారతీయతను వంటబట్టించుకుంటాయని భావించే వారికి ఈ కారణంగానే తీవ్ర నిరాశ ఎదురవుతుంది. అంతేకాదు, అలా ఆశించే వారు తమ ఉనికికూడా కోల్పోతారు.

ఈ పరిస్తితి మనల్ని మళ్లీ ఆర్ఎస్ఎస్‌ను ఎందుకు స్థాపించారన్న కీలకమైన ప్రశ్న వద్దకు తీసుకువెడుతుంది. అయితే దీనికి జవాబు అంత సులభమేం కాదు. ప్రళయ్ కనుంగో (చారిత్రిక వేత్త, పండితుడు) అత్యంత శ్రమ తీసుకుని ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిన నాటి పరిస్థితులను అద్భుతంగా నమోదు చేశారు. దీని ప్రకారం “1923 నుండి 1928 వరకు కాలాన్ని ఉత్తర భారతదేశంలో హిందూ మత పునరుజ్జీవన యుగంగా అభివర్ణించారు. ఈ సమయంలో ఆర్యసమాజ్ ముఖ్యమైన పాత్ర పోషించింది. 19వ శతాబ్ధపు చివర్లో ‘శుద్ధి’ చేయడమనేది ఆర్యసమాజ్ కార్యక్రమాల్లో ఒక భాగంగా ఉండేది. స్వామి శ్రద్ధానంద నాయకత్వంలో ఆ కార్యక్రమాన్ని తీవ్రం చేశారు. ఇస్లాం మతంలోకి మారిన హిందువులను లక్ష్యంగా చేసుకుని ఆయన ఆ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేవారు. ఇది కొంత మేర ఉద్రిక్తతలకు దారి తీసేది. మత ఘర్షణల వాతావరణం అనేక ప్రాంతాల్లో నెలకొనేది. ఆ ఘర్షణల వాతావరణంలోనే హిందువుల కోసం 1925వ సంవత్సరం విజయవదశమి రోజున ఒక కొత్త సంస్థను స్థాపించారు. డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ దీనిని ఏర్పాటు చేశారు. డాక్టర్ బి.ఎస్. మూంజే, డాక్టర్ బి.బి.తాల్కర్, బాబారావ్ సావర్కర్ (వి.డి సావర్కర్ సోదరుడు) లు ఈ కార్యక్రమంలో పాల్గన్నారు. వీరు ఏర్పాటు చేసిన ఈ సంస్థకే తరువాత రోజుల్లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)పేరు స్థిరపడింది” అనిప్రళయ్ కనుంగో పేర్కొన్నారు. (=ూ్ణాం ుతీఎర్ ఎఅ్ట్ర ూశీశ్రీఱఅఎం పుస్తకం 35,36,37 పేజీలు) ‘వి.డి సావర్కర్ రాసిన హిందుత్వ పుస్తకం (చేతిరాత పుస్తకం–మాన్యుస్క్రిప్ట్) హెడ్గేవార్ ఆలోచనలపై తీవ్ర ప్రభావం చూపింది. ఇది హిందువులకు ఒకే దేశం అనే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకువచ్చింది’. (వాల్టర్ కె. ఆండర్సన్, శ్రీధర్ డి.దామ్లే, ది బ్రదర్ హుడ్ ఇన్ సాఫ్రాన్, పేజి 33) ఆర్ఎస్ఎస్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న మూంజే హెడ్గేవార్‌కు గురువు. ఆయన ఆర్ఎస్ఎస్‌ను ప్రారంభించే ముందు సావర్కర్‌ను 1925లో పలు దఫాలు కలిసి సుదీర్ఘ చర్చలు చేసేవాడు.

### ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ బ్రిటిష్ వ్యతిరేకి కాదు

యూనివర్శిటీ ఆఫ్ లండన్‌కు చెందిన చేతన్ భట్ అత్యంత జాగ్రత్తగా రూపొందించిన ‘హిందూ నేషనలిజం’ డాక్యుమెంట్ (ఆక్స్‌ఫర్డ్ – న్యూయార్క్)లో ఈ విధంగా పేర్కొన్నారు: “బ్రిటిష్ వారు కాంగ్రెస్‌ను, దాని అనుబంధ సంస్థల ఉద్యమాలను కఠినంగా అణచివేశారు. దీనికోసం హింసాత్మక పద్ధతులకు కూడా పాల్పడ్డారు. అదే సమయంలో ఆర్ఎస్ఎస్ పట్ల భిన్నంగా వ్యవహరించారు. ఆర్ఎస్ఎస్‌ను ఏరోజు కూడా బ్రిటిష్ పాలకులు తమకు ప్రమాదకరంగా భావించలేదు. ఆర్ఎస్ఎస్ కూడా బ్రిటన్‌ను విధేయతతో సమర్ధించింది. ఫలితంగా తన కార్యక్రమాలు కొనసాగించగలిగింది.”... అంతేకాకుండా “బ్రిటన్ ప్రభుత్వ హయంలో ఒక్కసారిగా కూడా నిషేధానికి గురికాని ఈ సంస్థ భారత ప్రభుత్వాలచే మూడు సార్లు నిషేధానికి గురైంది. హేగ్డేవార్‌తో పాటు గోల్వాల్కర్ (ఆర్ఎస్ఎస్ రెండవ నాయకుడు) ‘హిందూ జాతి –శీల నిర్మాణం’ పేరిట వలసవాద వ్యతిరేక పోరాటంలో పాల్గొనడాన్ని నిర్ధ్వంధంగా తిరస్కరించారు. 1920, 1940లలో జరిగిన రౌలట్ వ్యతిరేక ఆందోళనలు, శాసనోల్లంఘన కార్యక్రమాలు, క్విట్ ఇండియా ఉద్యమంతో సహా సహాయ నిరాకరణ పోరాటం, వలసవాద వ్యతిరేక సత్యాగ్రహాల్లో చేరడానికి ఆర్ఎస్ఎస్ నిరాకరించింది. ఆ నిర్ణయం తమ సంస్థాగత విధానమని చెప్పింది.’ అని డాక్యుమెంట్‌లో భట్ వివరించారు.

‘పైకి చెప్పకపోయినప్పటికీ తన ఏర్పాటుకు గల కారణాల పట్ల ఆర్ఎస్ఎస్ చాలా స్పష్టతతో ఉంది. వీటిలో ఒకటి హెగ్డేవార్ అభిప్రాయం. “ముస్లింలు వ్యవస్థీకృతంగా బలంగా ఉన్నారు. హిందువులు విడదీయబడి, బలహీనంగా ఉన్నారు. అందువల్ల ఏకీకృత మిలిటెంట్ శక్తిగా హిందువులను సంఘటితం చేయాలి” అన్నది ఆయన అభిప్రాయం. ఈ నిర్ధారణను హగ్డేవార్ 1920వ దశకంలో చేశారు. “ఉధృతంగా సాగిన సహాయ నిరాకరణ ఉద్యమ తీవ్రత తగ్గిపోయింది. ప్రజల్లో ఆ ఐక్యత లేదు. వ్యక్తిగత, కులస్పర్ధలు, బ్రాహ్మణ, బ్రాహ్మణేతర వివాదాలు అన్నీ మళ్ళీ తలెత్తుతున్నాయి. ఈ కుమ్ములాటలకు ఏ సంస్థా మినహాయింపుకాదు. ముస్లిం మతోన్మాదం అనే పాముకు సహాయ నిరాకరణ పేరుతో పాలను పోశారు. అది ఇప్పుడు తన కోరలను చాస్తూ, హింసాకాండ, అల్లర్లతో దేశమంతా విషాన్ని వ్యాపింపచేస్తోంది” అని హెడ్గేవార్ అభిప్రాయపడినట్లు చేతన్ భట్ పేర్కొన్నారు. అంతేకాకుండా, “ప్రస్తుత చీకటి సమయంలో హిందువులు ఎదుర్కుంటున్న ప్రధాన సమస్య వారిలో ఐక్యత, ఆత్మగౌరవం లేకపోవడమే” అని హేడ్గేవార్ స్పష్టంగా చెప్పారని భట్ తెలిపారు. (పేజీలు 115–117) సహాయ నిరాకరణ ఉద్యమాన్ని చీకటి రోజులుగా అభివర్ణిస్తూ, ఒక గొప్ప సమాజంలో

న్యూనతా భావాన్ని కలిగించే హేడ్గేవార్ చేసిన ఈ ఆలోచన ఆర్ఎస్ఎస్ శ్రేణుల్లో ఇప్పటికీ ప్రచారంలో ఉంది.

ఆర్ఎస్ఎస్ క్రమంగా తన పంథాలో ప్రయాణం చేయడానికి సిద్ధమైంది. సిపి భిస్లికర్ రాసిన హేడ్గేవార్ జీవిత చరిత్రలో "సంఘ్‌ను స్థాపించిన తరువాత డాక్టర్ (హడ్గేవార్) సాహెబ్ తన ప్రసంగాల్లో హిందుత్వ గురించి మాత్రమే మాట్లాడేవారు. ప్రభుత్వంపై నేరుగా వ్యాఖ్యానించేది దాదాపు శూన్యం'' అని పేర్కొన్నారు. (ఈ అధికారిక జీవిత చరిత్ర హిందీలో ఉంది. ఇంగ్లీషులో డాక్టర్ శామ్యూల్ రాసిన 'ఇస్లాంస్ హిందూ నేషనలిజం అండ్ రాష్ట్రీయ సేవక్ సంఘ్' పుస్తకంలో దానిలోని సారాంశం క్లుప్తంగా లభిస్తుంది. దీనిని 2015లో మీడియా హౌస్ ప్రచురించింది. 'ఆర్ఎస్ఎస్ గురించి తెలుసుకోండి' శీర్షికతో ఫారోస్ మీడియా 2017లో ప్రచురించిన కరపత్రంలో కూడా కొన్ని వివరాలు లభిస్తాయి) షంసూల్ ఇస్లాం అనే రచయిత రాసిన మరో జీవిత చరిత్రలో "గాంధీజీ హిందూ-ముస్లిం ఐక్యతపై నిరంతరం దృష్టిపెట్టి పనిచేశారన్నది స్పష్టమౌతోంది. కానీ, డాక్టర్ హడ్గేవార్ గారికి ఆ పనిలో ప్రమాదం కనిపించింది. నిజానికి హిందూ-ముస్లిం ఐక్యత అన్న పదమే ఆయనకు రుచించలేదు. ఇది రహస్యమేం కాదు" అని పేర్కొన్నారు. "ముస్లింలతో కలిసి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఎటువంటి స్వతంత్ర పోరాటం జరగదు. ఆర్ఎస్ఎస్ నేరుగా బ్రిటిష్ వారితో చర్చలు జరుపుతుంది. పాలకులను సంతోషంగా ఉంచి సురక్షితంగా అధికార బదిలీ జరిగేలా చూస్తుంది. హిందూ రాజ్యాన్ని స్థాపిస్తుంది" అని హెడ్గేవార్ చెప్పేవారని ఈ పుస్తకంలో తెలిపారు.

నరేంద్రమోడీ ప్రధానిగా 2014లో బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఆ లక్ష్యంపైనే దృష్టి సారించారు. కోల్పోయిన సమయాన్ని (1947-2014) తిరిగి సాధించాలని ఆయన భావిస్తున్నారు. ఒక క్రమ పద్ధతిలో, అంచెలంచలుగా ఆ లక్ష్యంవైపు ప్రయాణం చేస్తున్నారు. అందుకే, తన అనుచరుల ఆకృత్యాలపై ఆయన మౌనం వహిస్తున్నారు. ఆర్ఎస్ఎస్ చేస్తున్న దుర్మార్గాలను నామమాత్రంగా కూడా ఖండించడంలేదు. ఆర్ఎస్ఎస్‌కు, మోడీకి మధ్య ఉన్న సంబంధమే దీనికి కారణం. అధికార సాధనకోసం వీరు పరస్పరం ఆధారపడి ఉన్నారు.

> **"నరేంద్రమోడీ ప్రధానిగా 2014లో బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఆ లక్ష్యంపైనే దృష్టి సారించారు. కోల్పోయిన సమయాన్ని (1947-2014) తిరిగి సాధించాలని ఆయన భావిస్తున్నారు. ఒక క్రమ పద్ధతిలో, అంచెలంచలుగా ఆ లక్ష్యం వైపు ప్రయాణం చేస్తున్నారు. అందుకే, తన అనుచరుల ఆకృత్యాలపై ఆయన మౌనం వహిస్తున్నారు. ఆర్ఎస్ఎస్ చేస్తున్న దుర్మార్గాలను నామమాత్రంగా కూడా ఖండించడంలేదు."**

### ప్రార్థన... ప్రమాణం!

ఇప్పుడున్న స్థితికి ఆర్ఎస్ఎస్ చేరడానికి దాదాపు శతాబ్ధ కాలం పట్టింది. హిందీ-మరాఠీలో ఉన్న ప్రార్థనను 1939లో సంస్కృతంలో భర్తీచేశారు. "ప్రియమైన మాతృభూమి - నేను మీకు నమస్కరిస్తున్నాను - ఓ హిందువుల భూమీ - నీవు నన్ను సుఖంగా పెంచావు - ఓ పవిత్ర భూమి! సృష్టికర్త నిన్ను గొప్పగా సృష్టించారు- నా ఈ శరీరం నీకు అంకితం - నేను నీకు మళ్లీ, మళ్లీ నమస్కరిస్తున్నాను -సర్వ శక్తిమంతుడవైన ఓ దేవా...హిందూ రాజ్యంలో అంతర్భాగమైన మేము నీకు భక్తి పూర్వకంగా నమస్కరిస్తున్నాను'' అంటూ సాగే ఈ ప్రార్థనలో ఆర్ఎస్ఎస్ లక్ష్యం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ప్రార్థనే కాదు ఆర్ఎస్ఎస్‌లో చేరే ప్రతి సభ్యుడు "సర్వ శక్తిమంతుడైన భగవంతుడు, మరియు నా పూర్వీకుల ముందు భారతవర్ష్ (భారత భూమి) యొక్క సర్వతోముఖమైన గొప్పతనాన్ని సాధించేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో సభ్యుడిని అయ్యానని అత్యంత గంభీరంగా ఈ ప్రమాణం చేస్తున్నాను. నా పవిత్రమైన హిందూ మతం, హిందూ సమాజం మరియు హిందూ సంస్కృతిని పెంపొందించడం కోసం నేను సంఘ్ యొక్క పనిని నిజాయితీగా, నిర్భీతిగా నిర్వహిస్తాను. నా జీవితాంతం ఈ ప్రమాణానికి కట్టుబడి ఉంటాను. భారత్ మాతాకీ జై" అని ప్రమాణం చేయాలి. (డిఆర్ గోయల్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ -పేజీలు 247-279) ఈ సామూహిక ప్రార్థనల్లో లాఠీని ఎలా ఉపయోగించాలన్న దానిపై సూచనలు కూడా ఇస్తారు. (అండర్సన్ అండ్ డామ్లే - పేజి 35)

### నాయకత్వ ఆరాధన

ఆర్ఎస్ఎస్‌ను ఏర్పాటు చేసిన ఐదుగురికీ ఈ సంస్థకు పేరు పెట్టే విషయంలో స్పష్టత లేదు. అటువంటి ఆలోచన కూడా వారు చేయలేదు. అందుకే 1925లో ఏర్పాటుచేసినప్పటికీ 1926 ఏప్రిల్ 17వ తేదిన (రామనవమి) రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)గా ప్రకటించారు. డిసెంబర్ 19, 1926న హెగ్డేవార్ ఆ సంస్థకు చీఫ్ ఆర్గనైజర్ (చాలక్)గా నియమితులైనారు. మూడు సంవత్సరాల తరువాత తనను తాను ఆయన ఆర్ఎస్ఎస్‌కు డిక్టేటర్‌గా ప్రకటించుకున్నారు.

నాగ్‌పూర్‌లో సంఘచాలక్‌లతో జరిగిన ఒక సమావేశంలో చీఫ్‌గా ఒకసారి, వ్యక్తిగతంగా మరోసారి "అంతర్గత క్రమశిక్షణ రీత్యా, కార్యక్రమాలకు సూత్రధారిగా పనిచేసే నాయకుడి కింద సంస్థ పనిచేయాలి" (నవంబర్ 9-10, 1929) అని హేడ్గేవార్ ప్రకటించారు. సంస్థ యొక్క ఏకైక సూత్రంగా ఆయన దీనిని చెప్పేవారు. 1933లో జారీ చేసిన ఒక సర్క్యులర్‌లో ఇదే విషయాన్ని ఆయన మరింత గట్టిగా పునరుద్ఘాటించారు. "సర్‌సంఘ్ చాలక్ ఆజ్ఞలను స్వయంసేవకులు పాటించాలి. ఇది చాలా అవసరం. సంస్థ యొక్క విజయ రహస్యం ఇదే" అని ఆయన ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. చీఫ్ పట్ల చూపే ఈ విధేయత చాలా త్వరలోనే వ్యక్తి పూజకు దారి తీసింది. నవంబర్ 10, 1929న నాగ్‌పూర్‌లో ఆర్ఎస్ఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న స్వయంసేవక్‌లు హెడ్గేవార్‌కు సైనిక వందనం చేశారు. (షంసుల్ ఇస్లాం, పేజి 213) ఈ ఫాసిస్టు సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది.

### బ్రిటిష్ వారితో సహకారం

ఒకవైపు కాంగ్రెస్‌ను ఖండిస్తూ, మరోవైపు ముస్లింలపై దాడులు చేస్తూ సంఘ్ పరివార్ (హిందూ మహాసభ, ఆర్ఎస్ఎస్) బ్రిటిష్ వారికి సహకరించడమనే మూడవ మార్గంవైపు ప్రయాణం చేసింది. ఆర్ఎస్ఎస్‌ను నిషేధించడానికి బ్రిటిష్ వారికి ఎటువంటి కారణం ఇవ్వకూడదని గోల్వాల్కర్ భావించారు. అన్ని అనధికార సంస్థల్లో మిలిటరి డ్రిల్‌ను, యూనిఫామ్ ఉపయోగించడాన్ని బ్రిటిష్ పాలకులు నిషేధించినప్పుడు ఆర్ఎస్ఎస్

**❝ గోల్వాల్కర్ సాంప్రదాయక అర్థంలోని విప్లవకారుడు కాదు. దీనిని బ్రిటిష్‌వారు అర్థం చేసుకున్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలపై 1943లో రూపొందించిన ఒక అధికారిక నివేదికలో హోం డిపార్ట్ మెంట్ ఆర్ఎస్ఎస్ తక్షణమే ప్రమాదకరం కాదని చెప్పింది. (తక్షణమే ప్రమాదకరమని వాదించలేం... అని నివేదికలో రాశారు) 1942 లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో శాంతి భద్రతలకు ఆర్ఎస్ఎస్ ఎక్కడా భగ్నం కలిగించలేదని, చట్ట పరిధిలోనే పని చేసేలా తనను తాను నియంత్రించుకుందని పేర్కొన్నారు, ❞**

కట్టుబడి ఉంది. 29 ఏప్రిల్ 1943న గోల్వాల్కర్ సీనియర్ ఆర్ఎస్ఎస్ సభ్యులకు ఒక సర్క్యులర్‌ను పంపిణీ చేశారు. దానిలో ఆర్ఎస్ఎస్‌పై బ్రిటిష్ పాలకులు నిషేధం విధించే అవకాశం ఉందన్న ఆందోళనను ఆయన వ్యక్తం చేశారు. "ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం మేం మిలిటరీ డ్రిల్ చేయడం, యూనిఫామ్ ధరించడం వంటి పద్ధతులను నిలిపివేశాము. చట్టానికి లోబడి, చట్టానికి గౌరవించే సంస్థల్లాగా మేం పనిచేస్తున్నాం. పరిస్థితులు త్వరగా మారుతాయని ఆశించిన మేము మా శిక్షణా కార్యక్రమాలను సస్పెండ్ చేశాం. అయితే, ప్రస్తుత పరిస్థితులను పరిగణలోకి తీసుకున్న తరువాత శిక్షణా కార్యకమాలను పూర్తిగా నిలిపివేయాలని, ఆ తరహా కార్యక్రమాలను నిర్వహించే విభాగాన్ని సంపూర్ణంగా రద్దు చేయాలని నిర్ణయించాం" అని ఆ సర్క్యులర్‌లో ఆయన పేర్కొన్నారు.

గోల్వాల్కర్ సాంప్రదాయక అర్థంలోని విప్లవకారుడు కాదు. దీనిని బ్రిటిష్‌వారు అర్థం చేసుకున్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలపై 1943లో రూపొందించిన ఒక అధికారిక నివేదికలో హోం డిపార్ట్‌మెంట్ ఆర్ఎస్ఎస్ తక్షణమే ప్రమాదకరం కాదని చెప్పింది. (తక్షణమే ప్రమాదకరమని వాదించలేం... అని నివేదికలో రాశారు) 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో శాంతి భద్రతలకు ఆర్ఎస్ఎస్ ఎక్కడా భగ్నం కలిగించలేదని, చట్ట పరిధిలోనే పనిచేసేలా తనను తాను నియంత్రించుకుందని పేర్కొన్నారు, మరీ ముఖ్యంగా 1942 ఆగస్టులో జరిగిన విచ్ఛినకర సంఘటనల్లో పాల్గొనకుండా దూరంగా తన సభ్యులను ఉంచింది" అని తెలిపారు. (అండర్సన్ మరియు దామ్లే, పేజి 44)

ఇక సావర్కర్ పదేపదే బ్రిటిష్ ప్రభుత్వానికి దీనంగా చెప్పిన క్షమాపణలు అందరికీ తెలిసినవే.

1. అండమాన్‌కు తీసుకువచ్చి సంవత్సరం పూర్తికాకముందే జులై 4,1911న మొదటిసారి క్షమాపణలు చెప్పాడు.

2. ప్రభుత్వానికి నచ్చిన విధంగా ఏ హోదాలోనైనా పని చేస్తానని 1913లో ప్రతిపాదించాడు. 1914లోనూ, 1917లోనూ ఇదే రకమైన విజ్ఞప్తిని చేశాడు.

3. 1920, మార్చి 30వ తేదిన మరో క్షమాభిక్ష పిటిషన్‌ను దాఖలు చేశాడు (ఫ్రంట్‌లైన్ ఏప్రిల్ 8,2005)

4. ఐదేళ్ల పాటు ప్రభుత్వ అనుమతి లేకుండా ఎటువంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకూడదు అనే షరతుపై 1924 జనవరి ఆరున జైలునుండి విడుదలయ్యాడు. ఆ తరువాత ఈ షరతును 1937 వరకు పొడిగించారు. హోమ్ మినిస్టర్ కె.ఎం మున్షీ ఆ షరతును తొలగించాడు.

5. గాంధీ హత్యసందర్భంగా అరెస్ట్ నుండి తప్పించుకునేందుకు రాజకీయాల నుండి విరమించుకుంటానంటూ బొంబాయి పోలీస్ కమిషనర్‌కు ఆయన హామీ ఇచ్చారు.

6. 1950 జులై 13న మరోసారి రాజకీయల నుండి విరమించుకుంటానంటూ హామీ ఇచ్చాడు. బొంబాయి హైకోర్టుకు ఈ హామీని ఇచ్చారు.

రెండవ ప్రపంచ యుద్ధం పరివార్‌లోని ఇద్దరు అగ్రనేతల అసలు రంగును బయటపెట్టింది. 1939 అక్టోబర్ 9న సావర్కర్ బొంబాయిలోని వైస్రాయి లార్డ్ లిన్లిత్‌గోను కలిశారు. ఈ సందర్భంగా సావర్కర్ చేసిన ప్రతిపాదనను ఆయన రికార్డు (నమోదు) చేశారు. దాని ప్రకారం ప్రభుత్వం హిందువులవైపు ఉండి, వారి మద్దతుతో పనిచేయాలని సావర్కర్ కోరారు. "మనము, హిందువులు గతంలో ఒకరితో ఒకరం కొన్ని సమస్యలను ఎదుర్కున్నప్పటికీ, సంబంధాలు దృఢంగానే ఉన్నాయి. గ్రేట్ బ్రిటన్ – ఫ్రెంచ్, రష్యా–జర్మనీల మధ్య కూడా గతంలో ఇదే మాదిరి సంబంధాలు ఉన్నమాట నిజం. సావర్కర్ అదే చెబుతున్నారు. ఆయన గతంలో ఒక విప్లవపార్టీ అనుచరుడిగా ఉండిఉండవచ్చు. (నేను దానిని ధృవీకరిస్తున్నాను) కానీ, ఇప్పుడు ఆయన ఆసక్తులు, మన ఆసక్తులు చాలా దగ్గరగా ఉన్నాయి. ముఖ్యమైన విషయం ఏమిటంటే హిందుమతం, గ్రేట్ బ్రిటన్ చాలా దగ్గరగా, సన్నిహిత స్నేహితుల మాదిరి ఉండాలి. గతంలోని విరోధాలు ఏమైనా ఉంటే వాటిని పూర్తిగా విస్మరించాలని సావర్కర్ చెప్పారు. నేను అదే సిఫార్సు చేస్తున్నాను' అని ఆయన బ్రిటన్ ప్రభుత్వానికి రాశారు. (మర్జియా కసోలారి, ది షేడ్ ఆఫ్ ది స్వస్తిక, పేజి 172)

### ఎస్‌పి ముఖర్జీ లేఖ

ఆర్ఎస్ఎస్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం మహాసభ మాజీ అధ్యక్షుడు, జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి బహుమతి లభించింది. ఆయన 1941 డిసెంబర్‌లో ఫజ్లుల్ హక్ నేతృత్వంలోని బెంగాల్ క్యాబినెట్‌లో మంత్రి అయ్యాడు. ఈ ఫజ్లుల్ హక్ 1940 మార్చిలో లాహోర్‌లో జరిగిన ముస్లింలీగ్ సమావేశంలో పాకిస్తాన్ ఏర్పాటు కోరుతూ తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బెంగాల్ గవర్నర్ జాన్ హెర్బర్ట్‌కు రాసిన లేఖలో బెంగాల్ ప్రావిన్స్‌లో నెలకొన్న పరిస్థితులకు కాంగ్రెస్ చేపట్టిన ఉద్యమమే కారణమని పేర్కొన్నారు. "యుద్ధ సమయంలో ఇటువంటి వ్యూహాలు అంతర్గత ఉద్రిక్తతలకు దారి తీస్తాయి. బ్రిటన్, భారతీయుల మధ్య ఈ సమయంలో పోరాటం జరగకూడదు. అందువల్ల బెంగాల్‌లో కాంగ్రెస్ ఉద్యమాన్ని ఎలా ఎదుర్కోవాలన్నదే ఇప్పటి ప్రశ్న. కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, వారి ఉద్యమాన్ని బెంగాల్ ప్రావిన్స్‌లో విఫలం చేసేలా పాలన ఉండాలి. అలా చేయడం మాకు సాధ్యమవుతుంది. మంత్రులుగా ఇది మా ప్రత్యేక బాధ్యత. చట్ట సభల్లో భారతీయులకు ప్రాతినిధ్యం కల్పించడంతో కాంగ్రెస్ పార్టీ చెబుతున్న స్వాతంత్ర్య ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. అత్యవసర పరిస్థితుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఇది పరిమితంగానే కనిపించవచ్చు. కానీ, ప్రక్రియ ప్రారంభమైందన్న విషయాన్న గుర్తించాలి. భారతీయులు బ్రిటిష్ వారిని నమ్మాలి అని మేం ప్రజలకు చెప్పగలం" అని ఆ లేఖలో ఆయన పేర్కొన్నారు. (ఎస్.పి ముఖర్జీ లీవ్స్

ఫ్రం ఏ డైరీ 179 నుండి 183 పేజీలు) ఆ సమయంలోనే మహాసభ తరపున సర్ జ్వాలా ప్రసాద శ్రీ వాత్సవ వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ప్రతినిధిగా ఉన్నారు.

**బకించంద్ర పక్షపాతం**

ఈ సహకారానికి వ్యూహాత్మక ప్రాతిపదికతో పాటు సైద్ధాంతికత కూడా ఉంది. నిరాద్ సి.చౌదరి అనే రచయిత రాసిన ఆత్మకథలో వందేమాతర గీతం రాసిన కాలంలో ఉన్న వాతావరణాన్ని వివరించాడు. "బకించంద్ర ఛటర్జీ, రోమేష్ చంద్ర గుప్తాలు ముస్లిం పాలనకు వ్యతిరేకంగా హిందువుల తిరుగుబాటును ఎక్కువగా ప్రేమించి, కీర్తించారు. దానికనుగుణంగా ముస్లింలను పేలవంగా చూపించారు. ఛటర్జీ తీవ్ర ముస్లిం వ్యతిరేకి. మేము వీరి రచనలను ఆసక్తిగా చదివాము. వాటిలోని స్ఫూర్తిని గ్రహించాము" అని ఆయన పేర్కొన్నారు. చరిత్రకారుడు ఆర్‌సి మజుందార్ "బకించంద్ర దేశ భక్తిని మతంగా, మతాన్ని దేశ భక్తిగా మార్చాడు'' అని పేర్కొన్నారు. "వందేమాతరం గీతం ఉన్న ఆనంద మఠం నవల బ్రిటిష్ వ్యతిరేకమైనది కాదు. ముస్లింలను లక్ష్యంగా చేసుకుని సాగిన రచన అది. చివరి అధ్యాయంలో ఒక అతీంద్రియ వ్యక్తి, సన్యాసుల నాయకుడైన సత్యానందను పోరాటాన్ని ఆపాలని ఒప్పిస్తాడు. ఈ సందర్భంగా రాసిన ఒక వాఖ్యం ఆసక్తికరంగా ఉంటుంది. ఆ అతీంద్రయ వ్యక్తి 'మీ కర్తవ్యం నెరవేరింది. ముస్లిం శక్తి నాశనమైంది. మీరు చేయాల్సింది ఇంకేమి లేదు. అనవసరంగా ప్రాణాలు తీయడం వల్ల మంచి జరగదు' అని సత్యానందను ఉద్దేశించి అంటాడు.

> ❝ ఈ సహకారానికి వ్యూహాత్మక ప్రాతిపదికతో పాటు సైద్ధాంతికత కూడా ఉంది. నిరాద్ సి.చౌదరి రాసిన ఆత్మ కథలో వందే మాతర గీతం రాసిన కాలంలో ఉన్న వాతావరణాన్ని వివరించాడు. "బకించంద్ర ఛటర్జీ, రోమేష్ చంద్ర గుప్తాలు ముస్లిం పాలనకు వ్యతిరేకంగా హిందువుల తిరుగుబాటును ఎక్కువగా ప్రేమించి, కీర్తించారు. దానికనుగుణంగా ముస్లింలను పేలవంగా చూపించారు...." అని ఆయన పేర్కొన్నారు. ❞

ఆ నవల నిండా ఇటువంటి ముస్లిం వ్యతిరేక వ్యాఖ్యలు ఉన్నాయి. నవలలో ఒక పాత్రయైన జీవానంద చేతిలో కత్తితో దేవాలయ గేటు ముందు నిలబడి 'మనం పక్షి గూడు వంటి ముస్లిం పాలనను విచ్ఛినం చేయాలని ఎప్పటి నుండో అనుకుంటున్నాం. ఈ నగరం నుండి దానిని లాగి నదిలోకి ఈడ్చేద్దాం. ఈ పంది గుట్టను బూడిద గుట్టగా మార్చండి. మన మాతృభూమిని చెడు నుండి విముక్తి చేయండి. ఆ రోజు వచ్చేసింది" అని పిలుపు ఇస్తాడు. వందేమాతర గీతాన్ని నవలలో ఉపయోగించడం కూడా సాహసోపేతమైన చర్య ఏమీ కాదు. దేవతగా భావించబడిన దేశానికి మతపరమైన నివాళిని అర్పించడమే ఆ గీతం. మాతృభూమిని కాళికాదేవిగా భావిస్తూ రాశారు. అందుకే, మజుందార్ దీనిని ''ఆరాధన విధానం" అని అన్నారు. "బెంగాల్‌తో పాటు మొత్తం భారతదేశానికి వర్తింపచేస్తూ రాసిన ఆ గీతంలో హిందూ మతానికి చెందిన దేవతగా దేశాన్ని అభివర్ణించారు. ఫలితంగా మాతృభూమి భావనకు మతం కూడా తోడైంది." ( డోనాల్డ్ యూజిన్ స్మిత్ 1963లో రాసిన ఇండియా యాజ్ ఎ సెక్యులర్ స్టేట్ పుస్తకం నుండి) ఇక ఆ పాట ఎంత లౌకిక విలువలతో కూడుకున్నదో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా..!

అదే పల్లవిని లాలా లజపతిరాయ్, మదన్‌మోహన్ మాలవీయతో పాటు మరికొందరు అందుకున్నారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిన 1925వ సంవత్సరంలో లాలా హర్దయాల్ లాహోర్ ప్రతాప్ పత్రికలో పంజాబ్, హిందుస్తాన్‌లలోని హిందువుల భవిష్యత్ నాలుగు అంశాలపై ఆధారపడి ఉందని రాశారు. వాటిలో మొదటిది హిందూ సంఘటన, రెండవది హిందూ రాజ్, మూడవది ముస్లింలను శుద్ది చేయడం, నాల్గవ అంశం ఆఫ్ఘనిస్తాన్‌తో పాటు అటువంటి దేశాలపై దాడి చేసి, విజయం సాధించి వాటిని శుద్ధి చేయాలని చెబుతాడు. ఆ తరువాత సావర్కార్, హెగ్డేవార్ వంటి వారు ఇవే అంశాలను సంఘ్ నినాదాలుగా, వారసత్వంగా మార్చారు. ఇప్పుడు నరేంద్రమోడీతో పాటు ఆయన సహచరులు ఈ భావాలనే ముందుకు తీసుకుపోతున్నారు.

**ముస్లింల అణచివేత**

1857 తిరుగుబాటు గురించి అశోక్ మెహతా రాస్తూ: ''తిరుగుబాటు ప్రారంభమైనప్పుడు హిందువులు, ముస్లింలు కలిసి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కానీ, ముస్లింలు మాత్రమే తీవ్రస్థాయిలో అణచివేతకు గురయ్యారు. ఉగ్రవాదులన్న ముద్రను వారిపై వేశారు అని రాశారు. (ది గ్రేట్ రెబెలియన్–1857) అశోక్ మెహతా గుర్తించిన విధంగానే ముస్లింలు ఎక్కువగా నష్టపోయారు. బ్రిటిష్ పాలకులు వారిని తీవ్ర శిక్షలకు గురిచేశారు. ఇండియన్ ముస్లమాన్స్ (1871) పుస్తకంలో ముస్లింలపై తీసుకున్న చర్యలనువివరించారు. ''ముందుగా సైన్యంలో వారి ప్రవేశాన్ని నిరోధించారు. ముస్లింలుగా పుట్టిన వారు రెజిమెంట్లలోకి అడుగుపెట్టే అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలలో ఒక పథకం ప్రకారం ముస్లిం నియమాకాలను నిలిపివేశారు. ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో వారి సంఖ్య క్రమేణా తగ్గుముఖం పట్టింది. కలకత్తాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పోర్టర్, మెసెంజర్ వంటి ఉద్యోగాలకే ముస్లింలు పరిమితమైనారు. హైకోర్టు న్యాయమూర్తులలో ఒక్కరు కూడా ముస్లింలు లేని పరిస్థితి ఏర్పడింది. పొరపాటున ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైనా అనేక రకాలుగా పరిశోధించి వారిని అనర్హులుగా ప్రకటించే విధానాలు అమలులోకి వచ్చాయి. దీంతో వారు నిస్సహాయులుగా మారారు. అయితే, వారి నిస్సహాయ స్థితిని ఎవరూ పట్టించుకునే వారు కాదు. ప్రభుత్వ అధికారులు ఉద్దేశ్యపూర్వంకగా వారిని విస్మరించేవారు. ముస్లింలు తెలివిగా వ్యవహరించి ఉంటే ఈ మార్పును గుర్తించి, జాగ్రత్త పడేవారు. కానీ, అలా జరగలేదు. అందువల్ల వారికి బ్రిటిష్ వారికి సహకరించాలన్న ఆలోచనే లేదు. వారి నాయకుడైన సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ రాజకీయాలకు దూరంగా ఉండాలని, విద్యాభ్యాసం చేయాలని ముస్లిం యువతకు సూచించారు. బద్రుద్దీన్ త్యాబ్జీ, జిన్నా వంటి వారు కాంగ్రెస్‌లో చేరి స్వాతంత్ర్య ఉద్యమాన్ని సంపన్నం చేశారు. సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం మొదటి తీర్మానాన్ని 1921 కాంగ్రెస్ సమావేశంలో మౌలానా హస్రత్ మోహానీ ప్రవేశపెట్టారు. "భారత జాతీయ కాంగ్రెస్ యొక్క లక్ష్యం స్వరాజ్యాన్ని పొందడం. చట్టబద్ధమైన, శాంతియుత పద్ధతుల ద్వారా భారత ప్రజలను

(మిగతా 25వ పేజీలో)

విశ్లేషణ

# భౌతికవాద దృక్పథంతో చరిత్రను వివరించడం ఎలా?

"మానవులు తొలుత తినాలి, తాగాలి, తలదాచుకునే గూడు ఉండాలి, బట్టలు ధరించాలి. ఆ తర్వాతే వారు రాజకీయాలలో పాల్గొనగలరు, శాస్త్రవిజ్ఞానాన్ని పెంపొందించగలరు, మతాన్ని పాటించగలరు, కళలను ఆస్వాదించగలరు." (కార్ల్ మార్క్స్ సమాధివద్ద 1883లో ఎంగెల్స్ ప్రసంగం నుంచి)

"మానవుడు ప్రకృతితో ఏ తీరున వ్యవహరిస్తాడో దానిని సాంకేతికత వెల్లడి చేస్తుంది. సాంకేతికత సహాయంతోనే మానవుడు తన మనుగడను కొనసాగించడానికి అవసరమైన ఉత్పత్తిని చేయగలుగుతాడు. ఆ ఉత్పత్తిక్రమవమే అతడి సామాజిక సంబంధాలు ఏవిధంగా రూపొందేదీ , వాటి ద్వారా మానవుడి భావనలు ఏ తీరున ఏర్పడేదీ నిర్ణయిస్తుంది. "....మార్క్స్, (పెట్టుబడి గ్రంథం ఒకటవ వాల్యూం నుంచి)

భౌతికవాద దృక్పథంతో చరిత్రను వివరించేదే చారిత్రిక భౌతికవాదం. గతితార్కిక భౌతికవాద పద్ధతిని అనుసరించి మానవ సమాజాల పరిణామక్రమాన్ని వివరించడాన్నే చారిత్రిక భౌతికవాదం అంటారు. ప్రకృతికి వస్తుగతంగా (అంటే మన ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా) ఏవిధంగా కొన్ని నియమాలు ఉన్నాయో, అదే విధంగా చరిత్రకూ కొన్ని వస్తుగత నియమాలు ఉన్నాయని చారిత్రిక భౌతికవాదం పరిగణిస్తుంది. అందుచేత చరిత్రకు సంబంధించిన శాస్త్రం రూపొందించడం సాధ్యమేనని చెప్తుంది. ఐతే, అటువంటి శాస్త్రాన్ని రూపొందించాలంటే ముందు (1) చరిత్రలో కొన్ని వస్తుగత నియమాలు ఉంటాయని అంగీకరించాలి. (2) ఆ నియమాలను మనం తెలుసుకోగలం అన్న అభిప్రాయంతో మనం ముందుకు సాగాలి. (3) ఈ నియమాలు ఏవిధంగా పనిచేస్తాయో అవగతం చేసుకోడానికి కావలసిన వివరాలను, సమాచారాన్ని మనం సేకరించాలి. (4) ఆ నియమాలను మనం ఏదైనా చరిత్రకు సంబంధించిన విభాగానికి వర్తింపజేయాలి. అలా చేసేటప్పుడు మనం ఎటువంటి స్వీయ మానసిక ధోరణికీ లోను కాకూడదు. ముందస్తుగానే ఎటువంటి నిర్ధారణలకూ రాకూడదు.

చరిత్రను ఒకదానివెంట మరొకటిగా జరిగే విడివిడి సంఘటనల కూర్పుగానో, వ్యక్తుల నడుమ తలెత్తే సంఘర్షణల కారణంగా జరిగిన సంఘటనలకు సంబంధించినదిగానో పరిగణించడం అర్ధం లేనిది అని మార్క్సిజం భావిస్తుంది. ఇటువంటి దృక్పథం పైపైకి మాత్రమే కనిపించేవాటికే పరిమితమైపోయే ఒక లోతులేని వైఖరి అని మార్క్సిజం భావిస్తుంది. మానవులకు ఆకాంక్షలు ఉంటాయనీ, వాటి నడుమ ఘర్షణలు తలెత్తినప్పుడు అవి చరిత్ర పరిణామాన్ని ప్రభావితం చేస్తాయని మార్క్సిజం అంగీకరిస్తుంది. ఐతే, ఈ ఆకాంక్షల నడుమ ఘర్షణలు దేనివలన నిర్ణయించ బడతాయి? అన్నది ఇక్కడ ప్రశ్న. ఈ ప్రశ్నను హెగెల్ లేవనెత్తాడు. కాని దానికి వస్తుగత భావవాద పద్ధతిలో సమాధానం చెప్పాడు. ఆ సమాధానాన్ని మొత్తానికి మార్క్స్ తిరస్కరించాడు. అది ఆధ్యాత్మిక మార్మికతతో కూడి ఉందని, వస్తుగతంగా లేదని భావించాడు. సామాజిక పరిణామాన్ని ముందుకు నడిపించే అంతర్లీన శక్తులను అధ్యయనం చేసినప్పుడే వ్యక్తుల ఆకాంక్షలను, భావావేశాలను వివరించగలుగుతామని మార్క్స్ తన అన్వేషణ ద్వారా నిర్ధారించుకున్నాడు.

మానవులు తమ జీవితావసరాలను పొందడం కోసం పెంపొందించుకున్న ఉత్పత్తి శక్తులు, ఆ ఉత్పత్తి క్రమంలో మానవుల నడుమ ఏర్పడే ఉత్పత్తి సంబంధాలు –ఇవే అంతిమంగా సమాజాన్ని ముందుకు నడిపించే అంతర్లీన శక్తులు అని తన అంతిమ విశ్లేషణలో మార్క్స్ నిర్ధారించాడు. ఈ ఉత్పత్తి క్రమంలోనే వైరుధ్యాలు తలెత్తుతాయి. మొదట్లో అవి ఆర్థిక స్వభావం కలిగివుంటాయి. వర్గ పోరాటం ఈ వైరుధ్యాల ప్రాతిపదిక మీదే జరుగుతుంది. మానవ చరిత్రను అర్ధం చేసుకోడానికి ఈ అవగాహనే అత్యంత కీలకం అని మార్క్సిజం భావిస్తుంది.

ఈ మార్క్సిస్టు దృక్పధాన్ని లెనిన్ క్లుప్తంగా, సూటిగా ఇలా వివరించాడు:

"ఏ సమాజంలోనైనా, కొంతమంది సభ్యుల ప్రయత్నాలు మరికొంతమంది ప్రయత్నాలకు భిన్నంగా ఉంటాయి. సామాజిక జీవితం వైరుధ్యాల మయం. సమాజాలకు, జాతులకు మధ్య పోరాటాలు చరిత్రలో మనకి కనిపిస్తాయి. అలాగే ఆయా జాతులలోపల, సమాజాల లోపల కూడా పోరాటాలు కనిపిస్తాయి. అంతేగాక, ఒకసారి విప్లవ కాలం, మరొకసారి అభివృద్ధి నిరోధక దశ ఒకదాని తర్వాత మరొకటిగా వస్తూంటాయి. శాంతి, యుద్ధం ఒకదాని వెంట మరొకటిగా వస్తాయి. అభివృద్ధి లేకుండా స్తంభించిపోవడం, వేగంగా అభివృద్ధి జరగడం ఒకదాని వెంట ఒకటిగా వస్తాయి. ఇవన్నీ అందరికీ తెలిసినవే. ఐతే ఇవన్నీ ఇలా అయోమయంగా, అల్లకల్లోలంగా జరుగుతున్నట్టు పైకి కనిపిస్తున్నా, వీటివెనుక ఈ పరిణామాలను నిర్దేశించేది మాత్రం వర్గపోరాటమే. ఒకానొక సమాజంలో ఉన్న వారందరి ప్రయత్నాలనూ అధ్యయనం చేసి వాటన్నింటినీ ఒకదగ్గరకు చేర్చిన తర్వాత ఆ ప్రయత్నాల అంతిమ ఫలితం ఏవిధంగా ఉండబోతుంది అన్నది శాస్త్రీయంగా విశ్లేషించాలి. ఆయా ప్రయత్నాల నడుమ ఘర్షణలు తలెత్తడానికి గల అవకాశాలను అన్నింటినీ పరిశీలించాలి. ఆ సమాజంలోని వివిధ వ్యక్తులు తమ మనుగడ కొనసాగించే క్రమంలో ఏయే వర్గాలుగా చీలివున్నారో గ్రహిస్తే, వారి నడుమ ఘర్షణలకు మూలం ఎక్కడుందో తెలుస్తుంది. " (మార్క్స్ బోధనలు అన్న గ్రంథం నుండి)

మానవుల తక్షణ ప్రయత్నాలు మాత్రమే కాకుండా సమాజపు రాజకీయ, న్యాయ వ్యవస్థలు, వాటితోబాటు నైతిక, తాత్విక,

మత సంబంధిత మైన సామాజిక అంశాలన్నింటినీ భిన్న వర్గాల నడుమ జరిగే ఘర్షణల వ్యక్తీకరణలేనని, వీటన్నింటి మూలాలు తిరిగి ఉత్పత్తి విధానం నుండి తలెత్తే వైరుధ్యాలనుండే ఉత్పన్నం ఔతాయని మార్క్సిజం భావిస్తుందని దీనిని బట్టి చెప్పవచ్చు.

సామాజిక జీవితంలో మనకు కనిపించే సంఘటనలలో ఏవి ప్రాథమికమో, ఏవి వాటినుండి ఉత్పన్నం అయాయో ఆ తేడాను గ్రహించడం అవసరం అని, ఏది పైకి కనపడుతుందో, ఏది నిర్ణయాత్మకమో తెలుసుకోగలిగివుండాలని చారిత్రిక భౌతికవాదం నొక్కిచెప్తుంది.

మార్క్స్ కన్నా ముందే మేథావులు వర్గపోరాటం గురించి చెప్పారు. మార్క్స్ వారందరికన్నా మరో అడుగు ముందుకేసి, ఆ వర్గపోరాటం మానవుల శ్రామిక కార్యకలాపాల క్రమం నుండే పుట్టుకొస్తుందని స్పష్టం చేశాడు. ఈ కార్యాచరణనుండే సామూహిక, వర్గ-రహిత సమాజం నుండి వర్గాలుగా చీలిపోయిన సమాజాల వైపుగా చారిత్రిక పరిణామం జరిగిందని వివరించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో జరిగే ఉత్పత్తి శక్తుల అభివృద్ధిక్రమం అనివార్యంగా ఒక వర్గరహిత సమాజం వైపు నడిపిస్తుందని మార్క్స్ బలంగా విశ్వసించాడు. ఆ వర్గరహిత సమాజానికి చేరేముందు పరివర్తన చెందే దశ ఉంటుందని, ఆ దశ శ్రామికవర్గ నియంతృత్వం కింద నడుస్తుందని చెప్పాడు.

మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ ఎన్నడూ తాము చెప్పిందే వేదం అన్న వైఖరిని తీసుకోలేదు. అన్నింటికీ పరిష్కారం చూపేది తామే అని భావించలేదు. తేలికైన పరిష్కార మార్గాలను వారు సర్వదా తిరస్కరించారు. చరిత్రలో ఒకానొక దశకు సంబంధించి గతితార్కిక భౌతికవాద పద్ధతిని అనుసరించి పరిశీలించేటప్పుడు అందులో ఉండే అత్యంత సంక్లిష్టమైన అంశాలను లోతుగా అధ్యయనం చేయవలసిన అవసరం గురించి నొక్కిచెప్పారు. చారిత్రిక భౌతికవాదం తెలుసును కనుక ఇక చరిత్రను అధ్యయనం చేయనవసరం లేదనే వారిని మార్క్స్ తీవ్రంగా ఈసడించుకున్నాడు.

తమ జీవితకాలంలోని చారిత్రిక పరిణామాలను గతితార్కిక భౌతికవాద పద్ధతిలో అధ్యయనం చేసి మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ చేసిన రచనలు చరిత్ర పట్ల మార్క్సిస్టు దృక్పథాన్ని వెల్లడిస్తాయి. ఫ్రాన్స్‌లో వర్గ పోరాటం (1848-50), 18వ లూయీ బోనాపార్టీ బ్రుమైర్ (1852), ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం (1870-71) జర్మనీలో రైతుల పోరాటం, (1850), జర్మనీలో విప్లవం-ప్రతీఘాత విప్లవం (1851-52), రష్యాలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి (1897) అటువంటి కొన్ని రచనలు.

చరిత్రను శాస్త్రీయంగా వివరించడం అంటే చాలా క్లిష్టమైన పని. దేనినీ విడిచిపెట్టకూడదు, అదే సమయంలో అత్యంత అవశ్యం, కీలకం, గతిశీలం అయిన అంశాలమీద కేంద్రీకరించగలగాలి. అదే సమయంలో చరిత్ర నిరంతరం మారుతూనేవుంటుందని మరిచిపోకూడదు.

**- ఎం.వి.ఎస్.శర్మ**

**(మూలం: 'రీడర్ ఇన్ మార్క్సిస్ట్ ఫిలాసఫీ' సంకలనం)**

> **❝ మార్క్స్ కన్నా ముందే మేథావులు వర్గపోరాటం గురించి చెప్పారు. మార్క్స్ వారందరికన్నా మరో అడుగు ముందుకేసి, ఆ వర్గపోరాటం మానవుల శ్రామిక కార్యకలాపాల క్రమం నుండే పుట్టుకొస్తుందని స్పష్టం చేశాడు. ఈ కార్యాచరణనుండే సామూహిక, వర్గ-రహిత సమాజం నుండి వర్గాలుగా చీలిపోయిన సమాజాల వైపుగా చారిత్రిక పరిణామం జరిగిందని వివరించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో జరిగే ఉత్పత్తి శక్తుల అభివృద్ధిక్రమం అనివార్యంగా వర్గ రహిత సమాజం వైపు నడిపిస్తుందని మార్క్స్ బలంగా విశ్వసించాడు. ❞**

# భారత జాతీయ ఉద్యమానికి ఆర్ఎస్ఎస్ ద్రోహం!

**(23వ పేజీ తరువాయి)**

విదేశీ నియంత్రణ నుండి విముక్తి చేయడం" అని తీర్మానంలో పేర్కొన్నారు. అయితే, గాంధీ దీనిని వ్యతిరేకించడంతో సమావేశంలో వీగిపోయింది.

డాక్టర్ కె.సి కాండా వెలువరించిన ఒక సంచికలో స్వాతంత్ర్యంపై హిందువులు, ముస్లింలు రాసిన అనేక కవితలు ఉన్నాయి. కాకోరి రైలు దోపిడి కేసులో 1927లో ఉరి శిక్షకు గురైన అష్ఫాఖుల్లా ఖాన్ కవిత కూడా దీనిలో ఉంది. డాక్టర్ షంసుల్ ఇస్లాం భారతదేశ విభజనకు వ్యతిరేకంగా ముస్లిం అభిప్రాయాలతో ఒక డాక్యుమెంట్‌ను రికార్డు చేశారు. (ఫారోస్ మీడియా, జామియా నగర్ – న్యూఢిల్లీ) దీనికి ప్రముఖ చిత్రాకారుడు హర్బన్స్ మఖియా ముందుమాట రాశారు.

ముస్లింలు బ్రిటిష్ పాలకులను ఎదిరించారు. దీనికి భిన్నంగా సంఘ్‌పరివార్ బ్రిటిష్ వారికి సహకరించింది. 'దేశ ద్రోహులు' ఎవరు? చరిత్రే ఈ ప్రశ్నకు స్పష్టమైన జవాబునిస్తుంది. భారత జాతీయ వాదానికి సంఘ్‌పరివార్ చేసిన ద్రోహం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. దాని ప్రచారక్ నరేంద్రమోడీ హిందు జాతీయ వాదాన్ని వ్యాప్తి చేయడానికి కంకణం కట్టుకున్నారు. దీనికి అమెరికా మద్దతు కోసం పాకులాడుతున్నారు. బ్రిటన్ స్థానంలో ఇప్పుడు అమెరికా వచ్చింది!

**(అనువాదం : పొగడ దొరువు)**

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!


'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

# మోడీ 3.0 పాలనలో ఆర్థిక విధానాలెలా ఉంటాయి?



రచయిత ప్రముఖ ఆర్థిక వేత్త, రచయితలు

సిపి చంద్రశేఖర్

మోదీ రెండోసారి కంటే మూడోసారి అతి తక్కువ మెజారిటీతో అధికారంలోకి వచ్చారు. బీజేపీ గానీ, ఎన్డీఎ గాని పార్లమెంట్‌లో సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న 400 స్థానాలకు చాలా దూరంలో నిలిచిపోయారు. ఇది చాలామందిని ఆశ్చర్య పరిచింది. కానీ, ఇప్పుడు నరేంద్రమోడీ నాయకత్వంలోని ఈ కూటమి ప్రభుత్వం, అంతర్గతంగా తమలో ఉన్న భిన్న దృక్పధాల కారణంగా–రాజకీయ, ఇతరేతరంగా కూడా–ఎటువంటి విధానపర నిర్ణయాలు తీసుకుంటుందా అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఈ కూటమి భాగస్వాముల మధ్య విభేదాలు ఉన్న అనేక అంశాలలో ప్రధానమైనవి ఆర్థిక విధానాలు. ఇప్పటివరకు బీజేపీ విధానాలు అమలుపరచడం నల్లేరుపై నడక లాగా సాగింది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. కూటమి భాగస్వాముల ప్రభావం విధానపర నిర్ణయాలు తీసుకోవడం పై తప్పనిసరిగా ఉంటుందనే భావన రాజకీయ వర్గాలలో చక్కర్లు కొడుతున్నది. అవి ఆర్థిక విధానాల మార్పులలో ప్రతిబింబించవచ్చు అంటున్నారు. కానీ కొంతమంది మాత్రం అటువంటిదేం ఉండదనీ, మోదీ మారే ప్రశక్తి లేదనీ, ఆ విషయం క్యాబినెట్ కూర్పులో తేటతెల్లమయిందని అంటున్నారు.

అయితే, మోదీ తీసుకోబోయే ఆర్థిక విధానాలను అంచనా వేయడానికి మోడీ గత రెండు పర్యాయాల పాలనలో తీసుకున్న నిర్ణయాలను విశ్లేషించుకోవాల్సి ఉంటుంది. ఆ పదేళ్ల కాలంలో తీసుకున్న నిర్ణయాలు విశ్లేషించుకున్నా అతను గాని, అతని తరపున మాట్లాడే పరివారం గాని చేసిన ప్రకటనలని పరిశీలించినా కొన్ని విషయాలు స్పష్టంగా తేటతెల్లమవుతాయి. అవి: మౌలిక రంగంలో, నిర్మాణాలపై పెట్టుబడులు పెట్టడంపై కేంద్రీకరించడం. ఉత్పత్తి రంగం మౌలికంగా దుర్పరస్థితిలో ఉండడం వలన, దానిని పునరుద్ధరించే పనిపై దృష్టి పెట్టడం. ఉత్పత్తితో ముడిపెట్టబడిన సబ్సిడీ స్కీములు అమలు చేయడం. ఇప్పుడు అమలులో ఉన్న రైతులకు ఇచ్చే అనేక ప్రత్యేక సంక్షేమ పథకాలు–నగదు ట్రాన్స్ఫర్‌ల దగ్గరినుండి ఉచిత బియ్యం సరఫరా వరకు, అనేక స్కీములు – అమలు చేయడం. అయితే, వీటి ఆధారంగానే ఈ ప్రభుత్వ విధాన రూపకల్పన గురించి పరిపూర్ణ అవగాహనకు రావడం కష్టం.

నిజానికి చాలా రంగాలలో విధానపర నిర్ణయాలు, ప్రచార పటాటోపానికి అనుగుణంగా రూపొందించబడినట్టు కనిపిస్తున్నాయి గానీ, వాటి లోతుపాతులను గురించి అవగాహన చేసుకుని గానీ, పర్యవసానాలు పరిశీలించి గానీ పరిగణనలోకి తీసుకున్నట్లు అనిపించదు. ఉదాహరణకి, మౌలిక సదుపాయాల కల్పనపై తీసుకున్న నిర్ణయం చూద్దాం. ఇందులో భాగంగా రైల్వేల రూపు రేఖలను మార్చేయాలని నిర్ణయం తీసుకున్నారు. వెంటనే 50 కొత్త వందే భారత్ రైళ్లను ప్రవేశ పెట్టారు. నిజానికి ఇప్పటికే ట్రాక్, సిగ్నలింగ్ వ్యవస్థలు మరమ్మత్తులు లేక, పునర్నిర్మాణం లేక ఆధునీకరించబడక విపరీతంగా రైలు ప్రమాదాలు జరుగుతున్నట్టు అనేక అధ్యయనాలు తెలియచేస్తున్నాయి. ఈ కీలక సమస్యలకు సంబంధించిన విషయాలపై నిర్ణయాలు ఏవీ లేవు.

అలాగే కోవిద్ కాలంలో ప్రజా సంక్షేమం కొరకు ప్రజలకు ఆహారం అందించడంలో భాగంగా కొత్త పథకాలు ప్రవేశ పెడుతున్నట్టు ప్రచారం జరిగినా నిజంగానే కొన్ని కొత్త పథకాలు ప్రవేశ పెట్టినా, బడ్జెట్‌లలో పాత, కొత్త సంక్షేమ రంగాల కేటాయింపులు మాత్రం నానాటికీ దిగజారుతున్నాయి. ఒక వైపు మాటలు కోటలుదాటుతున్నాయి మరోవైపు చేతలు గడప దాటడం లేదు. పథకాలు పుస్తకాలకు పరిమితమవుతున్నాయి. నిరుద్యోగ నిర్మూలన, అందరికీ ఇళ్ళు దగ్గరి నుండి పౌష్టికాహారం సరఫరా వరకు అన్నిటా ఇదే తంతు. ప్రచారానికే పెద్దపీట. ప్రధానమంత్రే స్వయంగా తన గ్యారంటీలని ప్రకటించుకున్నారు. చూడగా చూడగా, దేశమంతటినీ మత ప్రాతిపదికన విభజించడం జరిగింది గాబట్టి, ఒక మతం ఓటర్ల మద్దత్తు గ్యారంటీ గాబట్టి, ఆర్థిక విధానాలు అనుసరించడం వలన వచ్చే పర్యవసానాలను గురించి పెద్దగా పట్టించుకోనక్కరలేదని భావించినట్టు కనిపిస్తున్నది.

నిజానికి, మోడీ పాలనలోని విధానాలను అంచనావేసేటప్పుడు ప్రచారం, ఆర్థిక విధానాలతో పాటుగా వాటికి దారి తీసే అనేక ఇతర అంశాలు కూడా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది.

మొదటిగా, బీజేపీ రాజకీయ అధికారం చేజిక్కించుకోవడానికి నిధుల సేకరణ. రాజకీయ అవసరాలకు కావలసిన వనరులు పోగు చేసుకోడానికి, నిధులపై గుత్తాధిపత్యం సంపాదించుకునే విధానం రూపొందించుకుంది. రాజకీయ నిధుల సేకరణకు ప్రణాళిక వేసుకుంది కూడా. అత్యధిక మొత్తాలలో, రకరకాల రూపాలలో సేకరించడం–

రాష్ట్రాలలోని వివిధ ఏజెన్సీల ద్వారా సేకరించడం, నోట్ల రద్దు దగ్గరి నుంచి, రాజకీయ నిధుల సేకరణకి బాండ్లను వినియోగించడం వరకు, ఈ నిధుల సేకరణ జరిగింది. అంతేకాదు, నిధులు ప్రతిపక్షాలకు అందుబాటులో లేకుండా చేయడంలో పైచేయి సాధించింది కూడా. నిధులు సేకరించడానికి బెదిరింపులు, లేదా బుజ్జగింపులు ఆయుధాలయ్యాయి. కోర్టు "ఎన్నికల బాండ్లు" కి సంబంధించిన తీర్పులో ఆదేశాలు వెలువరించిన తర్వాత వెలుగుచూసిన వివరాలను బట్టి ఇది స్పష్టంగా అర్థమవుతుంది . ఈ రకమైన నిధుల సేకరణ ప్రభావం ఆర్థిక వ్యవస్థపై తప్పనిసరిగా ఉంటుంది. ప్రైవేటు పెట్టుబడి దారుల నుంచి విపరీతంగా నిధులు సేకరించాలంటే, వారికి నిధులు ఇవ్వగల సత్తాని సమకూర్చి పెట్టాలి. అందుకు తగిన విధానాలు రూపొందించాలి. అంటే ఆస్తులు, సంపద పోగుపడే వాతావరణాన్ని కల్పించాల్సి ఉంటుంది. దాని ఫలితంగా దేశంలో ఎన్నడూ ఎరుగని రీతిలో సంపద కొందరి చేతిలో పోగుపడింది. అందులో కొంత భాగం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజకీయ పార్టీల నిధుల వైపుకు మళ్లింది. అంటే, రాజకీయ నాయకులు, ఆశ్రిత పెట్టుబడి ఒకదానితో ఒకటి కుమ్మక్కు అయ్యాయి. అంటే పెట్టుబడిదారులకు అనువైన "పారిశ్రామిక విధాన నిర్ణయాలు'' చేసే అవకాశం కల్పించబడింది. .

మోడీ పాలనలోని రెండో అంశం, రాష్ట్రాలు... ఆర్‌బిఐల నుండి, వనరులను పిండడం. లాభదాయక ప్రభుత్వ సంస్థల యజమానిగా, ప్రభుత్వ సంస్థల చేత భారీగా డివిడెండ్లు ప్రకటింపచేసి, తద్వారా వాటి వాటాల ధరలను పెంచి, మదుపరులకు వచ్చే ఆ లాభాల నుండి బలవంతపు వసూళ్లకు పాల్పడడం. దీని వలన ప్రత్యక్ష పన్నులు తక్కువ స్థాయిలో ఉంచి, విదేశీ, స్వదేశీ పెట్టుబడి దారులను ప్రసన్నం చేసుకోవడం జరిగింది. వారి సంపదలపై, వారి వారసత్వ సంపదలపై దాదాపు పన్నులే లేనంత మినహాయింపులు ఇవ్వడం జరిగింది .

మూడోది, పన్నుల వసూళ్లను తమ ఆధీనంలో పెట్టుకుని, రాష్ట్రాల నిధులను కేంద్రం వైపు మళ్ళించుకోవడం. రాష్ట్రాలు నిధులు సేకరించుకోడానికి కేంద్రం పరిమితులను విధించింది. అప్పులు చేయడంతో సహా. ఆఖరికి అది ఒక ప్రభుత్వ రంగ సంస్థ అయినా సరే. అందువలనే కేరళ మౌలిక సదుపాయాల బోర్డు, పెట్టుబడుల కోసం నిధులు సమకూర్చుకోలేక పోతున్నది. చాలా రాష్ట్రాలు నిధుల కొరత కారణంగా తమ బడ్జెట్ కేటాయింపులు తగ్గించుకోవాల్సి వస్తున్నది. పరిమితులు విధించుకోవలసి వస్తున్నది. చాలా రాష్ట్రాలలో ప్రత్యర్థి పార్టీలు అధికారంలో ఉండడం వలన, ఇది రాజకీయంగా బీజేపీకి, దాని మిత్రులకు అనుకూలంగా మారింది. ప్రత్యర్థి పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఆయా పార్టీలు తమ ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు చేయడానికి గాని, పెట్టుబడులు సమకూర్చడానికి గాని అవకాశం లేకుండా పోతున్నది. ఒకవేళ అటువంటి ఏ సంక్షేమ పథకాలనైనా అమలు చేసినా, వాటి ఖర్చులలో కేంద్ర భాగస్వామ్యం ఉంటుంది. మోడీ పేరు ఉంటుంది. ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బతీయడమే మోడీ ఆర్థిక విధానం ప్రధాన లక్ష్యం.

> ❝ ఈ రకమైన నిధుల సేకరణ ప్రభావం ఆర్థిక వ్యవస్థపై తప్పని సరిగా ఉంటుంది. ప్రైవేటు పెట్టుబడి దారుల నుంచి విపరీతంగా నిధులు సేకరించాలంటే, వారికి నిధులు ఇవ్వగల సత్తాని సమ కూర్చి పెట్టాలి. అందుకు తగిన విధానాలు రూపొందించాలి. అంటే ఆస్తులు, సంపద పోగుపడే వాతావరణాన్ని కల్పించాల్సి ఉంటుంది. దాని ఫలితంగా దేశంలో ఎన్నడూ ఎరుగని రీతిలో సంపద కొందరి చేతిలో పోగుపడింది. అందులో కొంత భాగం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజకీయ పార్టీల నిధుల వైపుకు మళ్లింది. ❞

ఇటువంటి రాజకీయ లక్ష్యాలతో ఆర్థిక విధానాలు రూపొందించడం వలన, అసలైన ఆర్థిక విధానాలకు ఏమాత్రం ప్రాధాన్యత లేకుండా, అరకొర విధానాలకు పరిమిత మవుతున్నారు. ఇంకా చెప్పాలంటే ఆర్థిక విధానాలు వక్రీకరించబడుతున్నాయి. ప్రభుత్వాన్ని నడపడం ఒక వ్యాపారంగా మార్చి, మార్కెట్ అనుకూల ప్రభుత్వం అని చూపే ప్రయత్నం జరుగుతున్నది. ఏదో కొద్ది మందికి మాత్రమే ప్రభుత్వ విధానాల వలన లబ్ధి చేకూరుతున్నదనే అభిప్రాయాన్ని తొలగించడానికి జరుగుతున్న తంతులో భాగంగా ప్రజలకు కూడా కొంత పంచే విధానాల రూపకల్పన జరుగుతున్నది. దాంతో వచ్చే ఆ లాభమేదో పదిమందికీ పంచితే సరిపోతుందనే భావన ఏర్పడింది. ఉత్పత్తితో ముడిపెట్టి సబ్సిడీ లివ్వడం దీని ఫలితమే. ఈ విధానాలు అన్ని రంగాల్లో ఉన్న స్వదేశీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తాయి అని అంచనా వేస్తున్నారు. అయితే, ఇందుకు అవసరమైన విధి విధానాల రూపకల్పన, లోతైన అవగాహన ఉన్నట్టు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. దేశీయ టెక్నాలజీని గానీ, ఉత్పత్తి సామర్థ్యాన్ని గానీ, ఏ విధంగా ఉత్తేజపరుస్తుంది అనేదానిపై ఎటువంటి స్పష్టత లేదు.

అందువలన మోడీ గారి లక్ష్యాలు మారకుండా ఉన్నంత కాలం, విధానాలు మారతాయని ఆశించలేము. ఎందుకంటే, ఇంతకాలంగా మత సామరస్యాన్ని దెబ్బతీసి, ప్రజలలో వైషమ్యాలు పెంచడం ద్వారా ఓట్లు రాల్చుకోవడం అనే మోడీ అనుసరిస్తూ వస్తున్న విధానం విఫల మయినప్పటికీ.. మోడీ వెను వెంటనే తమ గమనాన్ని మార్చుకుంటారని భావించ లేము. అయినప్పటికీ, ఇప్పుడున్నది సంకీర్ణ ప్రభుత్వం అవడం వలన, సంకీర్ణ కూటమి భాగస్వాములు తమ తమ ప్రయోజనాలు కాపాడుకోడానికి మోడీ పై ఒత్తిడిని పెంచే అవకాశం ఉంది. తమ కోర్కెలు తీర్చకపోతే కూటమినుండి వైదొలుగుతామని హెచ్చరించవచ్చు. ప్రజలకు అవసరమైన మౌలికాంశాలు.. అధిక ధరలు, నిరుద్యోగం, సామాజిక భద్రతలకు సంబంధించిన అంశాల ప్రాతిపదికన విధానాలు రూపొందించ బడాలని ఒత్తిడి చేయవచ్చు. కానీ, ఆ ఒత్తిడికి తలొగ్గి మోడీ తన విధానాలు మార్చుకోవడం ప్రశ్నార్థకమే. మహా అయితే, ఏవైనా అరకొర మార్పులు చేయవచ్చు. కానీ, నిర్ణయాత్మకమైన మార్పులు జరుగుతాయని అనుకోలేము. మొత్తం చట్రం స్థూలంగా కొనసాగు తుంది. పెనుమార్పులు ఏవీ ఉండవు.

**(అనువాదం: కె. ఉషారాణి)**

**రాజకీయ పరిణామాలు**

# కేంద్రం చేతిలో కీలుబొమ్మలు

**ఎ కోటిరెడ్డి**



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

బిజెపికి దేశప్రజలు తగిన గుణపాఠం చెప్పి, ఆ పార్టీకి పార్లమెంటులో స్థానాలను తగ్గించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి అవసరమైన స్థానాల కన్నా తక్కువ ఇచ్చినా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన రాజకీయ పార్టీలు బిజెపికి ఆ లోటు కనబడకుండా చేశాయి. దానికి ఎక్కువ స్థానాలు వచ్చినప్పటి లాగానే ఇప్పుడూ వ్యవహరించటానికి అవసరమైన మద్దతును రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు అందించాయి. బిజెపికి పార్లమెంటులో తగినంత బలం లేని పరిస్థితిని ఉపయోగించుకొని, ఆ పార్టీపై వత్తిడి తీసుకొచ్చి, రాష్ట్ర ప్రయోజనాలను సాధించటానికి మారుగా, ఆ పార్టీ ప్రభుత్వానికి మద్దతివ్వటమే మహాభాగ్యం అన్నట్లుగా ఈ పార్టీలు వ్యవహరిస్తున్నాయి. రాష్ట్రంలోని 25 పార్లమెంటు స్థానాలలో టిడిపి 16, జనసేన, బిజెపి, వైసిపిలు తలో మూడు స్థానాల చొప్పున గెలుచుకున్నాయి. బిజెపి గెలిచిన మూడు స్థానాలు టిడిపి, జనసేన మద్దతుతో గెలుచుకున్నవి మినహా రాష్ట్రంలో స్వంతంగా ఒక్క స్థానాన్ని గెలిచే బలం కూడా ఆ పార్టీకి లేదు. ఆ విధంగా పార్టీని అప్పనంగా మూడు స్థానాలలో గెలిపించటమే కాక, తాము గెలిచిన 19 స్థానాలతో కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని బలపరచటంతో పాటు, ప్రభుత్వంలో భాగస్వాములు కూడా అయ్యారు. టిడిపి కూటమికి వ్యతిరేకంగా (ఆ కూటమిలో ఉన్న బిజెపికి కూడా వ్యతిరేకంగా) పోటి చేసి, మూడు స్థానాలలో గెలిచిన వైసిపి కూడా బిజెపికి షరతులతో కూడిన మద్దతిస్తామని చెబుతూ బేషరతు మద్దతును అందిస్తున్నది.

బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉండటానికి, చట్టాలను ఆమోదించుకోవటానికి పార్లమెంటులో టిడిపి బలం ప్రధానం కాగా, రాజ్యసభలో వైసిపి బలం అత్యవసరంగా ఉన్నది. రాజ్యసభలో కూడా బిజెపికి మెజారిటీ లేదు. రాష్ట్రం నుండి 11 మంది రాజ్యసభ సభ్యులు ఉండాలి. ఇప్పుడు 11 మందీ వైసిపి సభ్యులే ఉన్నారు. మొత్తం 240 మంది సభ్యులున్న రాజ్యసభలో బిజెపికి 97 మంది సభ్యులు ఉన్నారు. ఎన్‌డిఎకు 117 మంది ఉన్నారు. రాజ్యసభలో మెజారిటికి బిజెపి 24 స్థానాల దూరంలో ఉండగా, ఎన్‌డిఎ కూటమిగా చూసినా నాలుగు స్థానాలు తక్కువ ఉన్నాయి.

ఇటువంటి పరిస్థితులలో బిజెపిపై ఒత్తిడి చేయటానికి, మన రాష్ట్రానికి రావలసిన నిధులు, హక్కులను సాధించుకోవటానికి అన్ని అవకాశాలు ఉన్నాయి. కాని రాష్ట్రానికి అవసరమైన ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటం, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం, విశాఖ రైల్వేజోన్, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం అవసరమైన నిధులు తదితరాలపై టిడిపి, జనసేన, వైసిపిలు నోరు మెదపటం లేదు. ముఖ్యంగా విశాఖ ఉక్కుఫ్యాక్టరి ప్రైవేటీకరణను నిలుపు చేయించే విషయంలో పాలకపార్టీల అవకాశవాదానికి హద్దులు లేకుండా పోతున్నాయి. విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తున్నామని మూడున్నర సంవత్సరాల క్రితమే బిజెపి ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం అప్పటి నుండి ఉక్కు ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులు ప్రైవేటీకరణను ప్రతిఘటిస్తూ, పోరాటం చేస్తున్నారు. ఆ పోరాటానికి విశాఖ నగరం, ఆంధ్రప్రదేశ్ ప్రజలు సంపూర్ణంగా మద్దతిస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి దోహదం చేసే పరిశ్రమలలో విశాఖ ఉక్కుఫ్యాక్టరీ ప్రధానమైనది. కాని రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఉక్కుఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై దాగుడుమూతలు ఆడుతున్నాయి. వైసిపి, టిడిపిలు ప్రజాభిప్రాయానికి జడిసి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని చెప్పటం మినహా వాస్తవంగా ప్రైవేటీకరణను ఆ పార్టీలు వ్యతిరేకించటం లేదు. గతంలో అధికారంలో ఉన్న వైసిపి, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన టిడిపిలు ప్రైవేటీకరణను విడనాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేయటం లేదు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడి మొదటి ఢిల్లీ పర్యటనలో కేంద్రమంత్రులతో చేసిన చర్చలలో ఉక్కుఫ్యాక్టరీ ప్రైవేటీకరణను నిలుపు చేసే అంశం కనీసం ప్రస్తావనకు కూడా నోచుకోలేదు.

పార్లమెంటులో ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాం కాబట్టి ఆంధ్రప్రదేశ్‌కు చట్టబద్ధంగా రావలసిన నిధులు ఇవ్వాలని, విభజన సమస్యలను పరిష్కరించాలని మాట మాత్రంగా కూడా ప్రస్తావించలేదు. బడ్జెట్ రాష్ట్రానికి ఇచ్చింది నామమాత్రమైనా ఏదో గొప్పగా ఇచ్చినట్లు, టిడిపి సాధించినట్లు అతిశయోక్తులు ప్రచారం చేసుకొంటున్నారు. బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశ పెట్టిన రోజు రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 15 వేలకోట్ల రూపాయలు గ్రాంటుగా ఇచ్చినట్లు టిడిపి ప్రచారం చేసుకుంది. మీడియాలోని ఒక సెక్షన్‌లో కూడా విస్తృతంగా ప్రచారం జరిగింది. కాని వాస్తవంగా రాజధాని నిర్మాణానికి అంతర్జాతీయ సంస్థల నుండి 15 వేలకోట్ల రూపాయల రుణం ఇప్పిస్తామని మాత్రమే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చెప్పింది. రాజధానికి, రాష్ట్రానికి నిధులు ఇస్తామని

> **“ టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వైసిపి ప్రభుత్వం వివిధ రంగాలలో వ్యవహరించిన తీరు, ప్రజలపై వేసిన భారాలపై శ్వేత పత్రాలు ప్రకటించాలని నిర్ణయించారు. ఆ విధంగానే వివిధ రంగాలపై శ్వేతపత్రాలను ప్రకటించారు. వైసిపి ప్రభుత్వ ఆర్థిక విధానాల ఫలితంగా ఏడు లక్షల కోట్ల రూపాయల ఆదాయం కోల్పోయామని శ్వేతపత్రాలలో చెప్పారు. ఎక్సైజ్ విధానం వలన 18,860 కోట్ల రూపాయలు, విద్యుత్‌రంగంలో 1,29,503 కోట్ల రూపాయల నష్టం వచ్చిందని శ్వేతపత్రాలలో చెప్పారు. ”**

నిర్దిష్టంగా చెప్పకపోయినా, విభజన సమస్యలలో ఏ ఒక్కదానిని పరిష్కరిస్తామని ప్రకటించకపోయినా, కేంద్ర బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి ఏదో ఒరగబెట్టబోతున్నట్లుగా టిడిపి ప్రచారం చేసుకోవటం మన రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుంది. కేంద్రం ఇవ్వకపోయినా రాష్ట్రానికి అన్ని ఇస్తున్నట్లుగా ప్రచారం చేసుకోవటం ఎవరికి ప్రయోజనం కలిగించటానికి? ఏమీ ఇవ్వకపోయినా ఎక్కువగా ఇచ్చినట్లు ప్రచారం చేసుకోవటం రాష్ట్రాభివృద్ధిని గురించి పట్టించుకోని కేంద్ర ప్రభుత్వంపై ప్రజలకు వ్యతిరేకత రాకుండా చూడటానికి, రాష్ట్రానికి నిధులు, విభజన హామీలను సాధించలేని తమ చేతగాని తనాన్ని కప్పిపెట్టుకోవటానికి మాత్రమే ఉపయోగపడుతుంది. రాష్ట్ర ప్రయోజనాలకు ఏ మాత్రం దోహదం చేయదు.

పోలవరానికి నిధులిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అదేదో గొప్ప కార్యమైనట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు. అది ఎప్పుడూ చెబుతున్న మాటే. పోలవరానికి సంబంధించి పెరుగుతున్న ప్రాజెక్టు వ్యయాన్ని, అందులో భాగమైన పునరావాస, పునర్నిర్మాణ వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం ఇంత వరకు పూర్తిగా ఇస్తామని అంగీకరించలేదు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఖర్చును కూడా తర్వాత ఎపుడో ఇవ్వటం మినహా ముందస్తుగా నిధులు ఇస్తున్నదీ లేదు. ఇపుడు బిజెపి ప్రభుత్వం అదనంగా ఇస్తామన్నదీ లేదు.

టిడిపి 2014 లో అధికారానికి వచ్చినపుడు కూడా ఇలాగే వ్యవహరించింది. విభజన హామీలను అమలు చేయించే అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయకుండా తామేదో గొప్పగా సాధించినట్లు ప్రచారం చేసుకున్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వటం లేదని, దానికి బదులుగా ప్యాకేజి ఇస్తామని ఆనాడు కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేయటానికి పూనుకున్నా దానికి వ్యతిరేకంగా పోరాటం చేయలేదు. కేంద్ర ప్రభుత్వం ప్యాకేజి పేరుతో ఏమీ ఇవ్వకుండానే రాష్ట్రానికి ఏదో గొప్పగా చేస్తున్నట్లు మోసం చేయటానికి ప్రయత్నం చేస్తే, దానిలో వీరు కూడా భాగస్వాములై దానిని ప్రజల చేత మింగించటానికి ప్రయత్నం చేశారు. చివరికి ప్రజలలో పెరుగుతున్న వ్యతిరేకతను గమనించి, ప్రత్యేక హోదా, ఇతర సమస్యలను సాధిస్తామంటూ ఎన్నికలు జరగటానికి సంవత్సరం ముందు కేంద్ర ప్రభుత్వం నుండి బయటికి వచ్చినా, 2019 ఎన్నికలలో ప్రజలు వారి అవకాశవాదానికి తగిన శిక్ష వేసి అధికారానికి దూరం చేశారు. ఇప్పుడు తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆనాడు ప్రదర్శించిన విన్యాసాలనే ఈనాడు కూడా ప్రదర్శిస్తున్నారు. దీనిని రాష్ట్ర ప్రజలు సహించరు. అందువలన తెలుగుదేశం పార్టి తమ అవకాశవాదాన్ని పక్కన పెట్టి, రాష్ట్ర ప్రయోజనాల సాధనకు పూనుకుంటేనే ప్రజలిచ్చిన అధికారానికి న్యాయం చేసినవారవుతారు. కేవలం కొద్దిమంది వ్యక్తుల ప్రయోజనాలే లక్ష్యంగా బిజెపితో అంటకాగటానికి ప్రయత్నిస్తే రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరవు. టిడిపి ఈ అంశాలను గమనంలో ఉంచుకొని వ్యవహరిస్తే రాష్ట్రంతో పాటు ఆ పార్టీకి కూడా మేలు జరుగుతుంది.

### ప్రజలపై భారాలు తగ్గటానికి శ్వేతపత్రాలు దోహదం చేస్తాయా?

టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వైసిపి ప్రభుత్వం వివిధ రంగాలలో వ్యవహరించిన తీరు, ప్రజలపై వేసిన భారాలపై శ్వేతపత్రాలు ప్రకటించాలని నిర్ణయించారు. ఆ విధంగానే వివిధ రంగాలపై శ్వేతపత్రాలను ప్రకటించారు. వైసిపి ప్రభుత్వ ఆర్థిక విధానాల ఫలితంగా ఏడు లక్షల కోట్ల రూపాయల ఆదాయం కోల్పోయామని శ్వేతపత్రాలలో చెప్పారు. ఎక్సైజ్ విధానం వలన 18,860 కోట్ల రూపాయలు, విద్యుత్‌రంగంలో 1,29,503 కోట్ల రూపాయల నష్టం వచ్చిందని శ్వేతపత్రాలలో చెప్పారు. విద్యుత్ రంగానికి సంబంధించిన నష్టంలో వినియోగదారులపై వేసిన భారం 32,166 కోట్ల రూపాయలు, విద్యుత్ సంస్థలకు వాటిల్లిన నష్టం 49,496 కోట్ల రూపాయలు, అసమర్ధ నిర్వహణ వలన వచ్చిన నష్టం 47,741 కోట్ల రూపాయలని పేర్కొన్నారు. ఇంకా ఇసుక, మైనింగ్ విధానం వలన వచ్చిన నష్టాలను కూడా ఆయా రంగాలకు సంబంధించి జారీ చేసిన శ్వేతపత్రాలలో పేర్కొన్నారు.

విద్యుత్‌రంగానికి సంబంధించిన శ్వేతపత్రంలో నష్టాలతో పాటు ప్రజలపై వేసిన భారాలను పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో గృహ వినియోగదారులపై 32,166 కోట్ల రూపాయల భారాలను వేసినట్లు చెప్పారు. అంటే సంవత్సరానికి సగటున 6,400 కోట్ల రూపాయలకు పైగా భారాలను వేశారు. విద్యుత్ ఛార్జీల పెంపుదల, గతంలో వాడిన విద్యుత్‌కు అదనంగా చెల్లించాల్సిన ఛార్జీల రూపంలో వైసిపి ప్రభుత్వ హయాంలో ఈ భారాలను మోపారు. గత వినియోగానికి వసూలు చేస్తున్న ఛార్జీలను ప్రజలు ఇప్పటికీ చెల్లిస్తున్నారు. టిడిపి ప్రభుత్వం ఈ అదనపు ఛార్జీల వసూలును ఉపసంహరించటానికి చర్యలు తీసుకొంటే ప్రజలకు తక్షణ ఉపశమనం లభిస్తుంది. గత ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ ఛార్జీలను పెంచటం ద్వారా అనవసర భారం మోపింది కాబట్టి రానున్న ఐదు సంవత్సరాలలో విద్యుత్ ఛార్జీలు పెంచాల్సిన అవసరం ఉండదు. గతంలో వినియోగించిన విద్యుత్‌కు చెల్లించాల్సిన అదనపు ఛార్జీల పేరుతో భారం మోపాల్సిన అవసరం కూడా ఉండదు.

నిర్వహణను మెరుగుపరిస్తే విద్యుత్ సంస్థల ఆదాయాలు పెరుగుతాయని శ్వేతపత్రాలు వెల్లడిస్తున్నాయి. అలా చేస్తే ఆ సంస్థలు చెల్లించాల్సిన రుణాలు తగ్గుతాయి. గత ప్రభుత్వం సౌర విద్యుత్ కొనుగోలు కోసం సెకితో ఒప్పందం చేసుకున్నపుడు ధరల విషయంపై చర్చలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆనాడు ఉన్న మార్కెట్ ధర కన్నా అధిక ధరకు 25 సంవత్సరాల పాటు సెకి

> **"వైసిపి తప్పుడు విధానాల కారణంగా పోయిన ఆదాయాన్ని పొందటానికి చర్యలు తీసుకోకపోతే కేవలం జగన్‌మోహన రెడ్డిని విమర్శించటానికి మాత్రమే రూపొందించిన చిట్టాగా శ్వేతపత్రాలను ప్రజలు భావిస్తారు. జగన్‌మోహనరెడ్డి పరిపాలన సరిగా లేదనే ప్రజలు టిడిపికి అధికారం అప్పగించారు. శ్వేత పత్రాలలో పేర్కొన్నట్లుగా ఆదాయం పెంచకపోయినా, ప్రజలపై వేసిన భారాలను తగ్గించకపోయినా టిడిపి ప్రభుత్వం రూపొం దించిన శ్వేతపత్రాలకు ఎటువంటి విలువా ఉండదు."**

నుండి విద్యుత్‌ను కొనుగోలు చేస్తూ ఒప్పందం చేసుకున్నది. అది ప్రజలపై వేల కోట్ల రూపాయల భారం మోపుతుంది. వ్యవసాయ మోటార్లకు, గృహ వినియోగానికి స్మార్ట్ మీటర్లు బిగించటంతో వేలకోట్ల రూపాయల భారం ప్రజలపై పడటంతో పాటు రైతాంగంపై వ్యవసాయ విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపే ప్రమాదం పొంచివుంటుంది. విద్యుత్ సంస్థలు, వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల అవసరం లేదు. ఇటువంటి భారాలను తగ్గించటానికి టిడిపి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. శ్వేతపత్రాలలో వెల్లడించినట్లు వైసిపి ప్రభుత్వ హయాంలో కోల్పోయిన ఏడు లక్షల కోట్ల రూపాయల ఆదాయాన్ని రానున్న ఐదు సంవత్సరాలలో రాష్ట్ర ఖజానాకు సమకూరేలా చూడాలి. దానికి అదనంగా పెరుగుతున్న ఆదాయం తోడయితే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో వేగంగా పురోగమించేలా చేయవచ్చు.

అలా కాకుండా వైసిపి తప్పుడు విధానాల కారణంగా పోయిన ఆదాయాన్ని పొందటానికి చర్యలు తీసుకోకపోతే కేవలం జగన్‌మోహన రెడ్డిని విమర్శించటానికి మాత్రమే రూపొందించిన చిట్టాగా శ్వేతపత్రాలను ప్రజలు భావిస్తారు. జగన్‌మోహనరెడ్డి పరిపాలన సరిగా లేదనే ప్రజలు టిడిపికి అధికారం అప్పగించారు. శ్వేతపత్రాలలో పేర్కొన్నట్లుగా ఆదాయం పెంచకపోయినా, ప్రజలపై వేసిన భారాలను తగ్గించకపోయినా టిడిపి ప్రభుత్వం రూపొందించిన శ్వేతపత్రాలకు ఎటువంటి విలువా ఉండదు. టిడిపి ప్రభుత్వం ఈ అంశాలను గమనంలో ఉంచుకొని పరిపాలన సాగిస్తుందో లేదో చూడాలి. వీటిపై వ్యవహరించే తీరే ప్రభుత్వం ప్రయాణించే మార్గాన్ని నిర్దేశిస్తుంది.

ప్రభుత్వ విధానాలలోని లోపాలను సరిదిద్ది, శ్వేతపత్రాలలో పేర్కొన్న ఆదాయాలను సక్రమంగా రాబడితే రాష్ట్రాభివృద్ధి వేగం పుంజుకుంటుంది. ప్రజలపై భారాలు తగ్గుతాయి. వారి పరిస్థితులు మెరుగు పడతాయి.



న్యూ ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో
ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భేటీ

### జెపి –హిందూత్వ

పార్లమెంటు ఎన్నికలలో ఓట్లు, సీట్లు తగ్గినప్పటికీ భారతదేశాన్ని హిందూరాష్ట్రగా మార్చటానికి బిజెపి ప్రయాణం కొనసాగు తుందని ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు స్పష్టం చేస్తున్నాయి. గతం నుంచి అమలు జరుగుతున్న మూడు చట్టాలు ఇండియన్ పీనల్ కోడ్, ది కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసిడ్యూర్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియంలను 2023, డిసెంబరు 23న పార్లమెంటు ఆమోదించింది. ఈ చట్టాలు ప్రజాస్వామ్య వ్యతిరేకమైనవి. పోలీసులకు అపరిమితమైన అధికారాలను కట్టబెడతాయి. నిరంకుశ విధానాలను మరింత ముందుకు తీసుకుపోవటానికి దోహదం చేస్తాయని ప్రతిపక్షాలు, ప్రజలు, అనేక సంస్థలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల అభిప్రాయాలను పక్కన పెట్టి జులై 1వ తేదీ నుండి కొత్త చట్టాలను అమలు చేయటం ప్రారంభించింది.

ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు నిధుల కేటాయింపు చేయకుండా, వివక్షతో వ్యవహరించటానికి వ్యతిరేకంగా 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు జులై 27వ తేదీన జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి హాజరు కాలేదు. రాష్ట్రాలను పట్టించుకోని కేంద్రం నిరంకుశ పోకడలే ఇందుకు కారణం. తనకు పూర్తి మెజారిటి వచ్చినపుడు వ్యవహరించిన విధంగానే మైనారిటీ ప్రభుత్వంలో కూడా బిజెపి వ్యవహరిస్తున్నదని ఈ విషయాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే అన్ని విషయాలలోనూ యధేచ్ఛగా వ్యవహరించటం సాధ్యం కాకపోవచ్చు. కాని తన మౌలికమైన హిందుత్వ విధానాల కొనసాగింపులో వెనక్కు తగ్గదని బిజెపి వ్యవహరిస్తున్న తీరు స్పష్టం చేస్తున్నది. బిజెపికి మద్దతిస్తున్న టిడిపి, జెడి(యు), ఇతర పార్టీలు తమ స్వప్రయోజనాలు మినహా దేశప్రయోజనాలను పట్టించుకొనే స్థితిలో లేవు. ఇక మతోన్మాద పోకడలను అవి ప్రతిఘటిస్తాయని భావించటం అత్యాశే అవుతుంది. కాబట్టి, బిజెపి మతోన్మాదాన్ని ప్రతిఘటించటానికి ప్రతిపక్షాలు ప్రజలను సమీకరించాలి. కార్మికులు, కర్షకులు, కష్టజీవులైన ప్రజల ఉమ్మడి ప్రతిఘటనే హిందుత్వ వైపుకు సాగకుండా బిజెపిని నిలువరిస్తుంది.

# ప్రజాస్వామ్యం, వర్గపోరాటం : లెనిన్ భావనలు

*(2వ పేజీ తరువాయి)*

అమలులోకి రావాలంటే అది ఏకపార్టీ నియంతృత్వంగానే వస్తుందని లెనిన్ మరణానంతరం మాత్రమే సిద్ధాంతీకరించడం జరిగింది.

**2**

రాజ్యాంగ సభలో బోల్షివిక్‌లకు మెజారిటీ రాలేదు. అప్పుడు ఆ సభను రద్దు చేయాలని పార్టీ నిర్ణయించింది. ఆ నిర్ణయానికి లెనిన్ ఆమోదం ఉంది. మరి ప్రజాస్వామ్యం పట్ల లెనిన్‌కు గట్టి అభిప్రాయం ఉంటే రాజ్యాంగసభ రద్దుకు ఆమోదం ఎలా తెలిపాడు? అన్న ప్రశ్న తలెత్తుతుంది. అప్పుడు ప్రజల్లో బోల్షివిక్ పార్టీ అంటే చాలా సానుకూలత ఉంది కనుక ఆ విధంగా నిర్ణయించారు అని వివరణ ఇస్తే అది సరైన వివరణ అనిపించుకోదు. సిద్ధాంతంతో సంబంధం లేకుండా ఉండే ఆచరణకు లెనిన్ ఎప్పుడూ పూనుకోలేదు. ప్రజాస్వామ్యం విషయంలో లెనిన్‌కున్న అవగాహనలోని రెండో అంశాన్ని మనం ఇక్కడే చూస్తాం. రాజ్యాంగసభలో బోల్షివిక్‌లు మెజారిటీ కోల్పోడానికి చాలా కాలం ముందునుంచీ లెనిన్‌కి ఈ అవగాహన ఉంది. ప్లెఖనోవ్ కలిగించిన బలమైన ప్రభావం దీనివెనుక ఉంది.

రష్యన్ సోషల్ డెమాక్రటిక్ లేబర్ పార్టీ (ఇదే తర్వాత కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ సోవియట్ యూనియన్ అయింది) రెండవ మహాసభలో జరిగినదాని గురించి కృపస్కయా ఇలా రాశారు:

"విప్లవాన్ని పరిరక్షించడం అనే అత్యున్నత సూత్రానికి కట్టుబడినదే మౌలిక ప్రజాస్వామ్య సూత్రం అవుతుంది అని ప్లెఖనోవ్ చేసిన ప్రసంగం, సార్వత్రిక ఓటుహక్కు అనేదాన్ని కూడా ఈ సూత్రం ప్రాతిపదికనే చూడాలని ఆయన చెప్పిన విషయం వ్లాడిమిర్ ఇల్యిచ్ (లెనిన్)పై గాఢమైన ముద్ర వేశాయి. 14 సంవత్సరాల అనంతరం రాజ్యాంగసభను రద్దు చేయాలా లేదా అన్న ప్రశ్న ఎదురైనప్పుడు ఆయన ఈ విషయాన్ని గుర్తు పెట్టుకునే వున్నారు."

లెనిన్ తీసుకున్న సిద్ధాంతవైఖరి వాస్తవానికి విప్లవానంతరం ఏకపార్టీ పాలనను బలపరుస్తోంది అని కొంతమంది భావించవచ్చు. 'విప్లవాన్ని పరిరక్షించడం అనేదే అత్యున్నత సూత్రం' అన్నది సార్వత్రిక ఎన్నికలలో వచ్చిన తీర్పును సైతం తోసిపుచ్చవచ్చు అంటే మరింకేం అనుకోవాలి? (ఇలా సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును దాదాపు తిరస్కరించే వరకూ బ్రిటన్ 1928లో వెళ్ళింది. మహిళలకు ఓటుహక్కు కల్పించిన అనంతరం జరిగిన ఎన్నికలవి. ఫ్రాన్స్‌లో 1945 ఎన్నికలలో ప్రజలిచ్చిన తీర్పును తిరస్కరించడం జరిగింది) విప్లవాన్ని సాధించిన పార్టీని అధికారం నుండి తొలగించడం బహుశా సాధ్యం కాదు అని, అలా గనుక తొలగిస్తే అది విప్లవానికి ద్రోహం చేయడమే ఔతుంది అని, అలా ద్రోహం తలపెట్టినవారిని అణచివేయడం సరైనది అని ఆ సూత్రం నుంచి నిర్ధారణకు రావచ్చు కదా?

ఈ విధమైన నిర్ధారణ రెండు కారణాల వలన తప్పు. మొదటిది: శ్రామికవర్గ నియంతృత్వం వేరు, పార్టీ నియంతృత్వం వేరు. రెండింటికీ ఉన్న తేడాను చూడాలి. ఒకవేళ శ్రామికవర్గ నియంతృత్వం ఒకే పార్టీ ఆధ్వర్యంలో సాగినా, దానికీ, ఏకపార్టీ నియంతృత్వానికీ మధ్య చాలా తేడా ఉంది. ఒకే పార్టీ ఆధ్వర్యంలో శ్రామికవర్గ నియంతృత్వం అమలు జరిగినా, ఆ పార్టీ కొన్ని పరిమితులకు లోబడి ఖచ్చితంగా వ్యవహరించాల్సివుంటుంది. అక్కడ పాలకవర్గంగా ఉన్న శ్రామికవర్గపు చొరవను, చురుకుదనాన్ని ఎట్టి సందర్భంలోనూ అణచివేయకూడదు. ఒకవేళ ఏకపార్టీ నియంతృత్వం గనుక అమలు జరిగితే ఆ శ్రామిక వర్గం చొరవను, చురుకుదనాన్ని కోల్పోయి నిర్లిప్తంగా మిగిలిపోతుంది. సోవియట్ యూనియన్‌లో జరిగింది ఇదే. అక్కడ కార్మికవర్గం పూర్తిగా రాజకీయ రాహిత్యానికి లోనైంది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం అవుతున్నప్పుడు ఆ కార్మికులు సార్వత్రిక సమ్మెకు దిగడం మాట అటుంచి కనీసం ఎక్కడా నిరసన ప్రదర్శనలు కూడా చేయలేదు. అక్కడ అధికారాన్ని కోల్పోతున్నది తమ వర్గమే అన్న ఆలోచన వారికి కలగలేదు. సోవియట్ పార్టీ, ప్రభుత్వం వారిని ఆ స్థితిలోకి తెచ్చాయి.

సోవియట్ యూనియన్‌లో ఏకపార్టీ నియంతృత్వాన్ని లెనిన్ ఉంటే ఏమాత్రమూ సహించివుండేవాడు కాదు. అది బోల్షివిక్ పార్టీ అయినా సరే. ఎందుకంటే అటువంటి నియంతృత్వం అక్కడ ఉన్న ఏకైక పాలక వర్గాన్ని- అంటే శ్రామికవర్గాన్ని రాజకీయ రాహిత్యానికి గురి చేస్తుంది. అది విప్లవం దెబ్బ తినిపోడానికి దారి తీస్తుంది. ప్లెఖనోవ్ చెప్పిన 'విప్లవ పరిరక్షణే అత్యున్నత సూత్రం' అన్నది పాటిస్తే అప్పుడు ఏకపార్టీ నియంతృత్వం ఎంతమాత్రమూ ఆమోదయోగ్యంగా ఉండదు.

ఇక రెండవది: అక్టోబరు విప్లవం అనంతరం ఏర్పడ్డ పరిస్థితులు అక్కడ త్వరలోనే కేవలం ఒక పార్టీ మాత్రమే ఆ విప్లవాన్ని బలపరిచే స్థితికి తీసుకొచ్చాయి. అది కూడా ప్రపంచంలో రష్యా ఒంటరిపాటైన సమయం లో. అక్టోబరు విప్లవానికి కొద్ది రోజులముందే లియోన్ ట్రాట్స్కీకి చెందిన చిన్న గ్రూపు బోల్షివిక్ పార్టీలో కలిసిపోయింది. బోల్షివిక్ పార్టీతో కలిసి సంఘటనగా వ్యవహరించిన వామపక్ష సోషలిస్టు విప్లవకారులు కొద్ది కాలం కాగానే, బ్రెస్ట్-లిటోవ్స్క్ సంధి విషయంలో విభేదించి సంఘటన నుంచి వైదొలగారు. మరి ఇంకే ఇతర ప్రధాన రాజకీయ పార్టీ విప్లవానికి మద్దత్తుగా నిలబడలేదు. ముఖ్యంగా జూలియస్ మార్టోవ్ నాయకత్వంలోని మెన్షివిక్కులు విప్లవంలో భాగస్వాములు కాకపోవడం పట్ల లెనిన్, బోల్షివిక్ పార్టీ చాలా ఆశాభంగం చెందారు. (ఈ మార్టోవ్ అటు రెండో ఇంటర్నేషనల్ యొక్క అవకాశవాదానికీ, ఇటు మూడవ ఇంటర్నేషనల్ యొక్క విప్లవ తత్వానికీ మధ్య ఉండిపోయినవాడిగా, రెండున్నర ఇంటర్నేషనల్ వాడిగా లెనిన్ ఆ తర్వాత అభివర్ణించాడు) సోవియట్‌ల అఖిల రష్యన్ మహాసభ నుండి మార్టోవ్ మధ్యలో వాకౌట్ చేసినప్పుడు బైట కాపలాగా నిలబడ్డ ఒక బోల్షివిక్ వలంటీర్ "ఈ మార్టోవ్ మాతోటే ఉంటాడనుకున్నామే" అని వ్యాఖ్యానించాడు.

దేశంలోని ఒంటరిపాటుపరిస్థితికి అంతర్జాతీయ ఒంటరిపాటు పరిస్థితి తోడైంది. విప్లవం విజయవంతం అవడానికి పరిస్థితులు పరిపక్వం అయ్యాయనుకున్న జర్మనీలో విప్లవ తిరుగుబాట్లు వరుసగా విఫలమయ్యాయి. ఎక్కువ జనాభా కలిగివున్న దేశాలు ఇండియా, చైనాలు భవిష్యత్తు విప్లవ వేదికలు కానున్నాయంటూ లెనిన్ తన చివరి కాలంలో చేసిన రచనల్లో ఇక యూరప్‌లో సమీప కాలంలో విప్లవ అవకాశాలు దాదాపు సన్నగిల్లినట్టేనని భావించాడు. సామ్రాజ్యవాద దేశాల నడుమ ఉన్న చీలికల కారణంగా సోవియట్ యూనియన్ నిలదొక్కుకోగలిగిందని లెనిన్ భావించాడు. (ఆ సామ్రాజ్యవాద దేశాలు ఉమ్మడిగా సోవియట్ యూనియన్‌ను ఆక్రమించుకోడానికి దండెత్తివచ్చిన అనుభవం ఉన్నప్పటికీ) అప్పటి పరిస్థితుల్లో ఆ సామ్రాజ్యవాద దేశాల్లోని ప్రభుత్వాలను అక్కడ విప్లవాలద్వారా కూలదోయడం ఆ పరిస్థితుల్లో వెంటనే సాధ్యం అయ్యేది కాదని భావించాడు.

ఈ పరిస్థితుల్లో విప్లవానంతరం సోవియట్ యూనియన్‌లో బహుళ పార్టీ పాలన జరిగే అవకాశాలు కొద్ది కాలానికే సన్నగిల్లాయి. విప్లవాన్ని బతికించుకోవడం అనేది ముందు అనుకున్నంత తేలికగా ఇప్పుడు లేదని స్పష్టం అయింది. "సామ్రాజ్యవాదుల గొలుసులో అత్యంత బలహీనంగా ఉన్న లింకును బద్దలు కొట్టడం" అనేది వ్యూహంగా రూపొందించిననాటికన్నా తర్వాత పరిస్థితి జటిలం అయింది. అనివార్యంగా సోవియట్ యూనియన్‌లో ఏకపార్టీ పాలన నడవవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయినప్పటికీ లెనిన్ ఈ పాలనను నియంతృత్వ మార్గాన పోనివ్వకుండా ఆపవలసిన ఆవశ్యకత పట్ల జాగరూకతతోనే ఉన్నాడు. కార్మిక సంఘాల పాత్ర విషయంలో లెనిన్ తీసుకున్న వైఖరిలో ఈ విషయం కనిపిస్తుంది. కేంద్ర కమిటీ సంఖ్యను పెంచి ఆ స్థానాల్లోకి నేరుగా కార్మికులనే తీసుకోవాలని లెనిన్ సూచించాడు. ఒక నాయకుడిచుట్టూ కొద్ది మంది ఒక ముఠాగా ఏర్పడి నియంతృత్వాన్ని చెలాయించే పరిస్థితిని రానివ్వ కూడదని లెనిన్ భావించాడు.

## 3

పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికులు నిర్వహించే పాత్రకూ సోషలిస్టు వ్యవస్థలో వారు నిర్వహించవలసిన పాత్రకూ తేడా ఉంది. కాబట్టి సోషలిస్టు సమాజంలో కార్మికులు రాజ్యం యొక్క ఒక అంగంగా ఉండాలని, అందుకోసం కార్మికుల్ని సైనికీకరించాలని ఒక వాదన ముందుకొచ్చింది. దీనిని లెనిన్ బలంగా వ్యతిరేకించాడు. రాజ్యం వేరు, వర్గం వేరు అని, రెండింటికీ తేడా ఉండాలని వాదించాడు. అది కార్మికవర్గ రాజ్యం అయినప్పటికీ అందులో కూడా కార్మికులకు వారి స్వంత వర్గ సంస్థలు ఉండాల్సిందేనని ఆయన వాదించాడు. అధికారంలో ఉన్న పార్టీ ఆధ్వర్యంలో నడిచే రాజ్యవ్యవస్థతో వ్యవహరించడానికి, మరీ ముఖ్యంగా ఏకపార్టీ ఆధ్వర్యంలో నడిచేటప్పుడు, కార్మికులకు తమ స్వంత వర్గ సంస్థలు ఉండాల్సిందేనని లెనిన్ బలంగా అభిప్రాయపడ్డాడు.

దీనిని బట్టి లెనిన్ ఏకపార్టీ నియంతృత్వానికి వ్యతిరేకి అని చెప్పవచ్చు. అది కార్మికవర్గ రాజ్యం అయినప్పటికీ, ఆ రాజ్యంలో కార్మికవర్గ నియంతృత్వం అమలులో ఉన్నప్పటికీ, రాజ్యవ్యవస్థలో కార్మికవర్గం అంతర్భాగంగా మారిపోకూడదని అభిప్రాయపడ్డాడు. రెండవది: అధికారపార్టీ కార్మికవర్గం స్థానాన్ని ఆక్రమించకూడదని భావించాడు. ఒకవేళ చారిత్రిక కారణాల వలన ఆ రాజ్యంలో ఏకపార్టీ పాలన నడుస్తున్నప్పటికీ ఈ తేడా ఉండాలని భావించాడు.

పార్టీ ఆంతరంగిక నిర్మాణ స్వరూపం విషయంలో కూడా లెనిన్ చాలా మొండిగా నిలబడ్డాడు. ఏం చెయ్యాలి? రాసిననాడే కేంద్రీకృత ప్రజాస్వామ్యం ఆవశ్యకతను బలంగా సమర్థించాడు. పార్టీ ఎడతెగని చర్చల, వాదోపవాదాల వేదికగా మిగిలిపోకూడదని, (మెన్షివిక్కులు అప్పటికి చేస్తున్నది అదే) పరిస్థితుల్లో శక్తివంతంగా జోక్యం చేసుకునే సాధనంగా పార్టీ ఉండాలనిచెప్పాడు. అలా ఉండాలంటే అందుకు తగిన కార్యాచరణను రూపొందించి, అమలు జరిపే సాధనంగా పార్టీ వ్యవహరించాలని, అవసరం అనుకున్నప్పుడు ఆ కార్యాచరణలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చునని, అంతే తప్ప ఏదీ తేల్చకుండా ఎడతెగని చర్చలతో మిగిలిపోకూడదని చెప్పాడు. పార్టీ కార్యకర్తలకు తమ తమ అభిప్రాయాలను కలిగివుండే స్వేచ్ఛ, వాటిని తమ సంబంధిత వేదికలలో వ్యక్తం చేసే స్వేచ్ఛ కలిగివుంటారని స్పష్టం చేశాడు. బుఖారిన్ గ్రూపు బ్రెస్ట్ లిలోవ్స్క్ సంధి పట్ల తమ భిన్నాభిప్రాయాలను తమ స్వంత పత్రిక 'ది కమ్యూనిస్ట్' ద్వారా వ్యక్తం చేశారు. ఆ గ్రూపు వ్యక్తిగత విశ్వాసాలమీద ఆధారపడినట్టు లెనిన్ పరిగణించలేదు. ఆ తర్వాత కాలంలో లెనిన్ జీవించివున్నప్పుడే, సైద్ధాంతిక భిన్నాభిప్రాయా లను బహిరంగంగా ప్రచారం చేయడాన్ని నిషేధించారు. కాని పార్టీలోపల భిన్నాభిప్రా యాల వ్యక్తీకరణకు, వాటిని స్వీకరించడానికి ఆటంకం లేదు.

పార్టీ కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలను అధిగమించి సైద్ధాంతిక విషయాలమీద కేంద్రీకరించాలని లెనిన్ ఆశించిన సంగతి కృపస్కయా వివరించారు. ఈ సందర్భంగా 'ఒకడుగు ముందుకు, రెండడుగులు వెనక్కు' అనే గ్రంథంలో లెనిన్ ఉదహరించిన ఒక ఉదంతాన్ని ఆమె ప్రస్తావించారు.

"పార్టీ రెండవ మహాసభకు పార్టీ కేంద్రం నుండి హాజరైన ఒక ప్రతినిధి ఆ మహాసభలో బోల్షివిక్‌లకు, మెన్షివిక్‌లకు మధ్య తలెత్తిన తీవ్ర విభేదాలు తనను బాగా నీరసపరిచాయని లెనిన్‌తో అన్నారు. అప్పుడు లెనిన్ ఆ ప్రతినిధితో ఇలా అన్నారు:"ఇదెంత గొప్ప విషయం! మన మహాసభలో బాహాటంగా ఘర్షణ పడడానికి, అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి చక్కటి అవకాశం ఉంది. ఏయే ధోరణులు వ్యక్తం అవుతున్నాయో, ఎవరు ఎటువైపున ఉన్నారో స్పష్టం ఔతుంది. ఆ తర్వాత ఓటింగ్ జరుగుతుంది. ఒక నిర్ణయం వస్తుంది. ఒక దశ దాటి ముందడుగు పడుతుంది. అదే నాకు చాలా నచ్చిన అంశం. ఇదే జీవితం. అంతే గాని ఎడతెగని, విసుగుపుట్టించే మేధోపరమైన చర్చలతో కొనసాగి, ఇక సమస్యకు పరిష్కారం లభించినందువలన కాకుండా, మాట్లాడేవాళ్ళు అలసిపోయిన కారణంగా ముగిసిపోయే సమావేశాలకన్నా ఇది ఎంత గొప్ప పద్ధతి !"

ఐతే వాస్తవంగా కామ్రేడ్లలో పక్షపాత ధోరణులు ప్రవేశించినట్లు లెనిన్ గుర్తించాడు. ఈ బలహీనతను వదిలించుకోవలసిన అవసరాన్ని తన చివరి ప్రకటన అయిన వీలునామాలో ప్రస్తావించాడు. "వారిని వ్యక్తిగతంగా నిందించడం సరికాదు. (జినోవీవ్, కామినీవ్ అక్టోబర్‌లో సాయుధంగా తిరుగుబాటు చేయాలన్న ప్రతిపాదనను వ్యతిరేకించారు.) ట్రాట్స్కీని బోల్షివిక్‌లు వ్యక్తిగతంగా నిందించడమూ సరికాదు." అప్పటికే స్టాలిన్‌కు, ట్రాట్స్కీకి నడుమ వ్యక్తిగత సంబంధాలు బాగా దిగజారిపోతున్న సంగతిని లెనిన్ గమనించాడు. దానివలన పార్టీ ఐక్యతకు వాటిల్లనున్న ముప్పును గుర్తించాడు. దానికి పరిష్కారంగా పార్టీ కేంద్ర కమిటీ సంఖ్యను 100కు పెంచాలని, ఆ కమిటీలోకి అంతవరకూ పార్టీలో ముఖ్య బాధ్యతలలో లేని సాధారణ కార్యకర్తలను నేరుగా తీసుకోవాలని ప్రతిపాదించాడు. దాని వలన అంతవరకూ అనుభవం లేని ఆ కార్యకర్తలకు అనుభవం వస్తుందని, పైగా కమిటీలో అంతవరకూ కొనసాగుతున్న వ్యక్తిగత విభేదాల వాతావరణం ప్రభావం వారిమీద ఉండదని, దానివలన కేంద్ర కమిటీ మెరుగ్గా నిర్ణయాలు తీసుకోగలుగుతుందని లెనిన్ భావించాడు.

ఏకపార్టీ పాలన నడిచినా, అది ఒక చిన్న ముఠా యొక్క నియంతృత్వంగా దిగజారిపోకుండా జాగ్రత్త పడడం చాలా అవసరం. అలా జాగ్రత్త పడాలంటే పార్టీ మీద కార్మికవర్గ ప్రభావం పడేలా చూసుకోవాలి. పార్టీలోని ఆంతరంగిక విభేదాలు సైద్ధాంతిక స్వభావాన్ని మాత్రమే కలిగివుండేలా చూసుకోవాలి. పక్షపాత ధోరణులతో, వ్యక్తిగత అభిమాన, దురభిమానాలతో ఏర్పడే ముఠా ధోరణులతో ప్రభావితం కాకూడదు. కేంద్రీకృత ప్రజాస్వామ్యం అంటే తలుపులు మూసేసుకున్న పార్టీ కాదు. అది కార్మికులనుండీ రైతులనుండీ అభిప్రాయాలను, సమాచారాన్ని నిరంతరం స్వీకరించేదిగా ఉండాలి.

కార్మికులకు సహజసిద్ధమైన వర్గస్వభావం ఉంటుందని లెనిన్ జాగ్రత్తగా గమనించాడు. ఈ 'సహజసిద్ధ వర్గ స్వభావానికి వెలుపలి నుండి ఆ వర్గ మేధావులు సిద్ధాంతాన్ని మేళవించినప్పుడు మాత్రమే విప్లవ కార్యాచరణ

ముందడుగు వేస్తుంది. ఈ మేళవింపు సవ్యంగా జరగాలంటే పార్టీ కేంద్ర కమిటీలో తప్పనిసరిగా కార్మికుల ప్రాతినిధ్యం ఉండాలని లెనిన్ ఎప్పుడూ కోరుకున్నాడు. మొదట్లో ప్రతీ ఇద్దరు మేధావులకు 8 మంది చొప్పున కార్మికులు కమిటీలో ఉండాలని లెనిన్ భావించినట్టు కృపస్కయా పేర్కొన్నారు. 1905 విప్లవ పరిస్థితుల్లో ఈ నిష్పత్తిని అనేక రెట్లు పెంచి ప్రతీ మేధావికీ వందల రెట్లలో కార్మికులు నాయకత్వంలో ఉండాలని ఆయన కోరుకున్నాడు.

విప్లవానంతరం సోషలిస్టు వ్యవస్థలో తలెత్తిన రాజకీయ అస్తవ్యస్త పరిస్థితులన్నింటికీ లెనిన్ ప్రతిపాదించిన ఏకపార్టీ నియంతృత్వమే కారణం అని భావించడం ఎంత పొరపాటో ఇంతవరకూ చెప్పినదానిని బట్టి గ్రహించవచ్చు. నిజానికి కొన్ని చారిత్రిక పరిస్థితుల కారణంగా ఏకపార్టీ పాలన దిశగా సోవియట్ యూనియన్ అడుగులు పడ్డాయి. అది ఏకపార్టీ నియంతృత్వంగా దిగజారిపోకుండా ఉండేందుకు తన జీవితాంతమూ లెనిన్ తాపత్రయపడ్డాడు. అటువంటి ఏకపార్టీ నియంతృత్వం కార్మికవర్గాన్ని బలహీనపరు స్తుందని, దాని ఫలితంగా విప్లవ పురోగమనం దారి తప్పుతుందని లెనిన్ ఆందోళన పడ్డాడు. ఏకపార్టీ నియంతృత్వం వలన కార్మికులలో ఉండే సహజ వర్గ స్పందన వ్యక్తం కాకుండా ముడుచుకుపోతుందని, కేవలం నాయకుల చుట్టూ మేధావుల సిద్ధాంతమే నిర్ణయాత్మకంగా మారుతుందని భావించాడు.

## 4

పార్టీ కేంద్రకమిటీలోకి 'బైట వ్యక్తుల్ని తీసుకోవాలని లెనిన్ చేసిన సూచన అంతకుముందే ఆయనకు గల అభిప్రాయాలకు అనుగుణంగానే ఉంది. విప్లవం త్వరలో రానున్నది అన్న సమయంలో లెనిన్ రాజ్యం–విప్లవం అనే గ్రంధాన్ని రచించాడు. అందులో విప్లవ ప్రభుత్వాన్ని నిర్వహించడానికి 20 లక్షల మంది కార్మికులను దాని నిర్వహణలో భాగస్వాముల్ని చేయాలని సూచించాడు. శ్రామికవర్గ నియంతృత్వం ఎప్పుడైతే మొదలౌతుందో అప్పటినుంచే రాజ్యం క్షీణత కూడా మొదలౌతుందని సూచించాడు. రాజ్యానికి సంబంధించి లెనిన్ వెలిబుచ్చిన అభిప్రాయాలు కొట్టొచ్చినట్టు ప్రత్యేకంగా మనకి కనిపిస్తాయి. శ్రామికవర్గ రాజ్యం ఏర్పడడం అంటే సాంప్రదాయ అర్ధంలో ఉండే రాజ్యం లేకుండా పోవడం అని అన్నాడు. అంతవరకూ సమాజానికి అతీతంగా మొద్దుబారిపోయిన, నిర్జీవమైన ఒక వ్యవస్థగా ఉండే రాజ్యం విప్లవం తర్వాత క్రమంగా కరిగిపోయి సమాజంలో అంతర్భాగం అయిపోతుందని అన్నాడు. ఈ క్రమంలోనే రాజ్యం క్రమంగా క్షీణిస్తూ అంతరించిపోవడం అనేది విప్లవం విజయవంతం అయిన మరునాటి నుండే మొదలౌతుంది అన్నాడు.

లెనిన్ చివరి వీలునామాలో ఇదే భావన మనకి ప్రతిధ్వనిస్తుంది. అది శ్రామికవర్గం కోసమే ఏర్పడినది అయినప్పటికీ, రాజ్యం మళ్ళీ ఒక సాంప్రదాయ రీతిలోనే, సమాజానికి దూరంగా రూపొందడం, అది కార్మికులయొక్క నియంతృత్వంగా కాకుండా కార్మికులకోసం నియంతృత్వంగా, అది కూడా ఏకపార్టీ పాలన రూపంలో ఏర్పడడం లెనిన్ జీవించివున్న కాలంలోనే చూశాడు. రాజ్యం తనమొద్దుబారిన స్వభావాన్ని వదిలించుకోడానికి కొత్త వ్యక్తులను, ముఖ్యంగా కార్మికులను, రైతులను పార్టీ యొక్క అత్యున్నత విధాయక సంస్థ అయిన కేంద్ర కమిటీలోకి చేర్చుకోవాలని ప్రతిపాదించాడు.

లెనిన్ ఏకపార్టీ నియంతృత్వాన్ని సమర్ధించాడని చేసే వాదనలు తప్పు అని లెనిన్ తన వీలునామాలో చేసిన ప్రతిపాదనలు రుజువు చేస్తున్నాయి. లెనిన్‌కు ముందునుంచీ ఉండిన అభిప్రాయాలను తర్వాత కాలంలో మార్చుకున్నట్టు ఎక్కడా కనిపించదు. విప్లవ వాతావరణం కల్పించిన ఉద్విగ్న పరిస్థితుల్లో లెనిన్ రాజ్యం–విప్లవం గ్రంధాన్ని రచించాడని, ఆ తర్వాత అందులో ప్రకటించిన వైఖరినుండి వెనక్కి తగ్గాడని నోమ్ చామ్‌స్కీ, మరికొంత మంది చెప్తూ ఆ గ్రంధం ఒక విధంగా అరాచక వాదాన్ని వ్యక్తం చేస్తుందని అంటారు. అది పూర్తి సత్యం కాదు. విప్లవం తర్వాత ఏర్పడిన పరిస్థితుల్లో రాజ్యం ఎలా ఉండాలన్న విషయంలో లెనిన్ కొంత వెనక్కి తగ్గినమాట వాస్తవమే. కానీ కార్మిక రాజ్యం అంతకు ముందరి రాజ్య వ్యవస్థలకన్నా గుణాత్మకంగా భిన్నంగా ఉండాలన్న లెనిన్ ఆకాంక్షలో ఎటువంటి మార్పూ లేదు. ఆ రాజ్యం ఆధిపత్యం చెలాయించేదిగా ఉండకూడదని, ఆ రాజ్యం మూలాలు సమాజంలో బలంగా నాటుకునివుండాలని, ఆ సమాజం నుండే తన జవసత్వాలను మున్నెన్నడూ జరగనివిధంగా పొందుతూ పురోగమించాలని భావించిన లెనిన్ చివరివరకూ అదే భావనతో ఉన్నాడు.

ఇక రెండో విషయం ప్రజాస్వామ్యం గురించి: విప్లవ పురోగమనం కోణం నుండి చూసినప్పుడు ప్రజాస్వామ్యం అనేది రాజ్యానికీ సమాజానికీ నడుమ ఉన్న అగాధాన్ని కొంతవరకూ అధిగమించడానికి తోడ్పడుతుంది. బూర్జువా సమాజంలోని అధికార యంత్రాంగం, సైనిక బలగాలు ఎన్నికల ప్రక్రియలోకి రాకుండా అతీతంగా కొనసాగుతాయి. ఆ రెండూ బూర్జువావర్గానికి రెండు ముఖ్యమైన అంగాలుగా ఉంటాయి. ఎన్నికల ప్రక్రియ ద్వారా ఏర్పడిన చట్టసభల అధికారాలపై అవి పరిమితులు కల్పిస్తాయి. ఈ విషయాన్ని మార్క్సిస్టు సిద్ధాంతంలో ప్రముఖంగా ప్రస్తావిస్తారు. రాజకీయ వ్యవస్థ నిజంగా ప్రజాస్వామికీకరించబడాలంటే రాజ్యం ఏ రూపంలోనూ సమాజానికి అడ్డంగా దున్నపోతులా నిలబడి ప్రజల స్వేచ్ఛను హరించకూడదు.


కేవలం ఒక ప్రభుత్వం ఎన్నికల ద్వారా ఏర్పడిందా లేదా? అక్కడ బహుళ పార్టీల విధానం ఉనికిలో ఉందా లేదా ? అన్న దానిని బట్టే ప్రజాస్వామ్యం అంటే ఏమిటో నిర్వచించకూడదు. ఈ అంశాలు నిస్సందేహంగా ముఖ్యమైనవే. కాని వాటి ప్రయోజనం అత్యంత ప్రాథమికమైనది మాత్రమే. వర్తమాన బూర్జువా ప్రపంచంలో ఉగ్రవాదాన్ని ఎదిరించే పేరుతో సాగుతున్న ఉగ్రవాదం అధికార పక్ష రాజకీయంగా నడుస్తోంది. ఎన్నికల ఫలితాలను శాసించే విధంగా డబ్బు ప్రభావం ఎన్నికల ప్రక్రియను దెబ్బ తీస్తోంది. కార్పొరేట్ల మద్దతు పొందగలిగిన ఏ రాజకీయ పార్టీ అయినా ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పరచగలుగుతోంది. ఈ వాస్తవాలను విస్మరించి పైన ప్రస్తావించిన ప్రశ్నలను బట్టి మాత్రమే ప్రజాస్వామ్యాన్ని నిర్ధారించడం సరైనది కాదు. ప్రజాస్వామ్యపు మౌలిక సారాంశానికి లెనిన్ ఆఖరుదాకా కట్టుబడివున్నాడు. శ్రామికవర్గ నియంతృత్వం పేరుతో సాగిన ఏకపార్టీ పాలన విషయంలో సైతం లెనిన్ వైఖరి అదే.

## 5

లెనిన్ వీలునామా, ప్రకటన తొలుత మెన్షివిక్ పత్రికలలో రావడం అంతుబట్టని విషయం. ఆ వీలునామాను సోవియట్ కమ్యూనిస్ట్ పార్టీ పరిగణనలోకి తీసుకుంది కాని దానికి అనుగణంగా చర్యలు తీసుకోలేదు. ఏకపార్టీ పాలన మొద్దుబారిపోయి ఏకపార్టీ నియంతృత్వంగా దిగజారింది. శ్రామికవర్గ నియంతృత్వం అంటే ఈ రూపంలోనే అమలు జరుగుతుంది అని, ఇది అవశ్యమైన రూపం అని పార్టీ సిద్ధాంతీకరించింది. దీని పర్యవసానంగా కార్మికులు రాజకీయాలకు దూరమైపోయారు. దాని వలన వారి సహజాత వర్గ స్పందనలు అణచివేయబడ్డాయి. ఫలితంగా విప్లవం బలహీనపడింది. ఎన్నో చారిత్రిక విజయాలు సాధించి, ఫాసిజాన్ని ఓడించిన ఘనతను పొంది, వలసదేశాల విముక్తికి తోడ్పడి, ప్రపంచంలో ఎన్నడూ కనీ వినీ ఎరుగని విధంగా సంక్షేమరాజ్యాన్ని నడిపిన సోవియట్ యూనియన్ 1989లో పతనం అవడానికి దారి తీసింది.

**(స్వేచ్ఛానుసరణ: ఎంవిఎస్ శర్మ)**

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 20, issue: 3 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36



# కష్టాలు వచ్చినప్పుడే ప్రజలకు తమ శక్తినీ, స్థిరత్వాన్ని ప్రదర్శించే అవకాశం వస్తుంది

**- హో చి మిన్**

"వియత్నాం ప్రజలు స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛనూ, శాంతిని గాఢంగా కోరుకుంటారు. కానీ వాళ్లపై అమెరికా దురాక్రమణకు దిగేసరికి తట్టుకోలేకపోయారు. అందరూ ఒక్కటై దురాక్రమణను ప్రతిఘటించారు.

ఒక విషయం గుర్తుంచుకోండి! తుపాను వచ్చినప్పుడే పైన్, సైప్రస్ చెట్లకు తమ శక్తినీ, స్థిరత్వాన్ని ప్రదర్శించుకునే అవకాశం వస్తుంది. కష్టాలు వచ్చినప్పుడే ప్రజలకు అటువంటి అవకాశం లభిస్తుంది.

"పదేళ్లలో ఫలితం రావాలంటే చెట్లు నాటు, వందేళ్లలో ఫలితం రావాలంటే ప్రజలను తీర్చిదిద్దు.

"మీరు (అమెరికన్లు) మా వాళ్లను (వియత్నాం ప్రజలను) పదిమందిని చంపితే మేము మీలో ఒక్కరిని చంపగలం. చివరికి అలసిపోయేది మీరే.

"మా పర్వతాలు నిత్యం ఇక్కడే ఉంటాయి, మా నదులూ ఇక్కడే ఉంటాయి. మా ప్రజలు కూడా ఇక్కడే ఉంటారు. అమెరికన్ దురాక్రమణ దారులను ఓడించాక మేము మా దేశాన్ని పదింతలు అందంగా పునర్నిర్మించుకుంటాం.

"స్వాతంత్ర్యం, స్వేచ్ఛకు మించిన గొప్ప సంపద లేదు. బానిసత్వంలో బ్రతకడం కన్నా అన్నింటినీ త్యాగం చేయడం మిన్న.

'నిన్ను నీవు ఎంతగా ప్రేమిస్తున్నావో ఇతరులను కూడా అంతగానే ప్రేమించు."

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా** — **పోస్టు స్టాంపు**
ఇంటి నెంబరు ......................................................
వీధి ......................................................
గ్రామం ......................................................
మండలం లేదా పట్టణం ......................................................
జిల్లా ......................................................

email : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.